V3 NEWS

www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

శనివారం
21-09-2024

సంపుటి : 01 | సంచిక : 139 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్




# సుప్రీంకు తిరుమల లడ్డూ వ్యవహారం

## జోక్యం చేసుకోవాలని సీజేఐకి వినతి.. లేఖ రాసిన న్యాయవాది సత్యంసింగ్



**ఢిల్లీ:** తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం వ్యవహారం దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. లడ్డూ ప్రసాదంలో వినియోగించిన నెయ్యిలో జంతువుల కొవ్వుల ఆనవాళ్లు ఉన్నట్లు ల్యాబ్ నివేదికలో తేలిందని సీఎం చంద్రబాబుతో పాటు టీటీడీ ఈవో వెల్లడించిన విషయం తెలిసిందే. అయితే, ఈ వ్యవహారంలో కఠిన చర్యలు తీసుకోవాలనే డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి. తాజాగా ఈ అంశంపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. సర్వోన్నత న్యాయస్థానం జోక్యం చేసుకోవాలంటూ ఓ లెటర్ పిటిషన్ దాఖలైంది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్‌కి సత్యం సింగ్ అనే న్యాయవాది లేఖ రాశారు. తిరుమల లడ్డూల తయారీలో ఉపయోగించే నెయ్యిలో జంతువుల మిగతా2లో...



# బెంగళూరులో భారత తొలి హైస్పీడ్ రైలు తయారీకి రంగం సిద్ధం

- సెప్టెంబర్ 19న ముగిసిన బిడ్లు
- బీఈఎంఎల్ మాత్రమే కొటేషన్ దాఖలు
- గంటకు 280 కిలోమీటర్ల వేగంగా వెళ్లే సామర్థ్యంతో నిర్మించాలి

**బెంగళూరు:** భారత్లో తొలి హైస్పీడ్ రైలు తయారీకి బెంగళూరులో రంగం సిద్ధమైంది. ముంబయి-అహ్మదాబాద్ రైలు కారిడార్లో దీనిని వినియోగించనున్నారు. ఇప్పటికే ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ సెప్టెంబర్ 5వ తేదీన హైస్పీడ్ చైర్కార్ ట్రెయిన్ తయారీకి సంబంధించిన టెండర్ను విడుదల చేసింది. గంటకు 280 కిలోమీటర్ల మిగతా2లో...

# కాంగ్రెస్ పార్టీకి మరో ఛాన్స్ ఇవ్వొద్దు

- తెలంగాణ రైతుల్ని పట్టించుకునేవారే లేరు
- రుణమాఫీ చేస్తామని మోసం చేసింది
- తుక్డే తుక్డే గ్యాంగ్, అర్బన్ నక్సల్స్ నడిపిస్తున్నారు
- నేడు పార్టీలో దేశభక్తి అనే శ్వాస లేదు
- కర్నాటకలో గణపతి బప్పను చెరశాలలో వేశారు
- విశ్వకర్మ స్కీమ్‌తో గత ఏడాదిలో 20 లక్షల మంది లబ్ధి
- వార్ధా సభలో ప్రధాని మోదీ వ్యాఖ్యలు



2





# సింగరేణి కార్మికులకు దసరా కానుక

## దసరాకు ముందే కార్మికుల కుటుంబాల్లో పండగ

- కార్మిక కుటుంబాలకు అందనున్న మొత్తం రూ.796 కోట్లు
- ఒక్కో కార్మికునికి రూ.1.90 లక్షలు
- తొలిసారిగా కాంట్రాక్ట్ కార్మికులకూ రూ.5 వేలు అందజేత
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**విశ్వంభర,హైదరాబాద్:**

సింగరేణి కార్మికులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీపి కబురు అందించారు. సింగరేణి కార్మిక కుటుంబాల్లో ఆనందం నింపడమే లక్ష్యంగా దసరాకు ముందే బోనస్ ప్రకటించారు. గతేడాది సింగరేణి సంస్థ ఉత్పత్తి, గడించిన లాభాల ఆధారంగా బోనస్‌ను ప్రకటించినట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. ఒక్కో కార్మికునికి రూ.1.90 లక్షలు, కాంట్రాక్ట్ కార్మికులకు రూ.5 వేలు చొప్పున బోనస్ ప్రకటించారు. రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన ప్రక్రియలో సింగరేణి కార్మికులు అగ్రభాగాన నిలిచారని, ఉద్యమాన్ని పతాక స్థాయికి తీసుకెళ్లడంతో గని కార్మికుల పాత్ర మరువలేనిదని ముఖ్యమంత్రి కొనియాడారు. అనంతరం సింగరేణి లాభాలు, విస్తరణ.. బోనస్‌కు సంబంధించిన వివరాలను మిగతా2లో...

# ప్రభుత్వం గత పదేళ్లుగా నిద్రపోతోంది

- హత్యల్లో, కిడ్నాపింగ్‌లలో నెంబర్ వన్
- ప్రజలారా మీరు మేల్కొండి..! కాంగ్రెస్ లావో.. హర్యానా బచావో'
- హర్యానా ప్రభుత్వంపై ఖర్గే వ్యంగ్యాస్త్రాలు



10

# ప్రజల మనోభావాలతో చెలగాటం ఆడొద్దు

- శ్రీవారి లడ్డూ కల్తీ గురించి తెలిసి దిగ్భ్రాంతికి గురయ్యాను
- లడ్డూ ప్రసాదంపై ఫిర్యాదులు అందాయి
- గత టీటీడీ ఛైర్మన్, ఈవో పట్టించుకోలేదు
- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



2

# రూ.93వేల కోట్లు ఖర్చయితే.. రూ. లక్ష కోట్ల అవినీతి ఎలా?



- కాంగ్రెస్‌ది అటెన్షన్ డైవర్ట్ పాలిటిక్స్
- కాళేశ్వరం జలాలతో నిండు కుండలా ఉంది
- మల్లన్న సాగర్‌ను సందర్శించిన హరీశ్ రావు

2

## లోయలో పడిన బస్సు..

# ముగ్గురు జవాన్లు మృతి

2

మరిన్ని తాజా వార్తల కోసం **స్కాన్** చేయండి



## నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
| --- | --- |
| ₹ 105 | ₹ 127 |
| **స్కిన్** | **స్కిన్ లెస్** |
| ₹ 184 | ₹ 210 |



# హైడ్రాకు పూర్తి స్వేచ్ఛ

- పలు విభాగాల నుంచి సిబ్బంది కేటాయింపు
- జనవరి నుంచి అన్ని రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం
- కేబినెట్ భేటీలో పలు నిర్ణయాలు

**వి శ్వంభర, హైదరాబాద్:** ప్రభుత్వ స్థలాలు, చెరువులు, నాలాల్లో అక్రమ నిర్మాణాలను కూల్చివేసేందుకు తీసుకువచ్చిన హైడ్రాకు పూర్తి స్వేచ్ఛ ఉండేలా నిబంధనలు సడలించడానికి రాష్ట్ర కేబినెట్ నిర్ణయించింది. సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన శుక్రవారం తెలంగాణ మంత్రివర్గ సమావేశం పూర్తి అయింది. కేబినెట్ భేటీ అనంతరం నిర్ణయాలను మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డిలు మీడియాకు వివరించారు. హైడ్రాకు అవసరమైన సిబ్బందిని పలు విభాగాల నుంచి డిప్యుటేషన్‌పై రప్పిస్తున్నామని వెల్లడించారు. ఆ విభాగానికి 169 మంది అధికారులు, 964 మంది ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని కేటాయిస్తున్నామని తెలిపారు. ఈ ఖరీఫ్ నుంచి ఎంఎస్‌పీకి అదనంగా రూ.500 : కేబినెట్ భేటీ అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరాలు వెల్లడించారు. మిగతా2లో...

## ఓటుకు నోటు కేసును వేరే కోర్టుకు బదిలీ చేయాల్సిన

# అవసరం లేదు

- ఊహాజనితమైన అంశాలతో పిటిషన్ వేశారు
- విచారణ దశలో జోక్యం చేసుకోలేం: సుప్రీం
- కేసు విచారణలో సీఎం రేవంత్ జోక్యం చేసుకోకూడదని ఆదేశం



2

# ప్రతి నెల ఒకటో తేదీన పేదల సేవలో కార్యక్రమం



2

- ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, అధికారులు పేదల ఇళ్లకు వెళ్లాలి
- వారి కష్టాలు తెలుసుకుని సహాయం అందించాలి
- సీఎం చంద్రబాబు ఆదేశాలు

## బెంగళూరులో భారత తొలి హైస్పీడ్ రైలు తయారీకి రంగం సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)
వేగంగా వెళ్లే సామర్థ్యంతో వీటిని నిర్మించాలన్నారు. దీని బిడ్ల దాఖలకు సెప్టెంబర్ 19తో గడువు ముగిసింది. దీనికి బీఈఎంల్ మాత్రమే కొటేషన్ దాఖలు చేసింది. దీని పై ఐసీఎఫ్ జనరల్ మేనేజర్ యు. సుబ్బారావ్ విలేకర్లతో మాట్లాడుతూ త్వరలోనే టెండర్ ప్రక్రియ ముగుస్తుందన్నారు. ఇక బీఈఎంల్ కేంద్రంలో తయారుకానున్న ఈ రైలుకు రెండున్నరేళ్ల గడువు ఉంటుంది. రైలు అసలు ధరను మాత్రం ఇప్పటివరకు బహిర్గతం చేయకపోయినా.. దాదాపు రూ.200-250 కోట్ల మధ్యలో ఉండొచ్చని భావిస్తున్నారు. ముంబయి-అహ్మదాబాద్ మధ్య దాదాపు 508 కిలోమీటర్ల మార్గంలో సిద్ధమైన హైస్పీడ్ కారిడార్లో వినియోగించనున్నారు. దీనిని దాదాపు రూ.1.1 లక్షల కోట్లతో నిర్మించనున్నారు. వాస్తవంగా జపాన్లో తయారుచేసిన రైళ్లను ఈ మార్గంలో నడపాలని తొలుత భావించారు. కానీ, నిర్మాణవ్యయం భారీగా ఉండటంతో దేశీయంగా తాజాగా నిర్ణయించారు. ఈ ప్రాజెక్టు కోసం వాస్తవంగా జపాన్లో తయారుచేసిన రైళ్లను ఈ మార్గంలో నడపాలని తొలుత భావించారు. కానీ, నిర్మాణవ్యయం భారీగా ఉండటంతో దేశీయంగా తాజాగా నిర్ణయించారు. ఈ ప్రాజెక్టు కోసం బీఈఎంల్, మేధా సెర్వో డ్రైవ్స్ కలిసి పని చేయనున్నట్లు తెలుస్తోంది. ఐరోపా ప్రమాణాలకు అనుగుణంగా ఈ సరికొత్త రైలు సిద్ధం కానుంది. మేధా హైస్పీడ్ ప్రొపెల్షన్ వ్యవస్థలను తయారుచేస్తుంది. ఇప్పటికే వందేభారత్ రైళ్లలో ఈ టెక్నాలజీని వినియోగిస్తున్నారు.

## సుప్రీంకు తిరుమల లడ్డూ వ్యవహారం..

(మొదటి పేజీ తరువాయి)
కొవ్వులు ఉందని ల్యాబ్ నివేదికల్లో తేలిందని.. ఈ క్రమంలో సత్యసింగ్ విజ్ఞప్తి చేశారు. గత టీటీడీ బోర్డు హయాంలో ప్రసాదంలో మాంసాహార ఉత్పత్తులను ఉపయోగించినట్లు బయటపడిందని.. ఈ చర్య హిందూ మతపరమైన ఆచారాలు, ప్రాథమిక సిద్ధాంతాలను ఉల్లంఘించడంతో పాటు మత విశ్వాసాలపై దాడి చేసినట్లేనన్నారు. ప్రసాదంలో ఈ తరహాలో పదార్థాలు ఉపయోగించడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 25(1) ప్రకారం రాజ్యాంగ పరిరక్షణపై దాడికి పాల్పడడమేనని.. ఆర్టికల్ 25(1) ప్రకారం అందరికీ మత స్వేచ్ఛ ఉంటుందని లేఖలో పేర్కొన్నారు. పవిత్ర నైవేద్యాన్ని మాంసాహారంతో కలుషితం చేయడం భక్తుల హక్కులను ఆలయ నిర్వాహకులు కాలరాయడమేనన్నారు. ప్రభుత్వం నియమించిన అధికారుల పర్యవేక్షణలోనే తిరుమలలో ఉల్లంఘన జరిగిందనే వాస్తవాన్ని దృష్టిలో ఉంచుకుని జోక్యం చేసుకోవాలని సత్యం సీజేఐని కోరారు.

## ఓటుకు నోటు కేసును వేరే కోర్టుకు బదిలీ చేయాల్సిన అవసరం లేదు

**విశ్వంభర, హైదరాబాద్:** ఓటుకు నోటు కేసును వేరే కోర్టుకు బదిలీచేయాలనే పిటిషన్‌పై సుప్రీంకోర్టు తుది ఉత్తర్వులు జారీ చేసింది. కేసును వేరే కోర్టుకు బదిలీ చేయాలని బీఆర్ఎస్‌కు చెందిన మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి వేసిన పిటిషన్‌ను విచారించిన సుప్రీంకోర్టు, ఆయన అభ్యర్థనను నిరాకరించింది. కేసును భోపాల్‌కు బదిలీ చేయాల్సిన అవసరం లేదని, ఊహాజనితమైన అంశాలతో స్పష్టమైన ఆధారాలు లేకుండా పిటిషన్ వేశారని ధర్మాసనం పేర్కొంది. ప్రస్తుత దశలో జోక్యం చేసుకోలేమని తేల్చి చెప్పింది. కేసు విచారణలో ఏసీబీ డీజీ, సీఎం, హోంమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డికి రిపోర్టు చేయనక్కర్లేదని సుప్రీంకోర్టు తెలిపింది. ట్రయల్ కోర్టు పారదర్శకంగా విచారణ చేయాలని, కేసు విచారణలో సీఎం రేవంత్ జోక్యం చేసుకోకూడదని ఆదేశించింది. కేసు విచారణపై విశ్రాంత జడ్జి పర్యవేక్షణకూ నిరాకరించిన సుప్రీంకోర్టు, భవిష్యత్‌లో సీఎం జోక్యంపై ఆధారాలుంటే కోర్టుకు వెళ్లొచ్చని తుది ఉత్తర్వులు జారీ చేసింది.

## ప్రతి నెల ఒకటో తేదీన 'పేదల సేవలో' కార్యక్రమం



**విశ్వంభర, ఒంగోలు:** ప్రతి నెల ఒకటో తేదీన 'పేదల సేవలో' కార్యక్రమం నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, అధికారులు పేదల ఇళ్లకు వెళ్లి వారి కష్టాలు తెలుసుకుని సహాయం అందించాలని సూచించారు. 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడు గ్రామంలో సీఎం పర్యటించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో చేపట్టిన పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలు, కార్యక్రమాలపై స్థానికులతో చర్చించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "గతంలో జగన్ పర్యటనలో పరదాలు కట్టేవారు. డ్వాక్రా సంఘాల మహిళలను లాక్కుని వచ్చేవారు. మహిళలు రాకపోతే పింఛన్, రేషన్ కోత విధించే పరిస్థితి. వైకాపాని భూస్థాపితం చేయాలని ప్రజలు నిర్ణయించుకున్నారు. అందుకే గతంలో ఎన్నడూ చూడని విధంగా కూటమికి విజయం కట్టబెట్టారు. ఇచ్చిన మాట ప్రకారం ఏప్రిల్ నుంచి పింఛన్ అందిస్తున్నాం" అని వివరించారు.

## ప్రజల మనోభావాలతో చెలగాటం ఆడొద్దు

**విశ్వంభర, అమరావతి:** తిరుమల శ్రీవారి లడ్డూ కల్తీ గురించి తెలిసి దిగ్భ్రాంతికి గురైనట్లు ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. స్వచ్ఛమైన నెయ్యి ధర ఎక్కువ ఉంటుందన్న ఆయన.. తక్కువ ధరకు వస్తుందని ఎలా కొంటారని గత ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. లడ్డూ ప్రసాదంపై ప్రజల నుంచి ఫిర్యాదులు అందాయని.. ల్యాబ్ పరీక్షలు నిర్వహించాలని చాలా మంది ఫిర్యాదు చేశారని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చాక తితిదేలో ప్రక్షాళన చేపట్టామని పవన్ తెలిపారు. ఫిర్యాదులు వస్తున్నా.. తితిదే గత ఛైర్మన్, ఈవో పట్టించుకోలేదని విమర్శించారు. ప్రజల మనోభావాలు గౌరవించకుండా ఆలయ పవిత్రతను దెబ్బతీశారని మండిపడ్డారు. ప్రజల మనోభావాలతో ఎవరూ చెలగాటమాడితే సహించబోమన్నారు.

# సింగరేణి కార్మికులకు దసరా కానుక

(మొదటి పేజీ తరువాయి)
ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విలేకరులకు వివరించారు. *రాష్ట్రానికే తలమానికంగా ఉన్న సింగరేణి సంస్థ రాష్ట్రంలోని విద్యుదుత్పత్తి కేంద్రాలతో పాటు ఇతర సంస్థలకు బొగ్గు సరఫరా చేయడంతో పాటు ఇతర రాష్ట్రాలకు బొగ్గు ఎగుమతి చేస్తోంది. సింగరేణి కార్మికుల శ్రమతో 2023-24 సంవత్సరంలో సంస్థకు మొత్తంగా రూ.4,701 కోట్ల ఆదాయం సమకూరింది. ఇందులో సంస్థ విస్తరణ, పెట్టుబడులకు రూ.2,289 కోట్లు కేటాయించగా మిగిలినవి రూ.2,412 కోట్లు. ఇందులో మూడో వంతు రూ.796 కోట్లను కార్మికులకు బోనస్‌గా ప్రకటిస్తున్నాం. సింగరేణిలో మొత్తం 41,387 మంది శాశ్వత కార్మికులు, ఉద్యోగులు ఉన్నారు. ఒకొక్కరికి బోనస్ కింద రూ.1.90 లక్షలు అందించనున్నాం. గతేడాది సింగరేణి కార్మిలకు అందిన బోనస్ రూ.1.70 లక్షలు మాత్రమే. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ఒకొక్కరికి అదనంగా అందుతున్న మొత్తం రూ.20 వేలు.



**కాంట్రాక్ట్ కార్మికులకూ....**
సింగరేణి సంస్థ చరిత్రలోనే తొలిసారిగా కాంట్రాక్ట్ కార్మికులకూ రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ప్రకటించింది. సంస్థలో 25 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు పని చేస్తున్నారు. వారందరికీ తొలిసారిగా రూ.5 వేల బోనస్‌ను అందజేస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. దసరా పండగకు ముందే ఈ మొత్తాన్ని వారికి అందజేయనున్నట్లు ఆయన చెప్పారు.

**విస్తరణే లక్ష్యంగా...**
సింగరేణి సంస్థ ఆర్జించిన లాభాలను భవిష్యత్ అవసరాలకు తగినట్లు పెట్టుబడులు పెట్టాలని నిర్ణయించామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. దాని ప్రకారం..
సోలార్ విద్యుదుత్పత్తి కేంద్రాన్ని 1000 మెగావాట్లకు విస్తరించడం, రామగుండంలో 500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ ప్లాంట్ నిర్మాణం, జైపూర్‌లోని ప్రస్తుత థర్మల్ విద్యుదుత్పత్తి కేంద్రంలో మరో 1x800 మెగావాట్ల సామర్థ్యం కల మరో థర్మల్ విద్యుదుత్పత్తి కేంద్రం, రామగుండంలో టీఎస్ జెన్ కో ఆధ్వర్యంలో మరో 1x800 మెగావాట్ల థర్మల్ విద్యుదుత్పత్తి కేంద్రం, ఒడిశాలోని నైనీ బ్లాక్‌పైన (పిట్‌హెడ్) 2,400 మెగావాట్ల సామర్థ్యం కలిగిన సూపర్ క్రిటికల్ థర్మల్ విద్యుదుత్పత్తి కేంద్రం ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. సంస్థ పరిధిలోని వీకే ఓపెన్ కాస్ట్, గోలేటీ, నైనీ ఓసీలను ప్రారంభిస్తామని, సింగరేణి కార్మికులు, ఉద్యోగుల పిల్లల కోసం నూతన రెసిడెన్షియల్ పాఠశాలలు, ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, ఏరియా ఆసుపత్రుల ఆధునికీకరణతో పాటు హైదరాబాద్‌లో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు. విలేకరుల సమావేశంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర్ రాజనరసింహ, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్, సింగరేణి ప్రాంత ఎమ్మెల్యేలు గడ్డం వినోద్, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, ప్రేమ్‌సాగర్‌రావు, సింగరేణి ఎండీ బలరాం, కార్మిక సంఘాల నాయకులు వాసిరెడ్డి సీతారామయ్య, జనక్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీకి మరో ఛాన్స్ ఇవ్వొద్దు

**వార్ధా:** కాంగ్రెస్ పార్టీపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు ప్రధాని మోదీ. తెలంగాణ రైతుల్ని కాంగ్రెస్ మోసం చేసిందని ప్రధాని మోదీ అన్నారు. తెలంగాణలో ఎన్నికల సమయంలో రైతుల రుణం మాఫీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ పెద్ద పెద్ద వాగ్దానాలు చేసిందని, కానీ రాష్ట్రంలో పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత రైతుల్ని పట్టించుకోలేదని మోదీ తెలిపారు. తెలంగాణ రైతులు ఇప్పుడు రుణమాఫీ కోసం పడిగాపులు కాస్తున్నారన్నారు. తెలంగాణ రైతుల్ని పట్టించుకునేవారే లేరని ఆయన అన్నారు.అత్యంత అవినీతికర పార్టీ కాంగ్రెస్ అని మోదీ సీరియస్ అయ్యారు. తుక్డే తుక్డే గ్యాంగ్, అర్బన్ నక్సల్స్ ఆ పార్టీని నడిపిస్తున్నట్లు ఆయన ఆరోపించారు. ఈ రోజు చూస్తున్న కాంగ్రెస్ పార్టీకి, మహాత్మా గాంధీ లాంటి వ్యక్తితో లింకున్న పార్టీ కాదు అని అన్నారు. పీఎం విశ్వకర్మ స్కీమ్‌కు ఏడాది పూర్తి అయిన సందర్భంగా మహారాష్ట్రలోని వార్ధాలో జరిగిన సభలో ప్రధాని మోదీ మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో ద్వేషమనే దెయ్యం ఎంటరైనట్లు ఆయన తెలిపారు. నేటి కాంగ్రెస్ పార్టీలో దేశభక్తి అనే శ్వాస లేదన్నారు. కాంగ్రెస్ నేతలు యాంటీ ఇండియా ఎజెండాను కొనసాగిస్తున్నారని, రిజర్వేషన్ వ్యవస్థపై అమెరికాలో వ్యాఖ్యలు చేసిన ఆ పార్టీ నేతను స్వంత పార్టీ నాయకులే తప్పుపడుతున్నారని ఆరోపించారు. అవినీతమయిన పార్టీ ఏదైనా ఉందంటే, అది కాంగ్రెస్ పార్టీనే అని, ఆ పార్టీ కుటుంబీకులే .. అత్యంత అవినీతిపరులని మోదీ విమర్శించారు. గణపతి పూజను కూడా కాంగ్రెస్ పార్టీ ద్వేషిస్తుందన్నారు. గణపతి పూజకు వెళ్తే కూడా కాంగ్రెస్ పార్టీ రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. కర్నాటకలో గణపతి బప్పను చెరశాలలో వేశారని, ఓ విగ్రహాన్ని పోలీసు వ్యాన్‌లో పెట్టారని ఆయన పేర్కొన్నారు. గణపతి బప్పకు జరిగిన అవమానంపై మహారాష్ట్ర కాంగ్రెస్ నేతలు మాట్లాడడం లేదని, వాళ్లు తమ నోటిని కట్టేసుకున్నరాన్నారు. మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయని, మోసాలు.. అబద్ధాలు.. కాంగ్రెస్ పార్టీలో ఉన్నాయని, మహా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. రాజకీయాలు, అవినీతి కోసం కాంగ్రెస్ పార్టీ రైతుల్ని వాడుకున్నట్లు ఆరోపించారు. రైతుల్ని నాశనం చేసిన కాంగ్రెస్ పార్టీకి మరో ఛాన్సు ఇవ్వకూడదని మోదీ అన్నారు. తెలంగాణలో రైతులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ అమలు చేయలేదన్నారు. ఎస్సీలు, ఎస్టీలు, ఓబీసీల ఎదుగుదలను కాంగ్రెస్ అడ్డుకున్నదని, ఈ కులాలను తొక్కిపెట్టిన కాంగ్రెస్‌ను పారద్రోలాలన్నారు. లబ్ధిదారులు కేవలం కార్మికులే కాకూడదని, వాళ్లు ఔత్సాహిక వ్యాపారవేత్తలు కావాలన్నారు. టెక్స్‌టైల్ మార్కెట్‌ను ప్రపంచ వ్యాప్తం చేయాలన్న దీక్ష తమ ప్రభుత్వంలో ఉన్నట్లు చెప్పారు. భారతీయ సంప్రదాయ నైపుణ్యాన్ని దెబ్బీయాలని బ్రిటీష్ పాలకులు కుట్ర పన్నారని, కానీ మహాత్మా గాంధీ గ్రామీణ సంప్రదాయ స్కిల్స్‌కు ఊతం ఇచ్చారని, కానీ స్వాతంత్య్రం తర్వాత దేశాన్ని పాలించినవాళ్లు విశ్వకర్మ వర్గీయులను విస్మరించినట్లు ప్రధాని మోదీ ఆరోపించారు.దీంతో ఆ రంగం కుదేలైందన్నారు. విశ్వకర్మ స్కీమ్‌తో గత ఏడాదిలో 20 లక్షల మంది లబ్ధి పొందారని, మరో 8 లక్షల మంది వివిధ స్కిల్స్‌లో శిక్షణ పొందినట్లు చెప్పారు. విశ్వకర్మ యోజన కేవలం ప్రభుత్వ పథకం కాదు అని, వేల సంవత్సరాల నైపుణ్యాన్ని దేశాభివృద్ధికి వాడుకోవాలన్నారు.

## హైడ్రాకు పూర్తి స్వేచ్ఛ

(మొదటి పేజీ తరువాయి)
ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులకు రూ.4637 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. రెండేళ్లలో పనులు పూర్తి చేయాలని ఏజెన్సీని ఆదేశించామని వెల్లడించారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పరిశీలించి ఇంజినీర్లు, ఏజెన్సీతో మాట్లాడామని వివరించారు. 2027 సెప్టెంబర్‌లోగా ఎస్ఎల్‌బీసీ, డిండి పనులు పూర్తిచేస్తామని స్పష్టం చేశారు. ఈ ఖరీఫ్ నుంచి ఎంఎస్‌పీకి అదనంగా రూ.500 చెల్లించి సన్నాలు కొంటామని వెల్లడించారు.

**కేబినెట్ తీసుకున్న మరికొన్ని కీలక నిర్ణయాలు ఇవే**

- ఓఆర్ఆర్ లోపల 27 అర్బన్, లోకల్ బాడీలు ఉన్నాయి. 51 గ్రామ పంచాయతీలను కోర్ అర్బన్‌లో చేర్చామని మంత్రుల బృందం తెలిపింది.
- ఆర్ఆర్ఆర్ దక్షిణభాగం అలైన్‌మెంట్ ఖరారుకు కమిటీ ఏర్పాటు చేసేందుకు నిర్ణయం.
- ఆర్అండ్‌బీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆధ్వర్యంలో 12 మందితో కమిటీ. కమిటీ కన్వీనర్‌గా ఆర్అండ్‌బీ ప్రిన్సిపల్ సెక్రటరీ.
- పోలీసు ఆరోగ్య భద్రత స్కీమ్ ఎస్‌పీఎల్‌కు కూడా వర్తిస్తుందని మంత్రులు వెల్లడించారు.
- మనోహరాబాద్‌లో 72 ఎకరాల్లో లాజిస్టిక్ పార్క్ ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం.
- 8 మెడికల్ కళాశాలల్లో బోధన, బోధనేతర సిబ్బంది నియామకం. 3వేలకు పైగా పోస్టులకు త్వరలోనే నోటిఫికేషన్ విడుదల.
- ఏటూరునాగారం అగ్నిమాపక స్టేషన్‌కు 34 మంది సిబ్బంది మంజూరు.
- కోస్గి ఇంజినీరింగ్ కళాశాల, హకీంపేటలో జూనియర్ కళాశాల మంజూరు.

## రూ.93వేల కోట్లు ఖర్చయితే.. రూ. లక్ష కోట్ల అవినీతి ఎలా?



**విశ్వంభర, సిద్దిపేట:** కాళేశ్వరం నిర్మాణానికి రూ.93వేల కోట్లు ఖర్చయితే.. రూ. లక్ష కోట్ల అవినీతి ఎలా జరుగుతుందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. శుక్రవారం ఆయన మల్లన్న సాగర్ను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాళేశ్వరం కొట్టుకుపోయిందని కాంగ్రెస్ నేతలు గగ్గోలు పెట్టారని.. కాళేశ్వరం కొట్టుకుపోతే మల్లన్నసాగర్ లోకి నీళ్లు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. కాళేశ్వరం జలాలతో మల్లన్నసాగర్ నిండు కుండలా ఉందన్నారు. బీఆర్ఎస్ ది వాటర్ డైవర్ట్ పాలిటిక్స్ అయితే.. కాంగ్రెస్‌ది అటెన్షన్ డైవర్ట్ పాలిటిక్స్ ఎద్దేవా చేశారు.

## లోయలో పడిన బస్సు.. ముగ్గురు జవాన్లు మృతి

**శ్రీనగర్:** సరిహద్దు భద్రతా దళం బలగాలు ప్రయాణిస్తున్న ఓ బస్సు లోయలో పడిన ఘటనలో ముగ్గురు జవాన్లు మృతి చెందారు. సుమారు మరో 30 మంది గాయపడగా.. అందులో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. జమ్మూకశ్మీర్లోని బుద్గాం జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది. భద్రతా విధుల్లో భాగంగా బీఎస్ఎఫ్ కు చెందిన ఏడు బస్సుల కాన్వాయ్ బయలుదేరింది. ఈ క్రమంలో బ్రెల్ గ్రామం వద్ద ఓ బస్సు అదుపుతప్పి లోయలో పడిపోయింది. సమాచారం అందిన వెంటనే స్థానికులు, సాయుధ బలగాలు అక్కడకు చేరుకొని సహాయ కార్యక్రమాలు చేపట్టాయి. గాయపడిన వారిని స్థానిక ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనలో ముగ్గురు జవాన్లు ప్రాణాలు కోల్పోయినట్లు స్థానిక పోలీసులు వెల్లడించారు.మరోవైపు జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలు మూడు దశల్లో జరుగుతున్నాయి. సెప్టెంబర్ 18న తొలిదశ పోలింగ్ పూర్తికాగా.. రెండో దశ సెప్టెంబర్ 25న జరగనుంది.



# తిరుమలలో కల్తీ నెయ్యి వ్యవహారం కట్టు కథ

### మాజీ సీఎం వైఎస్ జగన్



**అమరావతి:** ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు దేవుళ్లను కూడా రాజకీయాలకు వాడుకుంటున్నారని వైసీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ ఆరోపించారు. వంద రోజుల పాలనపై ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకత నుంచి ప్రజల దృష్టి మరల్చడానికి తిరుమల లడ్డూ తయారిలో కల్తీ నెయ్యి అంటూ కట్టుకథ అల్లారని దుయ్యబట్టారు. గత రెండు రోజులుగా తిరుమల లడ్డూ కల్తీపై వస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టారు.
శుక్రవారం తాడేపల్లి నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. భక్తుల మనోభావాలతో ఆడుకోవడం ధర్మమేమేనా అంటూ ప్రశ్నించారు. తిరుమల పవిత్రతను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్న చంద్రబాబు వ్యాఖ్యలపై విచారణ జరిపించాలని సుప్రీంకోర్టుకు , ప్రధానికి లేఖ రాస్తానని వెల్లడించారు. అన్ని నియమ నిబంధనలు, మూడుసార్లు టెస్టింగ్‌ల తరువాతే వచ్చే రిపోర్టు అనంతరం నెయ్యి లడ్డూ తయారికి వెళ్తుందని అన్నారు. గత టీడీపీ, వైసీపీ హయాంలో నెయ్యి ప్రమాణాలు లేవని టీడీపీ 16 సార్లు, వైసీపీ 18 సార్లు ట్యాంకర్లను తిరిగి పంపించిందని గుర్తు చేశారు. కల్తీ జరిగిందని తప్పుడు ప్రచారంతో దారుణ అబద్దాలు ఆడుతున్నారని దుయ్యబట్టారు. ఇచ్చిన హామీల నుంచి , ప్రజల నిలదీతల నుంచి దృష్టిని మరల్చడానికి ఈ నాటకం వాడుతున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి భక్తుల మనోభావాలు, టీటీడీ ఆలయ పవిత్రతను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు.

**వైవీ సుబ్బారెడ్డి గొప్ప భక్తుడు ..**
వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత తిరుమలలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామని తెలిపారు. ల్యాబ్‌లను మెరుగుపర్చామన్నారు. బోర్డు తీసుకున్న నిర్ణయాల్లో ప్రభుత్వ ప్రమేయం ఉండదని అన్నారు. వైవీ సుబ్బారెడ్డి 45 సార్లు అయ్యప్పమాల వేసుకున్నగొప్ప భక్తుడని కొనియాడారు. తిరుమల పవిత్రతను దెబ్బతీస్తున్న చంద్రబాబు మరోసారి ముఖ్యమంత్రిగా కావడం ఆంధ్రప్రదేశ్ దౌర్భాగ్యమని అన్నారు.

## ముంబై నటి కేసులో ముందస్తు బెయిల్ పిటిషన్ వేసిన ఐపీఎస్ అధికారి

**విశ్వంభర, అమరావతి :**
ముంబై నటి కాదంబరి జత్వాని కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐపీఎస్ అధికారి కాంతిరాణా తాతా కోర్టు మెట్లు ఎక్కారు. తనను పోలీసులు అరెస్టు చేయకుండా ఏపీ హైకోర్టు లో శుక్రవారం ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై సోమవారం విచారణ జరుపుతామని హైకోర్టు వెల్లడించింది. ఇప్పటికే ముంబై నటి కేసులో ఏపీ ప్రభుత్వం సస్పెన్షన్ చేసిన ముగ్గురు ఐపీఎస్ అధికారుల్లో కాంతిరాణా ఒకరు. ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులు, ఐపీఎస్ అధికారి విశాల్‌గున్నిలను వారం క్రితం సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం ఉత్వర్వులు జారీచేసిన విషయం తెలిసిందే.ఈ వ్యవహారానికి సంబంధించి ఇప్పటికే ఏసీపీ హనుమంతరావు, ఇబ్రహీంపట్నం సీఐ సత్యనారాయణను డీజీపీ సస్పెండ్ చేశారు. అటు, పరారీలో ఉన్న వైసీపీ నేత విద్యాసాగర్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. నటి ఫిర్యాదు ఆధారంగా ఇబ్రహీంపట్నం పోలీసులు ఆయనపై నమోదు చేసిన కేసులో ఆయన్ను ఏ1గా చేర్చారు.

**అసలు ఏం జరిగిందంటే ..**
ముంబై నటి కాదంబరి జత్వాని ముంబైకి చెందిన పారిశ్రామికవేత్తతో పరిచయం ఏర్పడింది. కొన్నాళ్లకు ఇద్దరి మనస్పర్థాలు రావడంతో ఆమె పారిశ్రామికవేత్తపై పోలీసుస్టేషన్‌లో కేసు పెట్టింది. ఈ కేసు నుంచి తప్పించుకోవడానికి సదరు పారిశ్రామిక వేత్త వైసీపీ ప్రభుత్వ హయాంలో వైసీపీకి చెందిన కీలకనేతను కలిశారు. ఆ నేత ఆదేశాల మేరకు పోలీసులు రంగంలోకి దిగి వ్యూహం ప్రకారం ముంబై నటి జత్వానిపై అక్రమంగా కేసు బనాయించి ఆమెను, ఆమె తల్లిదండ్రులను విజయవాడకు తీసుకొచ్చి 45 రోజుల పాటు జైల్లో ఉంచారు. వారికి బెయిల్‌రాకుండా అడ్డుకున్నారు. పారిశ్రామికవేత్తపై ముంబైలో పెట్టిన కేసును ఉపసంహరించుకోవాలని ఒత్తిళ్లు చేశారు. ఎట్టకేలాగు ఆమె జైలు నుంచి విడుదల తిరిగి స్వస్థలానికి వెళ్లి పోయింది. ఈ దశలో ఏపీలో ఎన్నికలు రావడం వైసీపీ అధికారం కోల్పోవడం, కూటమి అధికారంలోకి రావడంతో కాదరంబరి జత్వాని ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి ఫిర్యాదు చేసింది. దీంతో విచారణ ప్రారంభించిన ప్రభుత్వానికి ఈ కేసులో అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఇందుల్లో ఐపీఎస్‌ల పాత్ర ఉండడంతో ప్రత్యేక అధికారితో విచారణ చేయించి ప్రాథమికంగా ముగ్గురు అధికారులపై వేటు వేశారు. ఈ కేసులో అరెస్టు చేయకుండా ఐపీఎస్ కాంతిరాణా ముందస్తుగా కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు.



# ముమ్మరంగా సభ్యత్వ నమోదు

## వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూజేఐ) నిర్ణయం



**హైదరాబాద్:** రాష్ట్రంలో సభ్యత్వ నమోదును ముమ్మరం చేయాలని వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా (డబ్ల్యుజేఐ) నిర్ణయించింది. పాత్రికేయుల సంక్షేమం కోసం భారతీయమజ్దూర్ సంఘ్‌కు అనుబంధంగా ఏర్పాటై జాతీయ స్థాయిలో కృషి చేస్తున్న డబ్ల్యూజేఐ ఆధ్వర్యంలో శుక్రవారం పాత్రికేయుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఉస్మానియా యూనివర్సిటీలో జరిగిన ఈ కార్యక్రమానికి బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కలాల్ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ రామ్మోహన్ లు హాజరై ప్రసంగించారు. పాత్రికేయుల సమస్యలపై పోరాడుతున్న డబ్ల్యూజేఐకు తాము అండగా ఉంటామని ప్రకటించారు. సీనియర్ జర్నలిస్ట్ వల్లీశ్వర్ మాట్లాడుతూ డబ్ల్యూజేఐ అన్నిజిల్లాలకు విస్తరించాలని సూచించారు. నిరంతరం కార్యక్రమాలు చేపట్టాలని , బలమైన శక్తిగా ఎదగాలని ఆకాంక్షించారు. దేశంలోనే అతిపెద్ద కార్మిక సంఘమైన భారతీయ మజ్దూర్ సంఘ్ డబ్ల్యూజేఐకు అండగా ఉండటం సంతోషదాయకమన్నారు. జాతీయ స్థాయిలో పాత్రికేయుల సమస్యలను లేవనెత్తేందుకు ఇది దోహదపడుతుందన్నారు. ఆత్మగౌరవంతో పోరాడుదామని, అందరి మేలు కోసం పాటుపడదామని, జాతీయ ప్రయోజనాలు కాపాడుకుందామని పిలుపునిచ్చారు. జర్నలిస్టుల విషయంలో చేయాల్సింది ఎంతో ఉందని సీనియర్ ఎడిటర్, రచయిత ఎంవీఆర్ శాస్త్రి అభిప్రాయపడ్డారు. వారి సంక్షేమం కోసం పాటుపడుతున్న డబ్ల్యూజేఐని అభినందించారు. డబ్ల్యూజేఐ గౌరవాధ్యక్షుడు నందనం కృపాకర్, రాష్ట్ర అధ్యక్షుడు రాణాప్రతాప్, ప్రధాన కార్యదర్శి రావికంటి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు అనిల్ దేశాయ్, కార్యదర్శి క్రాంతి, సామాజిక కార్యకర్త తిరుమల్ పాల్గొన్నారు. కరీంనగర్ కు చెందిన సీనియర్ జర్నలిస్టు నాయకులు కరుణాకర్, ప్రమోద్ కుమార్, హైదరాబాద్‌లోని పలువురు సీనియర్ పాత్రికేయులు, మహిళా జర్నలిస్టులు హాజరయ్యారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలు, యూనియన్ విస్తరణకు ఉన్న అవకాశాలపై వారు తమ అభిప్రాయాలను వెల్లడించారు.



## ఆధ్యాత్మిక కార్యక్రమాలతో

# సమాజంలో మార్పు

### ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క

**విశ్వంభర, హైదరాబాద్:** గణపతి ఆశీర్వాదంతో రాష్ట్రం శాంతి సౌఖ్యాలతో, సుభిక్షంగా ఉండాలని, ప్రజలు సుఖసంతోషాలు, ఆయురాగ్యాలతో వర్ధిల్లాలని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఆకాంక్షించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో సమాజంలో మార్పు వస్తుందని, మానవ సేవే మాధవ సేవ అనే సూక్తితో స్ఫూర్తితో నేటి యువత ముందుకు సాగాలని అయన పిలుపునిచ్చారు. గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా హైదరాబాద్ ఇసామియా బజార్ లో జైసంతోషిమాత ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాధుని వద్ద పూజలందుకున్న లడ్డూ ప్రసాదాన్ని కమిటీ సభ్యులు మురికి సంపత్ కుమార్, సందీప్ రెడ్డి, చాణిక్య, కె. కార్తీక్ రెడ్డి తదితరులు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు శుక్రవారం ఆయన నివాసంలో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా భట్టివిక్రమార్క స్పందిస్తూ గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రతి ఏటా రాష్ట్ర ప్రజలు అత్యంత ఘనంగా నిర్వహించడం, ఇందులో యువత కీలక పాత్ర పోషించడం అభినందనీయమని, అందులో భాగంగా పేదలకు అన్నదానం, రక్తదాన శిబిరాలు తదితర సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించడం తద్వారా సమాజ అభ్యున్నతికి పాటుపడాలన్నారు. దేవుళ్లలో మొదటి పూజలందుకునే గణనాధుని కరుణ కటాక్షాలు రాష్ట్ర ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని, ఇదే విధంగా ప్రతిఏటా గణపతి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా శాంతియుతంగా నిర్వహించుకోవాలని ఆయన అన్నారు.

## దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్‌పై

# హైకోర్టులో విచారణ

### నోటీసుల జారీ

**విశ్వంభర, హైదరాబాద్:** దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిపై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిపింది. హైకోర్టు సీజే జస్టిస్ అలోక్ ఆరాధే ధర్మాసనం నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. చెరువు ఎఫ్‌టీఎల్ 160 ఎకరాలుగా పేర్కొనడంపై ప్రియతంరెడ్డి అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ వేశారు. గత రికార్డుల ప్రకారం ఎఫ్‌టీఎల్ పరిధి కేవలం 65 ఎకరాలుగా మాత్రమే ఉందని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. పిటిషన్‌పై విచారణను హైకోర్టు సోమవారానికి వాయిదా వేసింది. అయితే, ఈ విషయంలో వివరణ ఇవ్వాలంటూ రెవెన్యూ, నీటిపారుదలశాఖలతో పాటు హెచ్ఎండీకే హైకోర్టు నోటీసులు జారీ చేసింది. హెచ్ఎండీఏ పరిధిలోని వివిధ చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో చేపట్టిన నిర్మాణాలను హైడ్రా కూల్చివేస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే పలు నిర్మాణాలను నేలమట్టం చేసిన విషయం తెలిసిందే.



# కాళేశ్వరం కమిషన్ ముందు హాజరైన తెలంగాణ రిసెర్చ్ అధికారులు



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ రిసెర్చ్ అధికారులు కాళేశ్వరం కమిషన్ ముందు హాజరయ్యారు. జాయింట్ డైరెక్టర్ తోపాటు చీఫ్ ఇంజినీర్, ఇతర ఇంజనీర్లు కమిషన్ ముందు హాజరైన వారిలో ఉన్నారు. మూడు బ్యారేజీల కంటే ముందు మోడల్ స్టడీస్ కండక్ట్ చేశారా లేదా..? అని ఈ సందర్భంగా రిసెర్చ్ ఇంజినీర్లను కమిషన్ ప్రశ్నించింది. కన్స్ట్రక్షన్‌కు ముందు, మధ్యలో, తర్వాత కూడా మోడల్స్ నిర్వహించినట్లు రిసెర్చ్ ఇంజినీర్‌లు తెలిపారు.మోడల్ స్టడీస్ పూర్తికాకముందే కన్‌స్ట్రక్షన్ మొదలైనట్లు కమిషన్ ముందు రిసెర్చ్ ఇంజినీర్లు ఒప్పుకున్నారు. మేడిగడ్డతో పాటు ఇతర డ్యామేజ్ జరగడానికి కారణం నీళ్లను స్టోరేజ్ చేయడమేనని కమిషన్ ముందు రిసెర్చ్ ఇంజనీర్లు చెప్పారు. వరద ఎక్కువగా వచ్చినప్పుడు గేట్లను ఎత్తకుండా ఫీల్డ్ అధికారులు నిర్లక్ష్యం వహించారని తెలిపారు. మోడల్ స్టడీస్ తర్వాత బఫెల్ బ్లాక్‌లో మార్పులు, సవరణలు చేయడానికి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చామని చెప్పారు. బ్యారేజీలు డామేజ్ అవ్వడానికి, మోడల్ స్టడీస్‌కు సంబంధం లేదని రిసెర్చ్ అధికారులు కమిషన్‌కు చెప్పారు. మూడు బ్యారేజీల్లో నీళ్లు నిలువ చేయడానికి ఎవరి ఆదేశాలు ఉన్నాయని..? రిసెర్చ్ ఇంజనీర్లను కాళేశ్వరం కమిషన్ ప్రశ్నించింది. అన్నారం బ్యారేజీ నిర్మాణం చేసే లొకేషన్ మారినట్లు రిసెర్చ్ ఇంజనీర్ల దృష్టిలో ఉందా..? అని అడిగింది. ఈ సందర్భంగా నిబంధనల ప్రకారమే టీఎస్ ఈఆర్ఎల్ పని చేసిందని కమిషన్ ముందు ఇంజనీర్లు చెప్పారు.లొకేషన్, సీడీవో అథారిటీ రిపోర్ట్స్ ఆధారంగా రిసెర్చ్ చేశామని అధికారులు పేర్కొన్నారు. మొత్తం మూడు బ్యారేజీల్లో 2016 నుంచి 2023 వరకు మోడల్ స్టడీస్.. రిసెర్చ్ టీమ్ ఆధ్వర్యంలో జరిగినట్లు అధికారులు తెలిపారు. ఒకవైపు నిర్మాణం జరుగుతుండగానే మరొక వైపు రిసెర్చ్ కొనసాగుతుందని ఇంజనీర్‌లు చెప్పారు.










# ప్రపంచ శాంతికి ఉద్యమ శక్తిగా ఈ తరం ముందుకు రావాలి

## (నేడు ప్రపంచ శాంతి దినోత్సవంగా సందర్భంగా)



**ప్రపంచంలోని ప్రజలంతా శాంతి సాదన కోసం, శాంతి సుస్థిరత, అభివృద్ధి కోసం పునరంకితమవ్వాలని ఐక్యరాజ్యసమితి ప్రతిసంవత్సరం సెప్టెంబర్ 21వ తేదీని "ప్రపంచ శాంతి దినోత్సవం" గా నిర్వహిస్తుంది. ఐక్యరాజ్యసమితిలోని సభ్యదేశాలు, యుఎకు వెలుపల గల దేశాలల్లో, ప్రపంచ వ్యాప్తంగా శాంతియుత జీవన సంస్కృతి గొప్పతనాన్ని సుస్తిరపరచాలని, ప్రస్తుత సమాజంలో ంలో సామ్రాజ్యవాదానికి, యుద్ధాలకు, అస్థిరమైన, హింసాయుతమైన పరిస్థితులకు వ్యతిరేకంగా, శాంతియుత పరిస్థితుల నిర్మాణ కోసం ప్రజలంతా సమైఖ్యంగా పోరాడటం ద్వారానే ప్రపంచ శాంతి సాధ్యపడుతుందనే చాటి చెప్పింది.**

**"శాంతి తనంతట తానురాదు మంచి కోర్కెల ద్వారా మాత్రమే శాంతిని సంపాదించుకోవటం సాధ్యం కాదు.శాంతి కోసం పోరాటం జరపాలి". అని చాటి చెప్పిన ప్రఖ్యాత రచయిత యెర్నకో వా. వి. రాత్రికోవ్, ఆణిముత్యాల్లాంటి మాటలను ప్రపంచ దినోత్సవం సందర్భంగా, మళ్ళీ గుర్తు చేసుకుని శాంతి సాధన కోసం, పార్టీల కతీతంగా లింగ, వర్ణ, వర్గ, వయో, ప్రాంత, బేధాలకు అతీతంగా ప్రతి ఒక్కరు కృషి చేస్తామని, ప్రతినబూనాల్సిన సందర్భమిది.**



మనిషి "ఆలోచన" మానవ సంబంధాలు బలపడే విధంగా ఉంటే, మనిషి సంఘజీవి, ప్రతి వ్యక్తి ఇతర వ్యక్తుల మీద ఆధారపడి సమాజంలో జీనవం కొనసాగిస్తాడు అనే సత్యాన్ని గ్రహిస్తాడు. సమాజ అభివృద్ధికి కృషి చేస్తాడు. విధ్వంసకరమైన ఆలోచనలను వ్యతిరేకిస్తాడు. విధ్వంస సంఘటనలకు చెల్లు చీటిపాడి సమాజంలో శాంతి నెలకొల్పడం ద్వారా మానవ ప్రగతికి-ప్రపంచ శాంతికి కృషి చేయడం మానవుని బాధ్యతలుగా గుర్తిస్తాడు. కానీ దానికి భిన్నంగా వికృత ఆలోచనలు కలిగిన వ్యక్తి, మానవతను కోల్పోయి వికృతమనిషిగా తయారవుతాడు. విధ్వంస సంఘటనలకు కారణమవుతాడు. ఆదర్శ సమాజముగా గుర్తింపు పొందిన "ఆదిమ సమాజంలో" మానవులు అందరూ సమానంగా, సంతోషంగా ఉండగలిగారు. కాని, దానికి భిన్నంగా బలవంతుడు, బలహీనుడు, దోపిడిదారుడు, దోపిడికి గురియైనవారు. అనే రెండు వర్గాలుగా ప్రజలు విభజింపబడటానికి ముఖ్యకారణం ఇతరుల మీద ఆదిపృతం చలాయించాలి. నేనే నంబర్వన్గా ఉండాలి, మొత్తం వ్యవస్థ నా కంట్రోల్ క్రిందనే ఉండాలనే "మానవుని ఆలోచన" మూలంగానే ప్రపంచంలో అనేక యుద్ధాలు తలెత్తాయి.

మొదటి ప్రపంచ యుద్ధం 1914–1918 వరకు కొనసాగింది. నాజీ ముష్కరులను తరిమికొట్టిన రష్య సైనికుల వీరత్వం, త్యాగం, అమరత్వం, ప్రపంచానికి అనేక పాఠాలను చెప్పాయనటంలో ఎలాంటి సందేహం లేదు. సామ్రాజ్యవాద, పెట్టుబడిదారి, అగ్రదేశాల విస్తరణ కాంక్షను, వలసవాద విధానాలను ధైర్యంగా ఎదిరించిన ఘనమైన, నిజమైన పోరాట చరిత్ర రష్య రెవెల్యూషన్కే దక్కింది. అంతేకాదు, మొదటి ప్రపంచ యుద్ధకాలంలో 'నాజీయిజం' యుద్ధాలోచన, విస్తరణ కాంక్షను అడ్డుకోవటానికి రష్యన్ సైన్యం, ప్రజలు బోల్సివిక్ స్పిరిట్తో పోరాడినారు. లక్షల మంది మృత్యువాతపడ్డారు. క్షతగాత్రులయ్యారు. రక్తం నదులవలె ఏరులై పారింది. మృత్యువుకు గురికాగా మిగిలిన ప్రజలకు తిండిదొరకలేదు. కూడు లేని, గూడు లేని ప్రజల గోడును ప్రపంచానికి తెలియజేయాలని రష్యాలోని 'మహిళలు' వేలాది మంది పిడికిళ్లు బిగించి "We want Bread and peace" అంటు నినదించారు. అంతేగాకుండా యుద్దాలు లేని సమాజం గురించి, శాంతి యుత సమాజం గురించి మొదటిసారిగా ముక్తకంఠంతో "STOP THE WAR" అంటూ ప్రపంచానికి చాటి చెప్పారు.

మొదటి ప్రపంచ యుద్ధకాలంలోనే సమాజంలో ప్రగతినని సాధించాలంటే "యుద్దాలు వద్దు - ప్రపంచశాంతి" కావాలనే పోరాటం ప్రారంభమయింది. సామ్రాజ్యవాద దేశాలు అక్టోబర్ రెవల్యూషన్ విజయవంతమయితే రష్యా శక్తివంతమయిన దేశంగా తయారౌతదని, దాన్ని దెబ్బతీయటానికి తీవ్రమైన ప్రయత్నాలు చేసినప్పటికి అవి ఫలించలేదు. 1919 సంవత్సరంలో సోవియట్ యూనియన్ 20 యేండ్ల శాంతి ఒప్పందాన్ని చేసుకున్నది. ప్రపంచంలో శాంతి స్థాపనకు. అంతర్జాతీయ శాంతి మహాసభలను మాస్కో, కైరో, థెహరాన్లలో పెద్ద యెత్తన తానే క్రియాశీలకపాత్ర నిర్వహించి, ఘనంగా నిర్వహించటం జరిగింది. ఆ రకంగా ప్రజాయుద్ధం, రాజకీయ, ఆర్థిక, సామాజిక వ్యవస్థలలో గొప్ప, విభిన్నమైన ఫలితాలను తీసుకరావాలంటే 'ప్రజలకు శాంతి' అత్యంత అవసరమైన మౌళిక అంశంగా, శాంతి యుద్ధంగా సాగిందని చెప్పవచ్చు.

ఈ సందర్భంగా మనం గుర్తు చేసుకోవలసిన మరొక ముఖ్యమైన విషయమున్నది. 1943 డిసెంబర్ నెలలో థెహరాన్లో జరిగిన "ప్రపంచ శాంతి మహాసభ"లో విన్సన్ చర్చిల్, రూజ్వెల్ట్ మరియు స్టాలిన్ లు ప్రసంగిస్తు, అత్యంత ఉన్నతమైన బాధ్యత మనపై మరియు యునైటెడ్ నేషన్స్పై ఉన్నదనే వాస్తవాన్ని గుర్తించాం. ప్రపంచ ప్రజల శ్రేయేస్సును కోరుకునేది ఒక్క శాంతి మాత్రమే. ప్రపంచంలో శాంతిని స్థాపించటం ద్వారా యుద్ధాలను, యుద్ధభయాలను, హింసను మరికొన్ని తరాల వరకు నివారించటానికి ఈ రోజు ఈ చారిత్రాత్మక మహాసభలో గ్రెటీల్పై సంతకం చేయటం జరిగిందని ప్రకటించి, ప్రపంచ ప్రజలలో శాంతియుత వాతావరణ పరిస్థితుల స్థిరీకరణకు, కొనసాగింపుకు ఒక నమ్మకాన్ని కలిగించటం జరిగింది. ఈ క్రమంలోనే బ్రిటన్, అమెరికా, సోవియట్ యూనియన్ మరియు చైనా దేశాలు ప్రపంచంలో ప్రపంచశాంతి ప్రపంచ భద్రతను సాధించాలని, ఫాసిస్ట్ జర్మనీ శక్తిని పూర్తిగా అంతమొందించాలని ప్రపంచంలో ప్రజాస్వామ్య దేశాలు స్వేచ్ఛా, సమానతల పునాదిగా ఈ నాలుగు దేశాల నాయకత్వంలోనే ప్రపంచశాంతి కార్యక్రమాల నిర్వహణ, అభివృద్ధి కొరకు ప్రపంచ వేదికను స్థాపించాలని, అంతర్జాతీయ సహకారాన్ని కూడగట్టాలని, అంతర్జాతీయంగా దేశాల మధ్యన ఆర్థిక సహకారం అభివృద్ధిని, సాదించటానికి, ప్రపంచ వ్యాప్తంగా, ప్రజలంతా ఐక్యంగా, అంకితభావంతో ఆయా దేశాలలో శాంతి స్థాపన, సుస్థిరతకు కృషి చేయాలనే ఆశయాలను ప్రకటించటం జరిగింది.

1939 సెప్టెంబర్ 1న పోలెండుపై జర్మని దాడి చేయటంతో రెండవ ప్రపంచయుద్ధం ప్రారంభమయింది. ఈ యుద్ధం ప్రపంచాన్ని ప్రమాదపు అంచుల్లోకి తీసుకెళ్లింది. 1943లో స్టాలిన్ గాద్ వద్ద జరిగిన యుద్ధంలో జర్మనీ ఓటమి చెందింది. ది/194 రెండవ ప్రపంచ యుద్ధం 1939-45 మధ్యకాలంలో ప్రపంచంలో తలెత్తిన విపత్కర, హృదవిదాకరమైన పరిస్థితులు, మానవ నాగరికత, ప్రగతి, శాంతి స్థాపన, పునరుద్ధరణ ఆవశ్యకతపై ప్రపంచ మేధావుల్లో మరింత ఎక్కువ చర్చ జరిగింది. 1945 ఆగస్టు 6,9 తేదీలల్లో హిరోషిమా, నాగసాకిల మీద అమెరికా ప్రయోగించిన హైడ్రోజన్ బాంబులు లిటిల్ బోయ్, ఫ్యాట్మన్లు చేసిన విధ్వంసం ప్రపంచాన్నే షాక్కు గురిచేసింది.

యుద్ధకాంక్ష, యుద్ధ భీభత్సవం ఎంత నష్టదాయకమైందో మరొకసారి, ప్రపంచ మానవాలి కండ్లార చూసింది. మరొకసారి ఇటువంటి యుద్ధాలు రావద్దని "NEVER AGAIN WAR" అని "WE WANT PEACE"అని ప్రజలంతా, శాంతి కాముకులంతా మళ్ళీ 1948 సంవత్సరంలో 46 దేశాల నుండి వచ్చిన ప్రఖ్యాత రచయితలు, చిత్రకారులు, తత్త్వవేత్తలు, శాస్త్రజ్ఞులు, రచయితలు, శాంతి కాముకులు సమావేశమయ్యి మానవజాతినే అంతమొందించగల మరొక యుద్ధం రాకుండా నివారించడానికి, ప్రపంచ శాంతి సంఘాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. శాంతి కాముకుల ప్రథమ ప్రపంచ మహాసభకు పారిస్, ఫ్రాన్స్ నగరంలో 1949 సంవత్సరంలో ఘనంగా నిర్వహించి, ప్రపంచ శాంతి ఆవశ్యకతను అంతర్జాతీయ సమాజానికి చాటి చెప్పటం జరిగింది. ఆ క్రమంలోనే "అంతర్జాతీయ ప్రపంచ శాంతి" సంఘం, ప్రపంచ శాంతి కౌన్సిల్, ఐక్యరాజ్యసమితి స్థాపించబడ్డది.

యు.యన్.వొ. అక్టోబర్ 24, 1945న స్థాపించబడ్డది. దీని ప్రధాన కార్యాలయం అమెరికాలోని న్యూయార్క్ నగరం నుండి తన ఆశయాలను, లక్ష్యాలను నెరవేర్చడానికి కృషి చేస్తుంది. ప్రపంచంలో అత్యధిక ప్రాంతాల్లో కల్లోల పరిస్థితులున్నాయి. ఈ పరిస్థితులను చక్కదిద్ది శాంతిని సాధించడం అత్యంత ప్రధానమని ఒక ప్రకటనలో, గతంలో ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి గుటెర్రస్ చెప్పారు. అంతేకాదు. ఇప్పుడు "ద్విధృవ" ప్రపంచం స్థానంలో ఏకధృవ ప్రపంచం ఏర్పడుతుందని, ఇంకా బహుళధృవ ప్రపంచం ఏర్పడలేదని ఆయన విశ్లేషించారు. దీనికి ఎంతో ప్రాధాన్యత ఉన్నది. ఓట్ల కోసం ప్రజాస్వామ్య విలువలను తాకట్టుపెట్టుతున్నారనీ, ప్రపంచంలో అనిశ్చితి, ఊహకందని అంశాలు నేడు ఉన్నాయని, సంఘర్షణలు కూడా పరస్పర సంబంధాలు కలిగి ఉన్నాయని, అలాగే టెర్రరిజం నుంచి ఎదురయ్యే ముప్పుకూడా పరస్పర సంబంధాలు కలిగి ఉన్నాయని గుటేర్రస్ ఒక పత్రికకు ఇచ్చిన ఇంటర్యూలో పేర్కొన్న విషయం ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంది.

విస్తరించటానికి ఐక్యరాజ్యసమితి సభ్యదేశాలు, మరియు ఇతర దేశాలలోని ప్రజలంతా ప్రపంచశాంతి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు.

మరొకవైపు అమెరికన్ సామ్రాజ్యవాదం యుద్ధకాంక్షల ఫలితంగా సామ్రాజ్యవాదం బలపడుతున్నది . ప్రతి దేశంలో మిలటరీ రక్షణ వ్యయం పెరిగిపోతున్నది. ఆకలి, దారిద్ర్యం, అలాగే మిగిలిపోతుంది .గత కొన్ని దశాబ్దాలుగా పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్నటువంటి దాడి, ఇటీవల గాజ పై జరుగుతున్న ఏకపక్ష దాడి ఫలితంగా పాలస్తీనాలో విద్యా, వైద్యం, నాగరికత. పసి పిల్లల భవిష్యత్తు, నేలమట్టమయ్యాయి. అంటువ్యాధులు పెరిగిపోతున్నాయి. వేలాది మంది పసిపిల్లలు తమ ప్రాణాలను కోల్పోయారు. పాఠశాల, వైద్యశాలలు, కార్యాలయాలు, యుద్ధ ట్యాంకులు బాంబుల వలన నేలమట్టమయ్యాయి విద్యార్థులు మృత్యువాత పడ్డారు. లక్షలాదిమంది క్షతగాత్రులయ్యారు. ఇతర ప్రాంతాలకు ప్రాణాన్ని గుప్పిట్లో పెట్టుకుని పోతున్నారు ఆహారం, వైద్యం మంచినీళ్లు, అందుబాటులో లేదు. ఐక్యరాజ్యసమితి అనేకసార్లు చెప్పినప్పటికీ కూడా ఇజ్రాయిల్ యుద్ధాన్ని ఆపడం లేదు. ప్రపంచ దేశాలు కూడా తీవ్రంగా ఖండిస్తున్నాయి. రెండు దేశాల మధ్య శాంతి ఒప్పందాల్ని, ఐక్యరాజ్యసమితి తీర్మానాన్ని అమలు చేయటానికి ప్రయత్నం చేస్తున్న కూడా ఇంకా ఒక కొలిక్కి రావడం లేదు ఇది మా నవత్వానికి మాయని మచ్చ. ఈ పరిస్థితి మారాలి. శాంతియుతమైన వాతావరణం నెలకొనాలి. మరొకవైపు ఉక్రెయిన్ , రష్యా మధ్యన జరుగుతున్నటువంటి పోరాటం కూడా ప్రపంచాన్ని ఆందోళనకు గురిచేస్తుంది. అమెరికా ప్రోత్సాహంతో ఉన్నటువంటి నాతో కూటమి ఉక్రెయిన్ కుఅండదండలిస్తున్నది. అమెరికా, రష్యా, ఉక్రెయిన్, గాజా, పలస్తీనా దేశాలు మాత్రమే కాకుండా ప్రపంచ ప్రజలందరూ కూడాయుదవద్దు_శాంతికావాలి. అని కోరుతున్నారు.


భూగోళాన్ని భయపెడుతున్న యుద్ధ వాతావరణం చాలా ప్రమాదకరం యుద్ధాలను వ్యతిరేకించాలి. శాంతిని స్థాపించాలి. అందుకే అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం AIPSO దేశమంతట ప్రపంచ శాంతి భావజాలాన్ని జనములుకి విస్తృతంగా తీసుకెళ్తా ఉంది . సమావేశాలు, సభలు, సెమినార్లు, చిన్న పోటీలు చెస్ పోటీలు ఉపన్యాస పోటీలు నిర్వహిస్తా ఉన్నది . అన్ని రంగాలకు సంబంధించిన సకలజనుల మనోభావాల్లో బలమైన శాంతి ఆలోచన మొలకెత్తడానికి,మహావృక్షమై ఎదగటానికి, ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా వరల్డ్ పీస్ డే సందర్భంగా ఫిబ్రవరి 21వ తేదీన మధ్యాహ్నం రెండు గంటల నుండి 5 గంటల వరకు హైదరాబాదు లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కవి సమ్మేళనం నిర్వహించడం జరుగుతుంది.

యుద్ధోన్మాద, మతోన్మాద, సామ్రాజ్యవాద, హింసావాద చర్యలను వ్యతిరేకించాలి. భావ ప్రకటన స్వేచ్ఛ, హక్కుల పరిరక్షణ, రాజ్యాంగ పరిరక్షణ, దేశ సార్వభౌమాధికర, ప్రజాస్వామ్య లౌకిక వ్యవస్థ పరిరక్షణ, శాంతి భద్రతల పరిరక్షణ కోసం కృషి చేయాలి. పార్టీల కతీతంగా కవులు, రచయితలు, మహిళలు, కార్మికవర్గం, రాజకీయ నాయకులు, కళాకారులు, విద్యార్థి, యువకులు, మహిళలు, కార్మికవర్గం ఈ మహత్తర లక్ష్యసాదనలో అడుగులో అడుగులేస్తూ ప్రపంచ శాంతి ఉద్యమ సైనికులుగా ముందుకు సాగాలల్సిన సందర్భమిది. ఈ లక్షసాధనలో భాగంగా అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (AIPSO) తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 21న ఉదయం 10.00 గంటల నుండి 01.00 గంటల వరకు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కవి సమ్మేళన కార్యక్రమం నిర్వహిస్తుంది. ప్రపంచ శాంతి భావజాలాన్ని వ్యాప్తి చేయడానికి తనవంతు కృసి చేస్తుంది. ఈ శాంతి పోరాటంలో ప్రతి ఒక్కరు కలిసిరావాలని కోరుతుంది.



**- కే.వి.ఎల్.**
రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి
అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం

# కలియుగ కామధేనువు శ్రీ రాఘవేంద్ర గురు సార్వభౌములు



శ్రీ రాఘవేంద్రః సకల ప్రదాత;
స్వపాదకంజద్వయ భక్తి మధ్భ్యః|
అఘాద్రిసంభేదనదృష్టివజ్రః;
క్షమసురేంద్రోవతు మాం సదాయమ్||
సకల కోరికలను తీర్చునట్టి

మీ పవిత్ర పాద పద్మములను కొలిచే మావంటి భక్తుల పాపపు కొండలను వజ్ర సమములైన మీ దృక్కులతో బద్దలుగొట్టి, మా తప్పులు క్షమించి మమ్ములను రక్షించు ఓ రాఘవేంద్ర స్వామీ! ) అంటూ, శ్రీ రాఘవేంద్రుల పరమ భక్తులైన అప్పణా చార్యులు తమ శ్రీ రాఘవేంద్ర స్వామి స్తోత్రం లో ప్రస్తుతించారు. ఈ స్తోత్రరాజం జగత్ప్రసిద్ధమైంది. ఆ ప్రాంతం శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి కృపాకటాక్షాలను పొందిన ప్రాంతం. గ్రామ దేవత అయిన మాంచాలమ్మ గా కొలువై ఉన్న ప్రాంతం. ఆ ప్రాంతంలోని శ్రీ రాఘవేంద్ర స్వామి వారు తమ శరీరంతో బృందావనంలో ప్రవేశించారు. శ్రీ గురు సార్వభౌములు బృందావనంలో ప్రవేశించి నేటికీ 353 సంవత్సరాలు గావస్తుంది. ఈ సందర్భంగా కలియుగ కామధేనువుగా కీర్తినొందిన భక్తుల చే కొనియాడ పడుతున్న శ్రీరాఘవేంద్ర గురుసార్వభౌముల మహిమలను ఈ వ్యాసంలో మనం తెలుసుకుందాం!

### భక్త ప్రహ్లాదుడు యజ్ఞం చేసిన పవిత్ర స్థలం శ్రీ మంత్రాలయం

శ్రీ గురు సార్వభౌములు ఏ స్థలంలో నైతే స శరీరంతో బృందావనంలో ప్రవేశించారో ఆ స్థలం శ్రీ మహావిష్ణువు పరమ భక్తుడైనటువంటి ప్రహ్లాదుడు యజ్ఞము నిర్వహించిన స్థల మనీ స్థల పురాణం తెలుపుతుంది. శ్రీ రాఘవేంద్రుల వారు సాక్షాత్తు ప్రహ్లాదుని అవతారంగా కూడా భక్తులు నమ్ముతారు. ఈ స్థలం అందరూ ధర్మమార్గంలో నడుచుకోవాలని తెలిపిన స్థలం. కనుక శ్రీ గురు సార్వభౌములు తమ శరీరంతో, ఆత్మతో బృందావనంలో ప్రవేశించారు.

శ్రీ గురు సార్వభౌములు ఆధ్యాత్మికంగా ప్రజల మనోభావాలను పురికొల్పి దేవదేవుడైన శ్రీహరిని చేరుటకు మార్గాన్ని సుగమని చేసిన మార్గదర్శకులు. శ్రీరాఘవేంద్రులు మంత్రాలయంలో మాత్రమే ఉన్నారని భావించక ఈ స్వామి బృందావనాలను నిర్మించి మృత్తిక ప్రతిష్టించిన అన్నిచోట్ల కూడా ఈ స్వామి మహిమల ప్రభావం ఉన్నాయని నేటికీ నిరూపించబడుతున్న మహా సార్వభౌముడు. శ్రీ రాఘవేంద్ర స్వామి భక్తులు ఒక్క భారతీయులు మాత్రమే కాకుండా విశ్వమంతా వ్యాపించడం ఎంతో ముదావహం. బ్రిటిష్ రాయబారి మన్రోకి దర్శనమిచ్చి ఆశీర్వదించిన దేవతా స్వరూపుడు శ్రీ సద్గురు రాఘవేంద్ర స్వామి.

### ఆపదలో ఆదుకునే దైవం

చాలా సంవత్సరాల క్రితం జరిగిన ఒక కథను ఇక్కడ చెప్పుకోవాలి. గుంతకల్ రైల్వే స్టేషన్ లో ఒక వ్యక్తి కడుపు నొప్పితో బాధపడుతూ ప్రయాణిస్తున్నాడు. అతను తన నొప్పిని తగ్గించుకోవడానికి చికిత్స కొరకు వెళుతున్నాడు. త్రాగునీటి కొరకు గుంతకల్ స్టేషన్లో దిగి తన మరచెంబులో కొంత నీరు నింపుకున్నాడు. ఇంతలోనే ఒక కంబళి కప్పుకొన్న ఒక వృద్ధుడు అతని భుజం తట్టినట్టు అనిపించింది అతనికి తిరిగి చూస్తే అతను వెళ్ళిపోతున్నాడు. అతన్ని ఎంత పిలిచినా ఆగలేదు. ఆరోజే కలలో అతనికి శస్త్ర చికిత్స జరిగినట్టు అనుభవం కలిగింది. లేచి తన పొట్టను చూసుకున్నాడు. అతని పొట్టపై ఆపరేషన్ చేసిన వారికి గుర్తుపడినట్లుగానే కొన్ని గుర్తులు కనపడ్డాయి. ఆ తర్వాత అతని కడుపునొప్పి బాధ నివారణ అయింది. ఇది ఒక ఉదంతం. ఈ ఉదంతం నా చిన్నతనంలో మా అమ్మ చెప్పగా విన్నాను.

### భక్తుల కోరికలు తీర్చే రాయరు

శ్రీ గురు సార్వభౌములు బృందావనంలో ప్రవేశించి వందలాది సంవత్సరాలు గడుస్తున్నప్పటికీని కొందరు భక్తులకు నేటికీని స్వప్న దర్శనం జరుగుతుందంటే ఆశ్చర్యం కలగక మానదు. ఎవరైనా సరే శ్రీ గురు సార్వభౌములపై ప్రగాఢ భక్తి విశ్వాసములను కలిగి నమస్కరించి మొక్కుకుంటారో వారి కోరిక తప్పనిసరిగా ఆ స్వామి తీర్చగలడు. భక్తుల పాలిట కామధేనువై ఆదుకుంటున్న స్వామి శ్రీ రాఘవేంద్ర గురుసార్వభౌములు. వారి మహిమలకు అంతే లేదు. మరి ఈ సందర్భంగా నిత్య పటనీయమైన ఒక మహిమాన్వితమైన శ్లోకాన్ని చెప్పుకుందాం!

ఓం పూజయ్యాయ రాఘవేంద్రాయ;
సత్య ధర్మ వ్రతాయచ|
భజతాం కల్ప వృక్షాయ;
నమతామ్ కామధేనవే||

అని పలుమార్లు శ్రద్ధాసక్తులతో పఠించిన వారికి వారి మనోభీష్టా లన్నీ నెరవేరుతాయి. ఇంతటి మహిమాన్వితుడు శ్రీ గురు రాఘవేంద్రుడు భారతదేశానికి, ప్రపంచానికి లభించడం మన అందరి అదృష్టంగా భావించాలి.

### కలియుగ ప్రత్యక్ష దైవం

ఈ విశ్వంలో ఎక్కడ శ్రీ గురురాఘవేంద్రుల బృందావనాలు ఉన్నాయో, అవి అన్నీ కల్పవృక్షాలే, కామధేనువు లే! శ్రీ రాఘవేంద్ర స్వామి ఒక్క భారతదేశానికే కాదు యావత్ ప్రపంచానికి కూడా సాంస్కృతిక, సామాజిక, నైతిక, ఆధ్యాత్మిక ఇతిహాసంలో విశేష స్థానాన్ని కైవసం చేసుకున్న కలియుగ ప్రత్యక్ష దైవం గా పేర్కొనడం ఎంత మాత్రమూ అతిశయోక్తి కాదు.

"సాహిత్య కళా విభూషణ"
నంది పురస్కార గ్రహీత
**చౌడూరి నరసింహారావు**
ఆధ్యాత్మిక,సామాజిక విశ్లేషకులు

## భవాని మాత దేవాలయం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం



**విశ్వంభర,ఫరూఖ్‌నగర్:** రంగారెడ్డి జిల్లా ఫరూఖ్ నగర్ మండలం ఎలికట్ట భవాని మాత, దేవాలయ కమిటీ చైర్మన్ ప్రమాణ స్వీకారనికి షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి,మాజీ జడ్పీటీసి శ్యామ్ సుందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు, ఈ సందర్భంగా ఆలయ ఈవో శివ కుమార్ నూతన కమిటీ చైర్మన్‌ల, సభ్యులను ప్రమాణ స్వీకారం చేయించారు, ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ వెంకట రాంరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, హరినాద్ రెడ్డి, కృష్ణ రెడ్డి, బాలరాజు గౌడ్, శ్రీశైలం, గున్న బీమయ్య, రాజు, శ్రీపాద్ రెడ్డి, రాజు, నారం పెంట రెడ్డి, బాబా అలీ, వీరేశం, తదితరులు పాల్గొన్నారు.

## దైద వెంకన్నకు విశిష్ట సేవారత్న పురస్కారం



**విశ్వంభన, మహబూబాబాద్:** గుంటూరు జిల్లా కేంద్రంలో అమ్మఒడి చారిటబుల్ ట్రస్ట్ 6వ వార్షికోత్సవం సందర్భంగా పర్యావరణ పరిర క్షణ కోసం కృషి చేసిన కార్యక్రమాలకు గాను మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన హరిత మిత్ర అవార్డు గ్రహీత, ప్రకృతి ప్రేమికుడు దైద వెంకన్నకు విశిష్ట సేవారత్న పురస్కారం అందుకోనున్నారు. గుంటూరు టౌన్ బ్రాడిపేటలోని సీపీఐ కార్యాలయంలో సెప్టెంబర్ 29 ఉదయం జరిగే కార్యక్రమంలో ఈ అవార్డును ప్రదానం చేస్తామని ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ అల్లాడి శ్రీనివాసరావు తెలిపారు.

## ఘనంగా గణేష్ శోభాయాత్ర



**విశ్వంభర, రామన్నపేట:** రామన్నపేట మండలం, ఇంద్రపాలనగరం గ్రామంలో వడ్డెర సంఘం అధ్వర్యంలో ఈదమ్మ దేవాలయం వద్ద నిర్వహించిన శ్రీగణేష్ నవరాత్రి ఉత్సవాల్లో, గణేష్ శోభ యాత్ర కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన రామన్నపేట సిఐ వెంకటేశ్వర్లు, రామన్న పేట మాజీ ఎంపిపి పూస బాలమణి-బాలనర్సింహలు గణనాధునికి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. తదనంతరం జరిగిన అన్నప్రసాద వితరణలో వారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గర్దాస్ సురేష్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పూస బాలకిషన్, బోదాసు రవి, సింగ నబోయిన జంగయ్య, కాటేపల్లి యాదయ్య, నాగు ఆంజనేయులు, పెద్దగోని వెంకటేశం, మండల జానీ, రాధారపు మహేష్, కేస సందీప్ మరియు గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటిన మున్సిపల్ చైర్మన్




**విశ్వంభర, మహబూబాబాద్:** సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వరకు నిర్వహిస్తున్న స్వచ్ఛతా హి సేవా 2024 కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం మహబూబాబాద్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో స్థానిక 34వ వార్డులో మొక్కలు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రాంమోహన్ రెడ్డి మొక్కలు నాటారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, స్థానిక వార్డు కౌన్సిలర్ గద్దె నీరజ రవి ,ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ క్రాంతి, మెప్మా ఆర్పీలు స్రవంతి, నీల, అంగన్వాడీ సరస్వతి, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## వీధి కుక్కల సమస్యను పరిష్కరించాలి




**విశ్వంభర, వికారాబాద్:** వీధికుక్కల సమస్య నుంచి ప్రజలను కాపాడాలని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేందర్ గౌడ్ అన్నారు.శుక్రవారం వికారాబాద్ జిల్లా ధారూర్ మండల పరిధిలోని కెరెల్లి గ్రామంలో లక్ష్మీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో కుక్క కాటుకు గురైన బర్రె దూడలు మేకల వల్ల నష్టపోయిన రైతులు మొగులయ్య, బందప్ప లను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ జిల్లాలో కుక్కల బెడద వల్ల చాలా మంది ఇబ్బందికి గురవుతు న్నారన్నారు.వెంటనే సమస్యలు పరిష్కరించాలన్నారు .ఈ కార్యక్రమంలో ధరూర్ మండలం బి ఆర్ ఎస్ నాయకులు సంతోష్, నరసింహులు, సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు. 05

## ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి



**విశ్వంభర, కాటారం:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని మహాదేవపూర్ పంచాయతీ కార్యదర్శి కల్పన పిలుపునిచ్చారు. స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని కిరాణా షాపులు, మాంసం విక్రయించే షాపుల వద్దకు వెళ్లి ప్రజలకు ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే నష్టాల గురించి వివరిం చారు. అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# విద్య, క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చు

### జిల్లాలో ఆకస్మిక తనిఖీలు చేసిన కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



**విశ్వంభర, మహబూబాబాద్:** జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ శుక్రవారం జిల్లాలోని మహబూబాబాద్ మండలం, పర్వ తగిరి హై స్కూల్, చిన్నగూడూరు మండల కేంద్రంలోని కస్తూరి బా, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జిల్లా పరిషత్ హైస్కూల్, అం గన్వాడి కేంద్రం, చిన్నగూడూరు -ఉగ్గంపల్లి మధ్యలో ఉన్న ఆకేర్ వాగు, మరిపేడ మండల కేంద్రంలోని కస్తూరిబా వసతి గృహం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గిరిజన ఆశ్రమ పాఠశాల ను ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లా డుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతా వరణంలో విద్యా బోధనలు అందించాలని, మెనూ ప్రకారం భోజనం వసతి కల్పించాలని, మరుగుదొడ్ల పరిశుభ్రత పాటిం చాలని, విద్యుత్ నిరంతరం ఉండే విధంగా చర్యలు తీసుకోవా లని, కాంపౌండ్ వాల్స్ సరిచూసుకోవాలని, వసతి గృహాలలో డైనింగ్ హాల్స్, కిచెన్, స్టడీ రూమ్, శుభ్రత పాటించాలని, క్రమం తప్పకుండా షెడ్యూలు ప్రకారం పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహి ంచాలని, విద్యార్థిని విద్యార్థుల యొక్క హెల్త్ ప్రొఫైల్ పరీక్షిస్తూ ఉండాలని సంబంధిత ప్రిన్సిపల్స్,వార్డెన్లను ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, హెల్త్ సబ్ సెంటర్స్, ద్వారా ప్రజల కు మెరుగైన వైద్య సేవలు అందించాలని, ఫీవర్ ఇంటింటి సర్వే నిర్వహించి, సీజనల్ వ్యాధులు మలేరియా, డెంగ్యూ, తదితర వైరల్ ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు వహించాలని, కమ్యూ నిటీ హెల్త్ సెంటర్స్ ,ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సాధారణ ప్రసవాలు ప్రోత్సహించాలని,ఇన్ పేషెంట్‌లకు వైద్య సేవలు అందించాలని, తగినన్ని మందులు సిద్ధంగా ఉంచుకోవాలని వైద్య పరీక్షలు నిర్వహించాలని, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ అవసరం ఉన్నచోట వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాల న్నారు. పౌష్టిక ఆహారం లోపం కలిగిన సామ్ పిల్లలకి బాలా మృతం పౌష్టిక ఆహార పదార్థాలు అందించి మ్యామ్ లోకి తీసుకు రావడానికి వైద్య ఆరోగ్యశాఖ, ఐసిడిఎస్ సిబ్బంది షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. గ్రామాలు, మున్సి పల్ పరిధిలలో శానిటేషన్, ఫాకింగ్, తడి చెత్త , పొడి చెత్త వేరు చేసి సెగ్రిగేషన్ చేయాలని, సీజనల్ వ్యాధులు రాకుండా, పరిస రాలను పరిశుభ్రంగా ఉంచుకునే విధంగా సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సానిటేషన్ నిర్వహణ, సీజనల్ వ్యాధుల నియంత్రణ, వసతి గృహాల తనిఖీలు, తదితర కార్యక్రమాలపై ప్రత్యేక అధికారులను నియమించి జిల్లాను ఆరోగ్యవంతమైన జిల్లాగా తీర్చిదిద్దుటకు పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఈ తనిఖీలలో కలెక్టర్ వెంట తొర్రూరు ఆర్డీవో నరసింహారావు, చిన్న గూడూరు, తహసిల్దార్ మహబూబ్ అలీ, ఎంపీడీవో రామారావు, మరిపెడ తహసిల్దార్ సైదులు, మరిపెడ మున్సిపల్ కమిషనర్ జి. వెంకటస్వామి, కెజీవిభి ప్రిన్సిపల్ మాధవి, హరి సింగ్ రాథోడ్, మెడికల్ ఆఫీసర్ రవి నాయక్, సంబంధిత అధికారులు ఉన్నారు.

## రూ.2లక్షల ఆర్థిక సహాయం



**విశ్వంభర, మిర్యాలగూడ:** నల్గొండజిల్లా మిర్యాలగూడ లిపట్టణంలోగత నెలలో ఇంది రమ్మ కాలనీ 6వ, వార్డులో పెట్రోల్ పోసుకొని అనివార్య కారణాలవల్ల తేజావత్ భగవాన్ చనిపోవడం జరిగింది ఈసందర్భంగా చనిపో యిన భగవాన్ కుటుంబానికి ఆర్థిక సహా యంకింద కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నూకల వేణుగోపాల్ రెడ్డి 2లక్షల రూపా యలను స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, డీసీసీ అధ్యక్షులు శంకర్ నాయక్, రాష్ట్ర నాయ కులు స్కైలాబ్ నాయక్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నూకల వేణుగోపాల్ రెడ్డి, 35 వార్డు కౌన్సిలర్ కొమ్ము శీను చేతుల మీదుగా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వారి కుటుం బానికి అందించడం జరిగింది ఈ కార్యక్ర మంలో 6వ,వార్డు కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొనడం జరిగింది.

## కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణ



**విశ్వంభర, ఇబ్రహీంపట్నం:** ఇబ్రహీంపట్నం మండలంలోని గోధుర్, తిమ్మాపూర్, యామ పూర్, ఫకీర్ కొండాపూర్, వేములకుర్తి, భర్తిపూర్, మూలరాంపూర్, డి,కేషపూర్, కోజన్ కొత్తూర్,ఇబ్రహీంపట్నం, కోమటికొం డపూర్, వర్షకొండ, దబ్బా, ఎర్రపూర్, అమ్మ క్కపేట్ గ్రామాలకు 62 మంది లబ్ధిదారులకు రూ. 62,07,192/-కల్యాణలక్ష్మి చెక్కులను కోరుట్ల ఎమ్మెల్యే డా.కల్వకుంట్ల సంజయ్ల బ్ధిదారుల గ్రామలకు వెళ్లి పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షులు ఎల్లాల దశరథ్ రెడ్డి, నేమూరి సత్య నారాయణ, జాజాల జగన్, నోముల లక్ష్మా రెడ్డి, ఎలేటి చిన్నారెడ్డి, గుంటి దేవన్న,భోనగిరి భూమేష్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## అతిథి ఉపాధ్యాయుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం



**విశ్వంభర, డిండి:** డిండి మండల కేంద్రంలోని ఆద ర్శ పాఠశాలలో అతిథి ఉపాధ్యా యుల పోస్టులకు దరఖాస్తు చేసుకో వాలని ప్రిన్సిపాల్ దోమ నారాయణరెడ్డి శు క్రవారం నాడు ఒక ప్రకటనలో కోరారు. ఆదర్శ పాఠశాలలో, కళాశాలలో బోధించే ందుకు అనుభవం కలిగి న ఉపాధ్యా యులు కావాలన్నారు. పిజిటి తెలుగు01, పిజిటి ఇంగ్లీషు01, టీజీటీ ఇంగ్లీ షు01, పిజిటి మ్యాస్ 02, పిజిటి కామర్స్01, పిజిటి ఎకనామిక్స్01, సంబంధిత సబ్జెక్టుల గాను విద్యారత కలిగిన పీజీ బీఈడీ టేటు కనీస విద్యార్హత కలిగి ఉండాలని వారు తెలిపారు. దరఖాస్తు చేసుకొనేవారు ఈనెల 23లోపు వారి యొక్క దరఖాస్తులను మంపాఠశాలలో సమర్పించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

## రక్తదానం చేసి ఇతరుల ప్రాణాలను కాపాడాలి: కే.మాధవరెడ్డి




**విశ్వంభర, వికారాబాద్:** ప్రతి ఒక్కరు రక్తదానం చేసి ఇతరుల ప్రాణా లను కాపాడాలని బిజెపి పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు కోకట్ మాధవరెడ్డి అన్నారు. శుక్రవారం బిజెపి పార్టీ ఆధ్వర్యంలో వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని మా శారద హాస్పటల్ లో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. బిజెపిపార్టీ జిల్లా అధ్యక్షుడు కేమాధవరెడ్డి మాట్లా డుతూ ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ప్రజ లకు వైద్యం అంది స్తామని అన్నారు. స్వచ్ఛభారత్ నిర్వహించి ప్రతి గ్రామం, మండలం, మున్సిపాలిటీ, జిల్లా, రాష్ట్రాలు, దేశంమంచిగా ఉండే విధంగా చూస్తా మని అన్నారు.బిజెపి పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిం చిన రక్తదాన శిబిరా నికి స్వచ్ఛందంగా బిజెపి పార్టీ నాయకులు, ప్రజలు పెద్దఎత్తున తరలి వచ్చి రక్తదానాన్ని చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి రక్తదానం చేసిన వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివరాజ్, బిజెపి పార్టీ వికారాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్ రెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్య క్షుడు సాయి చరణ్ రెడ్డి, వికారాబాద్ పట్టణ అధ్యక్షుడు నరోత్తం రెడ్డి, మా శారద హాస్పిటల్ వైద్యులు రాజశేఖర్, మహిళా మోర్చా జిల్లా అధ్య క్షురాలు యాష్కి శిరీష,జిల్లా ప్రధాన కార్యదర్శి విజయభాస్కర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పాండు గౌడ్, సీనియర్ నాయకుడు కెపి రాజు, వివేకానంద రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి రాజేందర్ గౌడ్, అనిల్ యాదవ్, రాష్ట్ర బీజేవైఎం ఎగ్జిక్యూటివ్ సాయి కృష్ణ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే



**విశ్వంభర, షాద్‌నగర్:** షాద్ నగర్ పట్టణంలో ఎంపీడీవో సమావేశ మందిరంలో షాద్నగర్ డివిజ న్ వైద్య ఆరోగ్యశాఖ సమీక్ష సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్, జిల్లా వైద్యశాఖ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా మాతా శిశుసంరక్షణ అధికారి పూనమ్, డిప్యూటీ డిఎంహెచ్వో విజయలక్ష్మి, షాద్నగర్ డివిజన్లోని వివిధ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ లోని డాక్టర్లు, స్టాఫ్ నర్స్, ఆశా వర్కర్లు, ఇతర వైద్య సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 08

## ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన రైతులు



**విశ్వంభర, మెట్‌పల్లి:** మెట్ పల్లి మండలం జగ్గాసాగర్ గ్రామ రైతులఆధ్వర్యంలో కొండ స్వామి దేవస్థానం ఆవరణలో ఎంపీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని జగ్గాసాగర్ రైతులు ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్‌కు వినతి పత్రం ఇచ్చిన వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేసిన కోరుట్ల నియోజకవర్గం ఎమ్మెల్యే కల్వన సంజయ్‌కి జగ్గయ్య సాగర్‌గ్రామ రైతుల పక్షాన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ప్రజలు రైతులు టిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## వాహనాలనుకండిషన్‌లో ఉండేలా చూసుకోవాలి


### జిల్లా అడిషనల్ ఎస్పీ జోగుల చెన్నయ్య




**విశ్వంభర,మహబూబాబాద్:** మహబూబాబాద్ సబ్‌డివిజన్‌కు చెందిన పోలీస్ వాహనాల పని తీరు, నిర్వహణను శుక్రవారం అడిషనల్ ఎస్పీ జోగుల చెన్నయ్య జిల్లా పోలీస్ కార్యాల యంలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీస్ వాహనాలను నిరంతరం గా ప్రజాసేవలకు వినియోగించాల్సి ఉన్నందు న ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాల న్నారు. వాహనాలపై ప్రత్యేక శ్రద్ధ వహించల ని, మంచి కండిషన్‌లో ఉంచుకోవాలని వాహ న డ్రైవర్లను ఆదేశించినారు. పోలీసు అధికా రుల ఆధీనంలో ఉన్న వాహనాలను సక్రమం గా ఉండేలా చర్యలు తీసుకోవాలని, సొంత వాహ నంలా మంచి కండిషన్‌లో ఉంచి ఎప్పటికప్పుడు సర్వీసింగ్, ఇంజన్ ఆయిల్, టైర్లను మార్చాలన్నారు. డ్రైవర్లకు నిర్వహణపై ప్రత్యేక శిక్షణ తరగతులను నిర్వహించాలని తెలియజేశారు. డ్రైవర్స్ సైతం వారి ఆరోగ్యం కాపాడుకోవాలని అన్నారు. నేత్ర పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. వాహనాల ఆరో గ్యం, డ్రైవర్స్ ఆరోగ్యం ముఖ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ(ఎంటీఓ) సోములు, ఆర్.ఐఅనిల్‌డ్రైవర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

# మహానగర రూపకల్పనలో ప్రజలూ భాగస్వామ్యం కావాలి

### ఓఆర్ఆర్ నుంచి త్రిబుల్ ఆర్ వరకు సర్వే పూర్తి: కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి



**విశ్వంభర మహేశ్వరం:** ఓ ఆర్ ఆర్ నుంచి త్రిబుల్ ఆర్ వరకు 300ఫీట్ల రోడ్డు నిర్మాణం కోసం సర్వే పూర్తి అయిందని గ్రీన్ ఫీల్డ్ రోడ్డు ఎలైన్ మెంట్ మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నా రు. అమెరికా పర్యటనలో ఉన్న కేఎల్ఆర్ రెవె న్యూ, హెచ్‌ఎండిఏ అధికారులతో ఫోన్లో మా ట్లాడారు. ఫోర్త్ సిటీ రాకతో మహేశ్వరం ని యోజకవర్గం మహానగరంగా అభివృద్ధి కా నుందని అందువల్ల ప్రజలు, రైతులు ఇందులో భాగస్వామ్యం కావాలని కోరారు రావిర్యాల కొంగరకుర్దు కలెక్టరేట్ వెనుక భాగం మీదుగా మీరాన్ పేటబేగరికంచ 19కి.మీ నుంచి త్రిబు ల్‌ఆర్‌కు దాదాపు 42 కి. మీ మేర 300ఫీట్ల రోడ్డుకు సర్వే కొనసాగిందన్నారు. రోడ్డు నిర్మా ణానికి హెచ్‌ఎండిఏ సర్వే రిపోర్టు రాగానే ఉన్నతాధికారులు భూ సేకరణ నోటిఫికేషన్ ఇస్తారని కిచ్చెన్న తెలిపారు. ఈ మహాయజ్ఞంలో ప్రభుత్వం తోపాటు రైతన్నలు పాలుపంచు కోవాలని లక్ష్మారెడ్డి పి లుపునిచ్చారు ఏ ఒక్క రూ నష్టపోకుండా అం దుకు తగిన విధంగా న్యాయం చేసేలా ప్రభు త్వం చర్యలు తీసుకుంటుందని కే ఎల్ ఆర్ భరోసా ఇచ్చారు.

# ‘భావ తరంగాలు’ పుస్తకావిష్కరణ




**విశ్వంభర, హైదరాబాద్:** ‘భావ తరంగాలు’ పుస్తకావిష్కరణ సభ శుక్రవారం ఉదయం షోయబ్ హాల్, సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ముఖ్య అతిథి గాకవి, జాతీయ ఉత్తమ సినీ గేయ రచయిత అవార్డు గ్రహీత సుద్దాల అశోక్ తేజ విచ్చేసి మధు మోహన్ వుదయగిరి రచించిన. ‘భావ తరంగాలు’ పుస్తకాన్ని ఆవిష్కరించారు. తన జీవిత అనుభవాలను గుర్తు చేసుకుంటూ గుడిపాటి వెంకటాచలం,సిరివెన్నెల,వేటూరి వంటి వివిధ కవులు జీవితంలో వారు పడిన శ్రమ, వారు రాసిన కవిత్వాలు కథలు సమాజాన్ని ఎంతగానో ప్రతిభింబింప చేశాయని అన్నారు.అలాగే ఈ పుస్తకం హృదయాన్ని మలుచుకునే విధంగా ఉందని,ఇది ధారావాహికంగా ఉండాలని ఆశించారు. రచయిత మధు మోహన్ ఉదయగిరి మరిన్ని కవితలు, పాటలు రాయాలని ఆకాంక్షించారు.పుస్తక రచయిత మధు మోహన్ వుదయగిరి మాట్లాడుతూ సమాజంలో ఉన్న రుగ్మతలు అసమానతుల గురించి ఎక్కువగా రాశానని , వాస్తవిక జీవిత అనుభవాలు ,జీవితంలో తాను అనుభవించిన సంఘటనల ఆధారంగా పుస్తకం రాశానని, ఇది సమాజానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో సర్వో డ్రైవర్స్ ప్రైవేట్ లిమిటెడ్ హెచ్.ఆర్ జి.ఎం వీరేష్, ఏ.జి.ఎం కె.సుధాకర్, ఈ.డీ.పీ జూ.జి.ఎం. లక్ష్మీనారాయణ ప్లానింగ్ జూ.జి.ఎం. రామమూర్తి, ముద్ర పత్రిక చీఫ్ ఎడిటర్ ఇంద్రారెడ్డి, బుచ్చిరెడ్డి సుందరయ్య విజ్ఞానకేంద్రం ఇన్చార్జి, బాలోత్సవ ఇంచార్జ్ సోమన్న, ప్రముఖ కవి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# నిరుపేద పిల్లలకు దుస్తులు పంపిణీ



**విశ్వంభర భూపాలపల్లి:** భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని మంజూర్ నగర్‌లో గల వెంకటేశ్వర కాలనీకి చెందిన నిరుపేద పిల్లలకు ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ చైర్మన్ ఆయిలి మారుతీ ఆ పిల్లలందరినీ బట్టల షాప్‌కు తీసుకెళ్లి పిల్లలకు నచ్చిన నూతన దుస్తులు, వారికి కొత్త చెప్పులు కొనిచ్చి మానవత్వాన్ని చాటుకున్నారు.

## ఒత్తిడికి లోనయ్యే విద్యార్థుల కోసం ఉచిత టెలి మానసిక ఆరోగ్య సేవ



**విశ్వంభర భూపాలపల్లి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము సూచనల మేరకు భూపాలపల్లి జిల్లాలోని విద్యార్థుల, ఇతరుల మానసిక పరిస్థితులపై తగిన చర్యలు తీసుకుంటున్నామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మధుసూదన్ ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో జరిగిన సంఘటన దృష్ట్యా విద్యార్థులు, ఇతరులు, మానసిక ఒత్తిడిలో ఉన్న, పరీక్షలలో ఫెయిల్ అయిన తాగుడు మాన లేకపోతున్న ఇతర మానసిక సమస్యలతో బాధపడుతున్న కొందరు ఆత్మహత్య చర్యలకు పాలు పడుతున్నారని ఇలాంటి సంఘటనలు జరగకుండా సమస్యలను పరిష్కరించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు టెలి మానస్ అనే సేవలను ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. ఈ టెలీ మానస్ అనేది ఉచిత టెలి మానసిక ఆరోగ్య సేవ అని 24 గంటలు అందుబాటులో ఉంటుందని తెలిపారు. పరీక్ష ఫలితాలు గురించి ఒత్తిడికి లోనవుతున్న విద్యార్థులు ముఖ్యంగా వారి తల్లిదండ్రులు సమాజాన్ని ఎదుర్కొనడంలో ఈ టెలి మానస్ సహాయం అవసరమని భావించి విద్యార్థులతో పాటు మానసిక ఒత్తిడికి గురయ్యే ప్రతి ఒక్కరికి ఈ సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ టెలిమానస్ను సంప్రదించిన పుడు వారికి నచ్చిన భాషలో పలకరిస్తారని అప్పుడు వారు శిక్షణ పొందిన మానసిక ఆరోగ్య నిపుణులతో కనెక్ట్ చేస్తారని వారు వారి సమస్యలను వినడానికి తగిన మార్గదర్శ కత్వం మద్దతును అందించడానికి సిద్ధంగా ఉంటారని, తెలిపారు. ఈ నిపుణుల్లో మానసి క వైద్యులు, క్లినికల్ సైకాలజిస్టులు, మానసిక సామాజిక కార్యకర్తలు, వివిధ మానసిక ఆరోగ్య సమస్యలను నిర్వహించడంలో బాగా ప్రావీణ్యం ఉన్న మానసిక నర్సులు ఉంటారని తెలిపారు. ఈ టెలి మానస్ ను సంప్రదించడానికి హెల్ప్ లైన్ నంబరు 14416 లేదా 18008 914416 అని తెలిపారు. పరీక్షలో ఫెయిల్ కావడం తప్పుకాదు ఆత్మహత్యకు సంబంధించిన ఆలోచన చేయడం తప్పు అని ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్మధుసూదన్ తెలిపారు.

## ప్రజాపాలనలో ప్రభుత్వ ఉద్యోగులకు తప్పని తిప్పలు : కేటీఆర్




**విశ్వంభర,హైదరాబాద్:** ప్రజాపాలనలో ప్రభుత్వ ఉద్యోగులకు తిప్పలు తప్పడం లేదని బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యోగులపై కాంగ్రెస్ సర్కార్ చిన్న చూపు చూస్తోందని మండిపడ్డారు. ఎంప్లాయిస్ హెల్త్ కేర్ ట్రస్ట్ జీవోను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. కేసీఆర్ సర్కార్ హయాంలో ప్రభుత్వ ఉద్యోగులను కుటుంబ సభ్యుల్లా చూసుకున్నారు. కానీ కాంగ్రెస్ సర్కార్ మాత్రం వైద్యానికి డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని కేటీఆర్ ధ్వజమెత్తారు. కాంగ్రెస్ మొండి వైఖరితో 20 లక్షల కుటుంబాలు ఇబ్బందుల్లో పడ్డాయని పేర్కొన్నారు. తక్షణం మా ప్రభుత్వం ఇచ్చిన జీవోను అమలు చేసి ఉద్యోగులకు ఉపశమనం కలిగించాలని డిమాండ్ చేస్తున్నాం అని కేటీఆర్ పేర్కొన్నారు.

## తక్షణమే విద్యాశాఖ మంత్రిని నియమించాలి



**విశ్వంభర, భూపాలపల్లి:** భారత విద్యార్థి ఫెడరేషన్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని వొకేషనల్ జూనియర్ కళాశాల విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకోవడం జరిగింది. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కుమ్మరి రాజు మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం తొమ్మిది నెలలు గడుస్తున్న విద్యారంగం గురించి పట్టించుకోకపోవడం సిగ్గుచేటు అని అన్నారు. విద్యాశాఖ మంత్రినీ నియమించకుండ కాలయాపన చేస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ మంత్రిని నియమించాలని ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు దుర్గం కోటేష్,అభి రామ్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదల మనోధార్యాన్ని దెబ్బ తీయొద్దు



**విశ్వంభర భూపాలపల్లి:** గాంధీ హాస్పిటల్ పై బురద జల్లి వైద్యం కోసం వచ్చే నిరుపేదల మనోస్థై ర్యాన్ని కేటీఆర్ దెబ్బతీస్తున్నారని కాంగ్రెస్ పార్టీ భూపాలపల్లి జిల్లా నాయకుడు పోలినేని లింగారావు ఆరోపించారు. శుక్రవారం ఆయన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్ళపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గాంధీ, ఉస్మానియా వంటి ప్రభుత్వ దవాఖాన్లను 10 సంవత్సరాల పాటు నాశనంచేసిన బీఆర్ఎస్ ఇప్పుడు ప్రతిపక్షంలో ఉండి కూడా అదే తరహాలో కుట్రలు చేయడం సిగ్గుచేటన్నారు. గాంధీని నాశనం చేసి కార్పొరేట్ హాస్పటల్ లకు లబ్ది చేకూర్చాలని ఆయన కుట్రలు పన్నుతున్నారన్నారు. ఆ కుట్రలో భాగంగానే గాంధీ హాస్పిటల్ పై బురద చల్లుతున్నారన్నారని, కేటీఆర్ ఇకనైనా పేదలకు ఉపయోగపడే ప్రభుత్వ వ్యవస్థలను నాశనం చేయడం మానుకోవాలని, లేనియెడల ప్రజలే తగిన బుద్ధి చెప్తారన్నారు.

## సమాచార తెలుసుకోవడం ప్రతీ పౌరుడి హక్కు



**విశ్వంభర, హైదరాబాద్:** ప్రజలే యజమానులు గా ప్రజలకు జవాబుదారీ తనంగా వహించాలి అని ప్రజాధికారులకు గుర్తు చేస్తూ ప్రతీ సామా న్యుడు ప్రభుత్వాన్ని ప్రశ్నించే విధంగా ఏర్పాటయి చట్ట సభల్లో ఆమోదం పొందిన చట్టమే సమాచార హక్కు చట్టమని సమాచార హక్కు చట్టం పరిర క్షణ కమిటీ జాతీయ ప్రధాన కార్యదర్శి చంటి ముదిరాజ్ అన్నారు. సమాచారం తెలుసుకోవడం ప్రతి పౌరుడి హక్కు అన్నారు. సమాచార హక్కు చట్టం 2005 అనేది అధికారులు ప్రజాప్రతిని ధులు బాధ్యతగా భావించే చట్టం మాత్రమే కాదు ప్రశ్నించే ప్రతి పౌరుని హక్కు ఈ చట్టాన్ని సక్ర ్మంగా అమలు జరగడానికి మరియు పౌర సమా చార అధికారుల నిర్లక్ష్యానికి వారికీ శిక్షలు, జరిమానాలను విధించే విదంగా పొందుపరచడం జరిగింది. అంతేకాకుండా ఈ చట్టానికి అనుబంధంగా కొన్ని చట్టాలు సెక్షన్లు అమలయ్యే విధంగా ఇతర చట్టాలు కూడా ఉన్నాయి.వీటన్నింటిని మా యొక్క సంస్థ ద్వారా ప్రజలకు, యువతకు వివిధ కార్యక్రమాల ద్వారా అవగాహన సదస్సుల ద్వారా ఆలోచింపజేసే విధంగా ప్రశ్నించే విధంగా ఇది మా హక్కు అని గ్రహించే విధంగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

## మంచి పరిపాలన కావాలంటే బిజెపి అధికారంలోకి రావాలి




**విశ్వంభర భూపాలపల్లి:** మంచి పరిపాలన కావాలంటే బిజెపి అధికారంలోకి రావాలని బిజెపి భూపాలపల్లి జిల్లా సభ్యత్వ ప్రముఖ్ జన్నె మొగిలి అన్నారు. భూపాల్ పల్లి జిల్లా కార్యాలయంలో బిజెపి రూరల్ కన్వీనర్ విప్లవ కుమార్ రెడ్డి అధ్యక్షతన శక్తికేంద్రం ఇన్చార్జులు, బూత్ అధ్యక్షులతో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిలుగా హాజరైన మొగిలి, రాజేందర్లు మాట్లాడుతూ మంచి పరిపాలన బిజెపితోనే సాధ్యమని తెలంగాణ రాష్ట్రంలో సుపరిపాలన అందాలంటే బిజెపి అధికారంలోకి రావాలని అన్నారు. అవినీతి అక్రమాలతో నిండిపోయిన కాంగ్రెస్, టిఆర్ఎస్ పార్టీల్లో ఉన్న మేధావులు, విద్యావంతులు ఆ పార్టీలకు రాజీనామా చేసి వెంటనే బిజెపిలోకి రావాలన్నారు. తెలంగాణ రాష్ట్రానికి మంచి పరిపాలన అందివ్వడం ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకొని బిజెపి సభ్యత్వం ప్రతి ఒక్కరు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివరాత్రి వేణు, రెంటాల విప్లవ కుమార్ రెడ్డి, రవి రాజా, మామిడి చెట్టు స్వామి, తుమ్మేటి దామోదర్ రెడ్డి, దారురి మహేందర్, జంజర్ల సురేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## కళాకారులను సన్మానించిన గ్రామస్తులు



**విశ్వంభర, భూపాలపల్లి:** భూపాలపల్లి జిల్లా గణపురం మండలం లక్ష్మారెడ్డి పల్లి గ్రామానికి చెందిన కళాకారులు మేడిపల్లి రాజుగౌడ్, మేడిపల్లి వెంకటేశ్వర్లు గౌడ్‌కు హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్ కింగ్ కోటిలో జరిగిన రాష్ట్రస్థాయి సినీ సంగీత విభావరి పోటీలలో ఉత్తమ గాయకులుగా ఇందిరా అవార్డు హీరో సుమన్ చేతుల మీదుగా అందించారు.అవార్డు పొందిన కళాకారులు మేడిపల్లి రాజు గౌడ్, మేడిపల్లి వెంకటేశ్వర్లు గౌడ్ ను లక్ష్మారెడ్డిపల్లి గ్రామస్తులు ఘనంగా సత్కరించి నగదు ప్రోత్సాహంగా రూ 5,116లు వారికి అందివ్వడం జరిగింది. మాజీ సర్పంచ్ ఒద్దుల విజయ అశోక్ రెడ్డి,మాజీ ఉపసర్పంచ్ మొలుగురి రాజు,గడ్డం పున్నం చందర్,వీరమల్ల వీరారెడ్డి, ఒద్దుల శ్రీకాంత్ రెడ్డి, కూచన రవీందర్,సాదు స్వప్న-చంద్రయ్య, సరోజన-సారయ్య,సుశీలగౌడ్,మామిడాల విజయ్, బాలు, వినోద్ మేడిపల్లి సతీష్ గౌడ్ ఓంకార్ గౌడ్,ఓంకార్ గౌడ్,మేడిపల్లి శ్యాంసుందర్ గౌడ్, ఓరుగంటి కుమార్‌రాకేష్, మొలుగురి ఆనంద్,ఎడ్ల రాజు పాల్గొన్నారు.

## బాలయ్య మృతి తీరనిలోటుః సబితా ఇంద్రారెడ్డి



**మహేశ్వరం విశ్వంభరః** మహేశ్వరం మండల మాజీ ఎంపీపీ పెంటమల్ల స్నేహ సురేష్ తండ్రి పెంటమల్ల బాలయ్య అనారోగ్య కారణాలవల్ల మృతిచెందారు. విషయం తెలుసుకున్న మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తుక్కుగూడ కు వెళ్లి నివాళులర్పింరి బాలయ్య మృతికి సంతాపం తెలిపారు. ఆయన మృతి తీరనిలోటన్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో తుక్కుగూడ మున్సిపాలిటి బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జల్లల లక్ష్మయ్య . కౌన్సిలర్స్ సప్పిడి రాజు .రెడ్డి గల సుమన్ రవి నాయక్. సీనియర్ నాయకులు నరసింహారెడ్డి. వీరస్వామి గౌడ్. ముప్పిడి శ్రీధర్ గౌడ్. యాదగిరి. నర్సింగ్ గౌడ్. అనిల్ చారి ఉన్నారు.. 23

## అంగన్వాడీలో పోషణ మాసోత్సవం...



**విశ్వంభర, రామన్నపేటః** రామన్నపేట మండలం బోగారం అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం మహాసభలో భాగంగా, పోషణ మాసం సందర్భంగా పోషక విలువలు కలిగిన మిల్లెట్స్ గురించి చెప్పడం, ఆకుకూరలు, కూరగాయలు, పప్పుదినుసులు, పండ్లు తీసుకోవాలని, గర్భిణీ స్త్రీలు, బాలింతలు, రక్తహీనత గురించి, నార్మల్ డెలివరీ, గవర్నమెంట్ హాస్పిటల్, 2సంత్సరాలలోపు పిల్లలకు సాం, మాం బరువులు తీసి టైంటేబుల్ ప్రకారం 8 భోజనాలు తెలియజేయడం. బాలామృతం గురించి తెలియజేయడం, తల్లులకు, కిషోర బాలికలకు, వ్యక్తిగత పరిశుభ్రత, రక్తహీనత గురించి చెప్పడం జరిగింది. సూపర్ వైజర్ మేడం హేమలత, డాక్టర్.వెంకట్, ఏ.ఎన్.ఎం రత్నకుమారి, అంగన్వాడీ టీచర్స్ శోభ, వసంత, ఆశ పారిజాత, సంధ్య పాల్గొన్నారు.

## తడి,పొడి చెత్తపై ప్రజలకు అవగాహన




**విశ్వంభర, ఘట్కేసర్:** స్వచ్ఛత ఈ సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మేడ్చల్ జిల్లా పోచారం మున్సిపాలిటీ 17వ వార్డు వీకర్ సెక్షన్‌లో శ్రమదానంతో పాటు పలు కాలనీలో ప్రజలకు తడి పొడి చెత్త గురించి అవగాహన కల్పించారు తదంతరం పోచారంలో పోచమ్మ టెంపుల్ వద్ద చెత్త క్లీనింగ్ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ శ్రీలత బుచ్చిరెడ్డి ,మమతా జగన్మోహన్ రెడ్డి, సుధా శ్రీనివాస్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



**విశ్వంభర, నారాయణపూర్:** సంస్థాన్ నారాయణపూర్ మండలంలోని గుజ్జ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఒకటవ తరగతి నుంచి పదవ తరగతి చదివే విద్యార్థుల కోసం కస్తూరి ఫౌండేషన్ చైర్మన్ కస్తూరి శ్రీ చరణ్ సహకారంతో విద్యార్థులకు నోట్ బుక్స్, బ్యాగులు, డిక్షనరీ, గ్రామర్ బుక్స్ పంపిణీ చేసిన కస్తూరి ఫౌండేషన్ సభ్యులు, అలాగే వాళ్లు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య ప్రతి ఒక్క నిరుపేద విద్యార్థికి అందాలనే లక్ష్యంతో కస్తూరి ఫౌండేషన్ తెలంగాణ వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో అనేక కార్యక్రమాలు చేపడుతూ వస్తుంది అని అన్నారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని రాబోయే వార్షిక పరీక్షల్లో మంచి గ్రేడ్లు సంపాదించి,వారి తల్లిదండ్రులకు, వారి ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకరావాలన్నారు. ఈ కార్యక్రమంలో కస్తూరి ఫౌండేషన్ సభ్యులు పెంటయ్య,మహేష్,నవీన్ రెడ్డి, నరేందర్ రెడ్డి, వీరమల్ల కార్తీక్ గౌడ్, ఎలిజాల శ్రీను,ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు, గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జన ఉత్సవాల్లో చేపూరి



**విశ్వంభర, వనస్థలిపురం:** వైదేవి నగర్ రోడ్ నెంబర్ 3 లో రైసింగ్ యూత్ గణేశుడి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మదర్ తెరిసా చారిటబుల్ సొసైటీ అధ్యక్షులు చేపూరి శంకర్ హాజరయ్యారు. వినాయకుడి లడ్డుని వేలం పాటలో 69,000 రూపాయలు దక్కించుకున్న చిన్న రామారావుకు అందజేశారు. వినాయకుడి ఆశీస్సులు వారి కుటుంబం పై నిరంతరం ఉండాలని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయకుని నిమజ్జనం, ఊరేగింపు సమయంలో ప్రజలకు ఇబ్బంది కలగకుండా కరెంటు వైర్లు జాగ్రత్తగా చూసుకొని జిహెచ్ఎంసి ఆదేశాల మేరకు, అలాగే పోలీస్ సిబ్బందికి సహకరించాలని కమిటీ సభ్యులను కోరారు. అనంతరం రైసింగ్ యూత్ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముద్దం రామచంద్ర గౌడ్, ముద్దం వెంకటేష్ గౌడ్, రామారావు, అనిల్, జయంత్ చారి, అలివేలు, భాగ్యమ్మ, విజయ, తులసి,స్వాతి,స్వప్న ప్రశాంత్, చైతన్య పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

## మజీద్ నూతన కమిటీ ఎన్నిక

### అధ్యక్షుడిగా హశం ఫారుఖీ, ఉపాధ్యక్షుడిగా ఎండి అక్బర్ అలీ నియామకం



**విశ్వంభర, నారాయణపూర్:** సంస్థాన్ నారాయణపురం గ్రామ మస్జిద్ కమిటీను శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎండి హషం ఫారుఖీ,ఉపాధ్యక్షుడిగా ఎండి అక్బర్ అలీ, కోశాధికారిగా షేక్. ఇమ్రాన్, ప్రధాన కార్యదర్శిగా ఎండి అస్రారుద్దీన్ కార్యవర్గ సభ్యులుగా ఎస్.కె పాషా, ఎండి హుస్సేన్ షరీఫ్, సయ్యద్ యాకుబ్ అలీ, ఎండి ముస్తఫా ఖాన్, ఎండి ఆర్షద్, ఎండి అఖిల్, ఎండి తబ్రేజ్, ఎండి ఖాజా అజీముద్దీన్ శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీని ముస్లిం పెద్దలు సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌసోద్దిన్ ఖురేషి, ఫయాజ్ అలీ ఖాన్, రహీమ్ షరీఫ్, యూసఫ్ ఖాన్, ఇక్బాల్, సోహెల్, నిజాముద్దీన్, నజీబ్ ఫారూకి, ఇలియాస్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు అండగా సఖి కేంద్రం

**విశ్వంభర భూపాలపల్లి:** స్త్రీలను హింసించకుండా, స్త్రీలకు సమాజంలో స్వేచ్ఛనిస్తూ వారి హక్కులకు భంగం కలగకుండా చూడాలని సఖి సెంటర్ అడ్మినిస్ట్రేటర్ గాయత్రి అన్నారు. కాటారం మండల కేంద్రం లోని రైతు వేదికలో జరిగిన మండల సమాఖ్య కార్యక్రమంలో పాల్గొని సమాజంలో మహిళలు, బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలు,వారిపై జరిగే వేదింపులపై ఆమె మాట్లాడారు.స్త్రీలపై జరిగే హింసను నివారించడం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. మహిళల స్వేచ్ఛకు, హక్కులకు భంగం కలగకుండా కాపాడుకోంటూ,స్త్రీ లను అన్ని రంగాల్లో రానించే విదంగా కుటుంబ సభ్యలు సపోర్ట్ చేయాలని కోరారు. ఎక్కడైనా స్త్రీ హింసకు గురైతే వెంటనే 1 8 1 టోల్ ఫ్రీ నెంబర్ కానీ 100 కానీ ఫోన్ చేయాలని, విద్యార్థినులు అయితే 1098 కి కాల్ చేయాలని కోరారు.బాధిత మహిళకి సఖి కేంద్రం ఎల్లవేళలా ఒక తల్లిలా అందుబాటులో ఉంటుందన్నారు. ఐదు రకాల సేవలు అయినటువంటి కౌన్సిలింగ్ , న్యాయ సహాయం, వైద్య సహాయం, పోలీస్ సహాయం, తాత్కాలిక వసతితో పాటు బాధిత మహిళకి సఖి కిట్టుని ఉచితంగా అందిస్తుందని తెలిపారు. ఆపదలో ఉన్న మహిళ వెంటనే సఖి టోల్ ఫ్రీ నెంబర్ 8500009433 కి కాల్ చేస్తే, మా సిబ్బంది వెంటనే స్పందిస్తారని, మహిళా సఖి సెంటర్ కి రాలేని పరిస్థితిలో ఉంటే మా టీం వెళ్లి మహిళని రక్షించి సఖి సెంటర్‌కు తీసుకువచ్చి అమే సమస్య పరిష్కరిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ డి .ఆర్. డి. ఓ గోవింద్,ఎ.పి.యమ్ లవన్ కుమార్,సోషల్ కౌన్సిలర్ మాదవి,మండల సమైక్య సభ్యులు పాల్గొన్నారు.




## గంజాయి ముఠా అరెస్ట్




**విశ్వంభర,కుత్బుల్లాపూర్:** మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ నియోజక వర్గం డీసీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. డీసీపీ కోటిరెడ్డి మాట్లాడుతూ పుష్ప సినిమా తరహాలో కారులో దంపతులగా నటిస్తూ గంజాయి సరఫరా చేస్తున్న ఇద్దరిని అరెస్టు చేసిన పోలీసులు ముగ్గురు పరారీలో ఉన్నట్లు తెలిపారు. వివరాల్లోకి వెళితే భార్య భర్తలుగా నటిస్తూ కారులో ప్రత్యేకంగా నిర్మించిన అరలలో గంజాయిని తరలిస్తున్నారన్న పక్కా సమాచారంతో దుండిగల్ పోలీసులు రాజేంద్రనగర్ ఎస్ఓటీ పోలీసులు సంయుక్తంగా వలపన్ని ముఠాను అరెస్టు చేసారుఔటర్ రింగ్‌రోడ్ మీదుగా గంజాయి తరలిస్తున్న 5గురు సభ్యుల ముఠా ఒరిస్సా నుండి హైదారాబాద్ మీదుగా డిల్లీకి హొండా సిటీ కార్‌లో తరలిస్తున్నట్లుగా గుర్తించారు.పోలీసులు ఇద్దరిని అదుపులో తీసుకొని వారి దగ్గర నుండి 83 కేజీల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.వారిని విచారించగా నిందితులు ఒరిస్సాకు చెందిన లక్ష్మి(30) సునీందర్ కుమార్ సింగ్ (25) భార్యభర్తల ముసుగులో గంజాయి స్మగ్లింగ్ చేస్తున్నట్లుగా , మరో ముగ్గురు అమిత్ అగర్వాల్, రాజు, శివ లు వీరికి సహకరిస్తున్నట్లుగా గుర్తించారు పరారీలో ఉన్న ఆముగ్గురి ఆచూకీకై దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. 83 కేజీల ఎండు గంజాయి, హొండా సిటీ కారు,రెండు ఫోన్ల లనును స్వాధీనం చేసుకున్నా పోలీసులు వీటి విలువ సుమారుగా రూ.32 లక్షల వరకు ఉండవచ్చని అంచనా ఇద్దరిని రిమాండుకు తరలిస్తున్నామని మేడ్చల్ డిసిపి కోటి రెడ్డి తెలిపారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్లు మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఎంపీడీవో కుసుమ మాధురి స్వచ్ఛ హి సేవ కార్యక్రమంలో భాగంగా వివోఏలతో ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు అనంతరం ఆమె ఆకుతోటపల్లి, పును నుగోనిపల్లి గ్రామ పంచాయితీ లలో సమావేశం ఏర్పాటు చేసి ఫ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా పరిశుభ్రతపై వివిధ సలహాలను అందజేశారు. గ్రామంలో మహి ళలకు బొట్టు పెట్టి మరి మరుగు దొడ్లు వాడాలని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవా లన్నారు. అనంతరం ఎంపీడీవో అమ్మ ఆదర్శ పాఠశాలలను, ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. వివఓలు, గ్రామ కార్యదర్శులు, ఎంపీపీ సిబ్బంది, ఆశ కార్యకర్తలు, పాల్గొన్నారు.

## రక్త దానం చేసేందుకు ముందుకురావాలి




**విశ్వంభర, మియాపూర్:** రక్తదానంతో ఆపదలో ఉన్న వారికి ప్రాణదానతలు అవుతారని షైన్ వేవ్ చారిటబుల్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ ముస్తఫా అన్నారు. శుక్రవారం షైన్ వేవ్ చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో మదినగూడ లోని వరుణ్ మోటార్స్ కంపెనీలో చైర్మన్ ప్రభు కిషోర్ జన్మదినం సందర్భంగా బ్లడ్ డొనేషన్ క్యాంపు నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ ముస్తఫా మాట్లాడుతూ ప్రతి ఒక్కరు రక్తదానాన్ని చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలన్నారు. రక్తం కొరతతో చాలామంది ప్రాణాలు పోతున్నాయి అన్నారు.రక్త దానం చేసిన వారిని ప్రశంసించారు.

## సమాజంలో మహిళల పాత్ర విశిష్టమైనది: సీఐ రేణుక రెడి



**విశ్వంభర,పెద్దశంకరంపేట:** సమాజంలో మహిళల పాత్ర విశిష్టమైనదని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అల్లాదుర్గం సీఐ రేణుక రెడ్డి అన్నారు.. శుక్రవారం పెద్ద శంకరం పేటలోని మండల మహిళా సమైక్య 16వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు.. సమాజంలో మహిళల పాత్ర చాలా గొప్పదని వివరించారు.. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందితే సామాజిక అభివృద్ధి జరుగుతుందన్నారు.. మహిళలు ఎవరు చెబితే వారి మాటలు వినకుండా తమ సొంత నిర్ణయం తీసుకొని ముందుకు సాగాలన్నారు. మహిళ సంఘాల ద్వారా మహిళలు రుణాలు తీసుకొని భవిష్యత్తు ప్రణాళికను రూపొందించుకోవాలన్నారు.. పేట తహసిల్దార్ గ్రేసీబాయ్. ఎస్సై శంకర్. ఐకెపి ఎపిఎం గోపాల్. ఎస్బిఐ మేనేజర్ వంశీకృష్ణ.. మండల సమాఖ్య అధ్యక్షురాలు ఫౌజియా, సీసీలు. సిబ్బంది నిరంజన్‌యోహాన్,సునీతసాయిరెడ్డి,స్వరూప,సాయమ్మ,సాయిలు నగేష్ పాల్గొన్నారు.

## 46కేజీల గంజాయి పట్టివేత




**విశ్వంభర, భద్రాచలం:** భద్రాచలంలోని ఆర్టీఏ చెక్‌పోస్ట్ వద్ద ఖమ్మం ఎన్ఫోర్స్మెంట్ బృందం చేపట్టిన వాహన తనిఖీలలో ఒరిస్సా నుంచి రాజస్థాన్ కి కారులో తరలిస్తున్న 46 కేజీల గంజా యి పట్టుబడింది. భద్రాచలం మీదుగా కారులో గంజాయి తరలిస్తున్న ముఖేష్ మిర్ధ, గుజ్జర్ శ్రీరామ అను వ్యక్తులు అరెస్ట్ చేసిన ఖమ్మం ఎన్ఫోర్స్మెంట్ అధికారులు వారి వద్ద నుంచి రెండు సెల్ ఫోన్లు, కారు, 46 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఎన్ఫోర్స్మెంట్ సిఐ శ్రీనివాస రావు ఈ తనిఖీలు చేపట్టి గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తులను అరెస్టు చేసినట్లు తెలిపారు.

## ప్రజలు మావోయిస్టులకు సహకరించొద్దు



**విశ్వంభర,కాటారం:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన పలిమెల మండలంలో మహాదేవపూర్ సీఐ రామచంద్రరావు పర్యటించారు. నేటి నుండి మావోయిస్టు పార్టీ ఆవిర్భావ దినోత్సవాలు ప్రారంభమవుతుండటంతో ఇలాంటి అసాంఘిక చర్యలు జరగకుండా గోదారితీర ప్రాంతాన్ని పరిశీలించి పలిమెల ఎస్ఐ తమాషా రెడ్డికి సూచనలు చేశారు. గ్రామాల్లోని ప్రజలు మావోయిస్టులకు సహకరించవద్దని హెచ్చరించారు.

## బీజేపీ సభ్యత్వ నమోదు




**విశ్వంభర, కల్వకుర్తి:** కల్వకుర్తి నియోజకవర్గ శక్తి కేంద్ర ఇన్చార్జిలు, మండల అధ్యక్షులు, ముఖ్య నాయకుల సమావేశం కల్వకుర్తి భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సభ్యత్వ నమోదు జిల్లా ఇంచార్జ్ మాచన్నగారి నరేందర్ రెడ్డి హాజరై మాట్లాడుతూ బిజెపి సభ్యత్వ నమోదులో యువత స్వచ్ఛందంగా బిజెపిలో చేరుతున్నారన్నారు. పార్టీ సూచన మేరకు ఇంటింటికి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించాలని ప్రతి బూతులో రెండు వందల చేయించుటకు శక్తి కేంద్ర ఇన్చార్జిలు కృషి చేయాలని కోరారు. సమావేశంలో సభ్యత్వం నమోదు కన్వీనర్ నీరుకంటి రాఘవేందర్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్య కృష్ణ గౌడ్, మాజీ జెడ్పిటిసి కండే హరిప్రసాద్, బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మొగిలి దుర్గ ప్రసాద్, బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## దళిత మహిళ పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం



**విశ్వంభర, ఎల్బీనగర్:** ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి అనుచరులు సరూర్నగర్ నుంచి బయలుదేరిన గణేష్ నిమజ్జనంలో గలాటా సృష్టించి ఒక దళిత మహిళ స్వరూప రాణి పై దాడి చేయడం తీవ్రంగా ఖండిస్తున్నాము అని సరూర్ నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్ అన్నారు. సాయి సంజీవిని ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్న స్వరూప రాణినీ శుక్రవారం పరామర్శించారు. సంధ్యారాణికి జరిగిన అవమానానికి న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని కోరడం జరిగింది.

## మిలాద్ ఉన్ నబీ ర్యాలీ



**విశ్వంభర ఘట్కేసర్:** ఘట్కేసర్ మున్సిపాలిటీలో మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ముస్లిం సోదరులు జామా మజీద్ నుంచి బాలాజీనగర్, గాంధీనగర్, ఈడబ్ల్యూఎస్ కాలనీ, ధర్మశాల, మున్సిపల్ ఆఫీస్ మీదిగా శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఘట్కేసర్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ పలుగుల మాధవ రెడ్డి, ఘట్కేసర్ మున్సిపాలిటీ బీఆర్ఎస్ అధ్యక్షుడు బండారి శ్రీనివాస్ గౌడ్, జామా మజీద్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ అబ్దుల్ అజీజ్ పాల్గొన్నారు.

## ఘనంగా మిలాద్ ఉన్ నబి వేడుకలు



**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** పెద్ద శంకరంపేటలో ముస్లీంలు శుక్రవారం మిలాద్ ఉన్ నబి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పెద్ద శంకరంపేట లోని పట్టణ పురవీధుల గుండా ముస్లిం యువకులు, చిన్నారులు ర్యాలీ నిర్వహించారు. సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

## బాల వికాస సంస్థ చేపడుతున్న ప్రజాహిత కార్యక్రమాలు అభినందనీయం

**విశ్వంభర, హన్మకొండ:** బాలవికాస సంస్థ ప్రజల సహకారంతో చేపట్టే కార్యక్రమాలు పేద ప్రజల జీవన ప్రమాణాలలో గణనీయమైన అభివృద్ధికి దోహదపడుతున్నాయని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య తెలిపారు.బాల వికాస ఆధ్వర్యంలో కాజీపేట ఫాతిమా నగర్ లోని పీపుల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సెంటర్ లో ఏర్పాటు చేసిన నేషనల్ లెవల్ వర్క్ షాప్ సీఎస్ఆర్ పార్ట్నర్ షిప్ కార్యక్రమానికి ఎంపీ డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ బాల వికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రజల భాగస్వామ్యంతో చేపట్టే కార్యక్రమాలు అద్భుత ఫలితాలను ఇస్తున్నాయని తెలిపారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ బుల్ ప్రోగ్రాంలో భాగంగా వివిధ రాష్ట్రాల ఎన్ జీఓల ప్రతినిధులతో చేపట్టిన కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో ఆర్ ఓ ప్లాంట్ల ద్వారా త్రాగు నీరు అందించడం, వాటర్ ట్యాంక్ ల నిర్మాణం, మూఢ నమ్మకాలపై ప్రజలకు అవగాహన కల్పించడం, వితంతువులు సమాజంలో ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన కల్పించడం, మహిళా సాధికారత వంటి కార్యక్రమాలు ఎంతో స్ఫూర్తినిస్తాయని అన్నారు. 45ఏళ్ళుగా బాల వికాస సంస్థ చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని వెల్లడించారు. బాల వికాస చేపట్టిన కార్యక్రమాలను ప్రభుత్వం సైతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సైతం చేపడుతున్నాయంటేనే అర్థం అవుతుందనీ అన్నారు. సమాజ దృక్పథాన్ని మార్చడంతో పాటు ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు బాల వికాస సంస్థ గొప్ప కార్యక్రమాలను చేపడుతుందని అన్నారు. కడియం ఫౌండేషన్ ద్వారా మహిళలకు, గర్భిణీ స్త్రీలకు న్యూట్రిషన్ కిట్స్, విద్యార్థినిలకు హైజినిక్ కిట్స్ తో పాటు విద్యా, వైద్య పరంగా అనేక కార్యక్రమాలను చేపడుతున్నట్లు వివరించారు. బాల వికాస ఎగ్స్ క్యూటివ్ డైరెక్టర్ శౌర్ రెడ్డి, ప్రోగ్రాం డైరెక్టర్ సునీతా రెడ్డి, వివిధ ఎన్‌జీవోల ప్రతినిధులు పాల్గొన్నారు.




## భారీగా పట్టుబడిన గంజాయి
## గంజాయి స్మగ్లర్ అరెస్ట్



**విశ్వంభర, హనుమకొండ:** గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్న ఒక గంజాయి స్మగ్లర్లను హాసన్ పర్తి, తెలంగాణ యాంటీ డ్రగ్స్ వరంగల్ విభాగం పోలీసులు సంయుక్తంగా కలిసి ఆరెస్టు చేశారు. వీరి నుండి పోలీసులు సుమారు రూ.85 లక్షల విలువ గల 338 కిలోల గంజాయితో పాటు గంజాయిని తరలిస్తున్న ట్రాక్టర్ ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

## పీఆర్‌టీయూ హైదరాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడిగా మందడి వెంకట్ రెడ్డి



**విశ్వంభర, హైదరబాద్:** నారాయణగూడలో జరిగిన పీఆర్ టీయూ టీఎస్ హైదరాబాద్ జిల్లా సర్వసభ సమావేశంలో 2024-2026 సంవత్సరానికి గాను జిల్లా ఉపాధ్యక్షుడిగా బహదూర్పురా మండలంలోని దారుల్షిఫ అందుల పాఠశాల ప్రధానోపాధ్యాయులు మందడి వెంకట్ రెడ్డిని ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వెంకట రెడ్డి గారు మాట్లాడుతూ పిఆర్‌టియుటిఎస్ మండల అధ్యక్షుడిగా 10 సంవత్సరాల అనుభవంతోనే ఉపాధ్యాయుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారానికి ప్రయత్నిస్తానని ఎన్నికలకు సహకరించిన జిల్లా అధ్యక్షులు తిరుపతి రెడ్డి కి ,జిల్లా కార్యదర్శి మధుసూదన్ రెడ్డికి ధన్యవాదములు తెలిపారు.

# అంగన్వాడీలో పోషణ మాసోత్సవం




**విశ్వంభర, త్రిపురారం:** త్రిపురారం మండలం రైతు వేదిక లో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ దామరచర్ల ఆధ్వర్యంలో పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా గర్భిణీలు, బా లింతలకు, కిషోర బాలికలకు పోషకాహారం పట్ల అవగాహన, కిశోర బాలికలకు హెచ్‌బీ టెస్టులు, అన్నప్రాసన కార్యక్ర మంలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీడీపీఓ చంద్రకళ మాట్లాడుతూ తల్లులు పోషకాహారం పట్ల అవగాహన కలిగి ఉండాలని, పిల్లలు పోషణ లోపంకి గురికాకుండా అందుబాటులో ఉన్న ఆహార పదార్థాలతో పోషకాహారాన్ని ఎలా తయారు చేసుకోవాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా ఇచ్చే బాలామృతం, గుడ్లు, తల్లులకు ఇచ్చే మధ్యాహ్న భోజనాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి తహసిల్దార్, ఎంపీవో, హై కోర్ట్ అడ్వకేట్ భవాని, వైద్యాధికారిశంకర్ నాయక్ APM హెల్త్ సూపర్వైజర్ ,ఐసీడీఎస్ సూపర్వైజర్స్ మల్లీశ్వరి, వెంకటమ్మ, విజయలక్ష్మి, మరియు సూపర్ పంచాయతీ సెక్రెటరీ రాజు, మండలంలోని అంగన్వాడీ టీచర్లు, తల్లులు కిశోర బాలికలు, హెల్త్ డిపార్ట్మెంట్ సిబ్బంది ,ఏఎన్ ఎం, ఆశా వర్కర్లు పాల్గొనడం జరిగింది.

## పంచాయతీ కార్యదర్శుల సమస్యలపై ఎంపీడీఓకు వినతి



**విశ్వంభర, రామన్నపేట:** రామన్నపేట మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల్లో నిధులు లేకపోవడంతో నిర్వహణ చేయలేకపోతున్నామని, మండల పంచాయతీ కార్యదర్శులు శుక్రవారం ఎంపీడీఓకు వినతిపత్రం అందించి, సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని, తమ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రామన్నపేట మండలంలోని వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## నిమజ్జనానికి తరలిన గణనాథుడు



**విశ్వంభర,కొత్తూరు:** కొత్తూరు మున్సిపాలిటీలోని ఎస్సీ కాలనీలో నేతాజీ యూత్ ప్రెసిడెంట్ తుప్పర రవి ఆధ్వర్యంలో వినాయక నిమజ్జన కార్యక్రమానికి ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ కుమార్ రెడ్డి,మున్సిపల్ చైర్ పర్సన్ బాతూక లావణ్య దేవేందర్ యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజల నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మాదారం నరసింహ గౌడ్, యువ నాయకుడు శివ చారి, అనిల్,నాట్కో విష్ణు, నేతాజీ యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## దోషులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం



**విశ్వంభర, ములుగు:** పెద్దమ్మగడ్డ దళితుల సమాదులను పరిరక్షించాలని ములుగు రోడ్డు పెద్దమ్మగడ్డ క్రాస్ రోడ్డు వద్ద ధర్నా చేస్తున్న దళితులకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మద్దతు తెలిపారు. ఎటువంటి అనుమతులు లేకుండా పెద్దమ్మగడ్డ దళితులు సమాదులను కూల్చి వేసిన అధికారులుపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నో ఏళ్లుగా వారు తమ భూముల పత్రాలు ఉన్నా నిరక్ష్యారాశ్యత వలన మ్యుటేషన్ గాని, పట్ట చేసుకోవడం గాని చేయలేదన్నారు. ఇదే అదనుగా చేసుకుని కొందరు వ్యక్తులు రిజిస్ట్రేషన్ చేసుకుని అన్యాయంగా కూలగొట్టారని దళితులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దోషులను చట్టపరమైన చర్యలు తీసుకునేలా చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

## ఘనంగా సాయి చందు జయంతి వేడుకలు



**విశ్వంభర, కడ్తాల్:** తెలంగాణ ఉద్యమ గాయకుడు తెలంగాణ సాధనలో కీలక పాత్ర పోషించిన మాజీ గిడ్డంగుల చైర్మన్ వేద సాయి చందు జయంతిని కడ్తాల్, ఊరుకొండ మండల కేంద్రాల్లో ఘనంగా నిర్వహించారు. కడ్తాల్ మండల కేంద్రంలో సాయిచందు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి సాయి చందు సతీమణి రజిని, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, మాజీ జెడ్పిటిసి దశరథ్ నాయక్, మాజీ సర్పంచ్ లక్ష్మీనరసింహారెడ్డి, మండల అధ్యక్షుడు కంబాల పరమేష్, పిఏసిఎస్ చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా, ఊరుకొండలో నవ భారతి అసోసియేషన్ అధ్యక్షుడు మేకల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సాయిచందు సతీమణి రజిని చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. బీఆర్ఎస్ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## షైనీస్ కిచెన్‌ను ప్రారంభించిన కేటీఆర్



**విశ్వంభర, కుత్బుల్లాపూర్:** కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో నూతనంగా ఏర్పాటుచేసిన "షైనీస్ కిచెన్స్"ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడుతూ అద్వితీయ రుచులకు చిరునామాగా "షైనీస్‌కిచెన్" నిలవాలన్నారు. రుచికరమైన భోజనాన్ని అందిస్తూ చుట్టుపక్కల వినియోగదారుల మన్ననలను పొంది దినదినాభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యేలు కెపి.వివేకానంద్, మాధవరం కృష్ణా రావు,అనిల్ జాదవ్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, కొంపల్లి మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్ మాజీ ఎం,పీ,పీ, సన్న కవితా శ్రీశైలం యాదవ్, జిహెచ్ఎంసి కార్పొరేటర్లు, మంత్రి సత్యనారాయణ, జగన్,మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి డివిజన్ అధ్యక్షులు, కొంపల్లి మున్సిపాలిటీ కౌన్సిలర్లు, వార్డు సభ్యులు, మహిళా నాయకురాలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి: ఇన్స్పెక్టర్ జగదీశ్



**విశ్వంభర, మాడుగుల:** జాతీయ మెగా లోక్ అదాలత్ ను సద్విని యోగం చేసుకోవాలని మాడుగుల మండల ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఐ. జగదీశ్ అన్నారు. ఈ నెల 18 నుండి 28వ తేదీ వరకు అమనగల్లు కోర్టులో జాతీయ లోక్ అదాలత్ కార్య క్రమం నిర్వహిస్తారని తెలిపారు. పలురకాల పాత కేసులను పరిష్కరించుకోనేందుకు ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రతీ ఒక్కరూ వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు వివిధ ఘర్షణల్లో కేసులు నమోదు చేసు కున్నవి, క్రిమినల్ కేసులు.సివిల్ కేసులు, భూ తగాద కేసులు, యాక్సిడెంట్ కేసులు,కుటుంబ తగాదాల కేసులు,చిన్న చిన్న దొంగతనాల కేసులు,ఇంతవరకు పరిష్కారం కానీ ఇతర కేసులను సైతం రాజీ చేసుకునేందుకు ఇదో మంచి అవకాశ మన్నారు. ఎవరూ ప్రతీకారాలకు పోకుండా సమస్యలను సామ రస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. స్నేహాభావంతో మెలగడానిఈ అదాలత్ఎంతో దోహదపడుతుందన్నారు, ఈలోక్ అదాలత్‌లో రాజీ చేసుకుని, కేసును పూర్తిగా క్లోజ్ చేసుకునే అవకాశం ఉందని ఇన్స్పెక్టర్ స్పష్టం చేశారు, చట్టస మ్మతమైన రీతిలో వివాదాలు పరిష్కరించడమే దీని మాడుగుల పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఐ జగదీశ్ అన్నారు.

## వ్యక్తిపై చాకుతో దాడి

**విశ్వంభర,ఘట్కేసర్:** ఘట్కేసర్ మున్సిపాలిటీ ఈడబ్ల్యూఎస్ కాలనీ డైమండ్ యూత్ వినాయక నిమజ్జనంలో సాయి అనే వ్యక్తిని మహేందర్ అనే వ్యక్తి వెనుక నుంచి వచ్చి గురువారం అర్ధరాత్రి చాకుతో పొడిచాడు. అతన్ని వెంటనే కీసర లోగల నితిన్ హాస్పిటల్‌కి చికిత్స నిమిత్తం పంపించడం జరిగింది. నిందితుడు మహేందర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సాయి భార్య మానస ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సాయిపై హత్యా ప్రయత్నానికిగల కారణం మానస తల్లిదండ్రులకు, అన్నదమ్ములకు ఇష్టం లేకుండా లవ్‌మ్యారేజ్ చేసుకోవడమే అని భావిస్తున్నారు.

## హన్మకొండ జిల్లాను పోషణలోప రహిత జిల్లాగా మార్చాలి



**విశ్వంభర, హన్మకొండ:** ఆరోగ్య శాఖ వారి సమన్వయంతో జిల్లాలో పీహెచ్‌సీ స్థాయి నుండి 0-6 సంవత్సరాల పిల్లల పోషణ లోపం గుర్తించి, ఆరోగ్య పరీక్షలు నిర్వహించి సంపూర్ణ ఆరోగ్య వంతులుగా తీర్చిదిద్దాలని రాజమణి అన్నారు.జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్. కె. లలిత దేవి మాట్లాడుతూ జిల్లాలో ప్రతీవారం అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాలలో అన్ని వయస్సుల వారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నాము అని, రక్త హీనత శిభిరాలను నిర్వహించి గర్భిణీ, బాలింతలు మరియు కిషోర బాలికలకు పరీక్షలు నిర్వహిస్తామని, జిల్లాలోని 14 మండలాల్లో ఉన్న అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు.

## మేడిగడ్డ తండాలో ఫ్రైడే డ్రైడే



**విశ్వంభర,ఆమనగల్లు:** ఆమనగల్లు మండలం మేడిగడ్డ తాండ గ్రామపంచాయతీలో శుక్రవారం గ్రామ కార్యదర్శి వెంకటయ్య ఆధ్వర్యంలో గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ ఫ్రైడే డ్రైడే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫ్రైడే డ్రై డేలో భాగంగా వర్షాకాలం నేపథ్యంలో దోమల ప్రబలే అవకాశం ఉన్నందున ఇంటి చుట్టూ టైర్లు కూలర్లలో నీటి తొట్టిలమే నీరు నిలవకుండా చూసుకోవాలని పరిశుభ్రత పాటించాలని గ్రామస్తులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ యువసేన నాయకులు విజయ్ రాథోడ్, శీను నాయక్, లాలునాయక్, దేవునాయక్ పాల్గొన్నారు.

## నిల్వ ఉన్న నీటిని తొలగించాలి



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం తిమ్మాపురం గ్రామంలో శుక్రవారం రోజున స్వచ్ఛతహీ సేవ-2024లో భాగంగా తెలంగాణ ప్రభుత్వం సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 02 వరకు గ్రామాల్లో , పట్టణాల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉండటానికి ప్రత్యేక కార్యక్రమానికి స్వీకారం చుట్టింది అందులో భాగంగా 4వ రోజున డ్రైడే - ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిసరాల్లో, ఇండ్లలో నీరు నిల్వ ఉన్నచోట దోమలు నివాసం ఉండటంవల్ల గ్రామస్తులు అనారోగ్యం బారిన పడే అవకాశం ఉంటుంది అని నీటిని నిల్వ లేకుండా చూసుకోవాలి అని గ్రామస్తులకు డ్రైడే ఫ్రైడే సందర్భంగా నిల్వ ఉన్న పాత్ర లలోని నీటిని తొలగించి వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఇంచార్జీ పంచాయతీ కార్యదర్శి మేడీ స్వామి, అంగన్వాడీ టీచర్ బట్టు వైష్ణవి, ఐకేపీ వివోఏ ఎన్ సరిత, ఆశాకార్యకర్త ఆర్ రజిత, అంగన్వాడీ ఆయా ఎండీ నస్రీన్, గ్రామ పంచాయతీ సిబ్బంది కోల మచ్చగిరి గౌడ్, దేవరాజు రాజశేఖర్, వేముల రాములమ్మ, బట్టు బిక్షపతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన లబ్ధిదారులకు సర్టిఫికెట్లు ప్రధానం



**విశ్వంభర,మెట్‌పల్లి:** మెట్‌పల్లి పట్టణంలోని కోదండ రామాలయం ఫంక్షన్ హాల్లో నిర్వహించిన భారత ప్రధాని నరేంద్ర మోడీ చేతి వృత్తుల వారి కొరకు ప్రవేశపెట్టిన విశ్వకర్మ యోజన పథకం ద్వారా శిక్షణను ఇచ్చి శిక్షణ పొందిన పేద విశ్వకర్మలతో వృత్తి నైపుణ్యము ఉన్న విశ్వకర్మలకు ఈ పథకం యొక్క, విశ్వకర్మ యోజన సర్టిఫికెట్లను అందజేయడం జరిగింది, సేవాదళ్ ఉపాధ్యక్షుడు భూమా చారి మాట్లాడుతూ అర్హత పొందిన లబ్ధిదారులకు మరియు వృత్తి నైపుణ్యంలో శిక్షణ పొందిన విశ్వకర్మ లకు శుభాకాంక్షలు తెలిపారు రాబోవు రోజులలో నిరుద్యోగ యువత ప్రధానమంత్రి ప్రవేశపెట్టిన విశ్వకర్మ యోజన ద్వారా లబ్ధి పొందాలని కోరారు కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకుడు చెట్లపల్లి సికిందర్ గౌడ్, వార్డ్ కౌన్సిలర్ జియా.ఐక్యు మైండ్ ట్రైనింగ్ సంస్థ సభ్యులు యాసిన్ మరియు జగ్గాసాగర్ సర్పంచ్ పుల్ల జగన్ డాకూరివెంకటేష్,వివిధ వృత్తులకు చెందిన విశ్వకర్మ నాయకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షునికి సన్మానం



**విశ్వంభర, నారాయణపూర్:** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రానికి చెందిన మందుగుల బాలకృష్ణ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులుగా రెండవసారి ఎన్నికైన సందర్భంగా ఓబీసీ జిల్లా కార్యదర్శి దంటిక అశోక్ యాదవ్ స్థానిక చౌరస్తాలో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ కార్యకర్తలకు ప్రజలకు మరెన్నో సేవలు చేసుకుంటూ మీరు మంచి మంచి పదవులు అందుకోవాలని కోరుకుంటున్నాను అని తెలిపారు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎండి నయిమ్ షరీఫ్, రాచకొండ రమేష్ బాబు, అందే నరేష్ యాదవ్, చిలుకూరి శ్రీనివాస్, రాస మల్ల వీరస్వామి పాల్గొన్నారు.

## పీడీఎస్‌యూ పోస్టర్ ఆవిష్కరణ




**విశ్వంభర, భద్రాచలం:** పీడీఎస్‌యూ 50 వసంతాల స్వర్ణోత్సవాల ను పురస్కరించుకొని శుక్రవారం భద్రాచలం డిగ్రీ కాలేజ్ లో పోస్టర్ ఆవిష్కరణ నిర్వహించడం జరిగింది. భారత విద్యార్థి ఉద్యమాలకు దిక్సూచిలా నిలిచిందని, 50 ఏళ్ల లో విద్యారంగ సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహిస్తూ, విద్యార్థుల హక్కుల కోసం, శాస్త్రీయ విద్య సాధన ,సమసమాజ స్థాపనే ధ్యేయంగా పీడీఎస్‌యూ పోరాడిందని పి.డి.ఎస్.యు. భద్రాచలం డివిజన్ కార్యదర్శి మునిగేలా శివ ప్రశాంత్ తెలిపారు.ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ పట్టణ నాయకులు ఆలం సంజు, కేసరి సాయి,ప్రవీణ్,ఇర్ఫా బాలు, భవాని, శ్రీహజ, వైష్ణవి,నవ్య,శైలజ పాల్గొన్నారు.

## యువకుని పై కర్రలదాడి.. ఇద్దరు యువకులపై అట్రాసిటీ కేసు నమోదు



**విశ్వంభర,మాడుగుల:** ఎస్సీ ఎస్టీ కేసు దర్యాప్తులో భాగంగా ఏసీబీ రాజు మాడుగుల మండలం నాగిళ్ల గ్రామాన్ని సందర్శించారు. గురువారం మధ్యాహ్నం సమయంలో యాచారం మండలం, కొత్తపల్లి గ్రామానికి చెందిన కోర్ర రాజు అనే వ్యక్తిపై వ్యక్తిగత కారణాలతో నాగిళ్ళ గ్రామానికి చెందిన సాయి కుమార్ అతని స్నేహితుడు కర్రలతో దాడి చేశారని మాడుగుల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు ఇవ్వడంతో ఎస్సీ ఎస్టీ ఆకృత్యాల నిరోధక చట్టం ప్రకారం కేసు నమోదు చేయడం జరిగింది. శుక్రవారం ఈ కేసులో దర్యాప్తులో భాగంగా కె పి వి రాజు, ఏసిపి ఇబ్రహీంపట్నం నాగిళ్ల గ్రామంలోని సంఘటనా స్థలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా నిందితులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎసిపి రాజు తెలిపారు.

## కుడా చేపట్టిన అభివృద్ధి ప్రాజెక్టులను పరిశీలించిన చైర్మన్



**విశ్వంభర, హన్మకొండ:** వరంగల్ కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, వైస్ చైర్మన్ అశ్విని తానాజీ వాకడే, సంబంధిత అధికారులతో కలిసి శుక్రవారం నగరం యొక్క మౌలిక సదుపా యాలు, పర్యాటక ఆకర్షణను పెంపొందించే లక్ష్యంతో కుడా చేపట్టిన, చేపడుతున్న పలుకీలక అభివృద్ధి ప్రాజెక్టులైన పద్మాక్షి టెంపుల్ దగ్గరిలోని సరిగమ కల్చరల్ పార్క్, పద్మాక్షి టెంపుల్ అప్రోచ్ రోడ్‌ను, భద్రకాళి సరస్సు వద్ద పర్యాటకులకు కోసం ఏర్పాటు చేసిన భద్ర కాళి ప్రొమెనేడ్, కుటుంబ విహార యాత్రలకు ప్రసిద్ధ ప్రదేశంగా నిర్మించిన కాకతీయ మ్యూజి కల్ గార్డెన్, ఆధునిక అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను అప్‌గ్రేడ్ చేస్తూ ఆలయ వీధుల ఆధ్యాత్మిక మరియు సాంస్కృతిక పవిత్రతను కాపాడటం కోసం నిర్మిస్తున్న టువంటి భద్రకాళి టెంపుల్ మాడ వీధులు, రుద్రేశ్వరస్వామి వారి వెయ్యి స్తంబముల దేవాలయ పరిసరాలను పరిశీలించారు.

## జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

### ఎమ్మెల్సీ నర్సిరెడ్డిని కలిసిన టీజేయూ జిల్లా అధ్యక్షులు షానూర్ బాబా



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణ కేంద్రంలో శాసన మండలి సభ్యులు అలుగుబెల్లి నర్సిరెడ్డిని తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ షానూర్ బాబా మర్యాద పూర్వకంగా కలిశారు . ఈ సందర్భంగా మొహమ్మద్ షానూర్ బాబా మాట్లాడుతూ శాసన మండలి సభ్యులు అలుగుబెల్లి నర్సిరెడ్డి ని మర్యాద పూర్వకంగా కలిసి జర్నలిస్టుల సమస్యలను వారి దృష్టికి తీసుకపోవడం జరిగిందని అన్నారు . రాష్ట్రంలోని వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలపై మీరు దృష్టి పెట్టాలని కోరానని అన్నారు. మీసమస్యల పరిష్కారానికి నావంతు కృషి చేస్తానని శాసన మండలిలో కూడా మాట్లాడతానని హామీఇచ్చారని తెలిపారు.

# ఏడేళ్ల నుంచి విజయవంతంగా గ్రీన్ ఇండియా ఛాలెంజ్ : మాజీ ఎంపీ జోగినపల్లి



**విశ్వంభర, హైదరాబాద్:** పర్యావరణహిత సుస్థిర అభివృద్ధిలో విద్యార్థులను మరింతగా భాగస్వామ్యం చేయాల్సిన అవసరం ఉందని ఢిల్లీలో జరిగిన యునెస్కో పర్యావరణ సదస్సులో వక్తలు అభిప్రాయాలు వ్యక్తం చేశారు. 'సుస్థిర పర్యావరణం - విద్యార్థుల పాత్ర'పై ఆరవ అంతర్జాతీయ సదస్సు రెండు రోజుల సదస్సు ఢిల్లీలోని ఇండియా హాబిటాట్ సెంటర్‌లో జరుగుతోంది. ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాలకు చెందినటువంటి పర్యావరణ నిపుణులు, శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు, ఇతర ప్రముఖులు ఈ సదస్సుకు హాజరయ్యారు. ప్రకృతి రక్షణలో పాఠశాల, కాలేజీ విద్యార్థులను గేమ్ ఛేంజర్లుగా తీర్చిదిద్దాలని ఈ యునెస్కో సదస్సులో నిపుణులు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో పర్యావరణపరంగా మానవాళికి పొంచి ఉన్న ముప్పును ఇప్పటి నుంచే విద్యార్థులకు తెలియజేసి, ప్రకృతిపట్ల తగిన బాధ్యతతో ప్రవర్తించాల్సిన తీరును వారికి నేర్పాల్సిన అవసరం ఉందని క్లైమేట్ రియాలిటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ (ఇండియా&సౌత్ ఆసియా) డాక్టర్ ఆదిత్య పండిట్ అన్నారు. గ్రీన్ ఇండియా ఛాలెంజ్ వ్యవస్థాపకులు, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ ఈ సదస్సులో పాల్గొని గ్రీన్ ఇండియా ఛాలెంజ్ ద్వారా దేశవ్యాప్తంగా చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ప్రకృతి పునరుద్ధరణలో భాగంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటడం, సమాజంలో ప్రభావిత వ్యక్తులను ఇందులో భాగస్వాములు చేయడం లాంటి కార్యక్రమాలు గత ఏడేళ్లుగా చేపడుతున్నట్లు వెల్లడించారు. గ్రీన్ ఇండియా ఛాలెంజ్ స్ఫూర్తిని సమావేశంలో పాల్గొన్న వక్తలు అభినందించారు. వివిధ స్కూళ్లలో విద్యను అభ్యసిస్తూ పర్యావరణ రక్షణపరంగా ప్రతిభ కనపరుస్తున్న విద్యార్థులకు సంతోష్ కుమార్ చేతుల మీదుగా నిర్వాహకులు అవార్డులను అందించారు. ఈ సదస్సులో కేంద్ర అడవులు, పర్యావరణ శాఖ మాజీ సెక్రెటరీ ప్రవీణ్ గారే, సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ పద్మశ్రీ కార్తికేయ సారాభాయ్,ఫారెస్ట్ మ్యాన్ ఆఫ్ ఇండియా పద్మశ్రీ జాదవ్ పయంగ్, వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియా డాక్టర్ రాజేంద్ర సింగ్ పాల్గొని ప్రసంగించారు. అడవులను కాపాడటం, నీటి వనరుల రక్షణ ప్రస్తుతం సమాజం ముందున్న అతిపెద్ద సవాల్ అన్నారు. విద్యార్థులకు ఈ విషయాలపై తగిన అవగాహన కల్పించేలా క్షేత్రస్థాయి పర్యటనతో కూడిన బోధనా విద్య ఉండాలని వారు అభిప్రాయపడ్డారు. ప్రపంచవ్యాప్తంగా వస్తున్న పర్యావరణ మార్పులు తద్వారా ఎదుర్కోబోయే సమస్యలపట్ల విద్యార్థులకు స్పష్టమైన అవగాహన కలిగించేలా సిలబస్‌లో మార్పులతో పాటు తరగతి గదుల్లో కూడా ఆ విధమైన విద్యను అభ్యసించేలా ఉండాలని అందుకు తగిన మార్పుచేర్పులను కేంద్రం చేపట్టాలని నిపుణులు సూచించారు. పర్యావరణ విద్యలో క్షేత్రస్థాయిలో పరిశీలన, విద్యార్థులకు అవగతం కూడా అత్యంత ముఖ్యమైన విషయమని అన్నారు. పర్యావరణ మార్పులు, గ్లోబల్ వార్మింగ్‌పై అధ్యయనం చేస్తున్న వివిధ దేశాలకు చెందిన శాస్త్రవేత్తలు పర్యావరణ నిపుణులు ప్యానెల్ చర్చల్లో పాల్గొని తమ అనుభవాలను పంచుకున్నారు. కార్యక్రమంలో రీతు రాజ్ పుకాన్, గ్రీన్ ఇండియా ఛాలెంజ్ సమన్వయకర్తలు కరుణాకర్ రెడ్డి, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

# లడ్డూలో కల్తీ జరిగింది వాస్తవమే: టీటీడీ ఈవో శ్యామలారావు



**విశ్వంభర, అమరావతి:** తిరుమల లడ్డూ తయారీలో కల్తీ జరిగిన మాట వాస్తవమేనని టీటీడీ ఈవో శ్యామలారావు స్పష్టం చేశారు. ల్యాబ్ నుంచి వచ్చిన నివేదికల ఆధారంగా కల్తీ జరిగినట్టు గుర్తించి సరఫరాదారు నుంచి నెయ్యి కొనుగోలును ఆపివేశామని పేర్కొన్నారు. శుక్రవారం టీటీడీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో లడ్డూ కల్తీపై వివరాలను వెల్లడించారు.తిరుమల ఆలయాన్ని భక్తులు ఎంతో పవిత్రంగా భావిస్తారని, అటువంటి చోట కల్తీ జరగడం దారుణమన్నారు. ఏపీలో అధికార మార్పిడి జరిగిన తరువాత ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో ఈవోగా బాధ్యతలు చేపట్టానని పేర్కొన్నారు. లడ్డూ నాణ్యత, ప్రమాణాలు తగ్గాయని భక్తుల నుంచి ఫిర్యాదులు వస్తున్న విషయాన్ని ముఖ్యమంత్రి తన దృష్టికి తీసుకొచ్చారని వెల్లడించారు. గత జులై నెలలో లడ్డూలో ఉపయోగించే నెయ్యిని సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్లతో సమావేశమై శుద్ధమైన నెయ్యిని సరఫరా చేయాలని సూచించామని పేర్కొన్నారు. రూ. 320కు- రూ. 411 కే కిలో నెయ్యిరాదని అందరు చెబుతున్నందునే అనుమానం వచ్చి జాతీయస్థాయిలో గుర్తింపు ఉన్న ప్రభుత్వ ఎన్‌డీడీబీ (నేషనల్ డైరీ డెవలప్‌మెంట్ బోర్డు) ల్యాబ్‌కు జులై 6న రెండు, జులై 12న మరో రెండు ట్యాంకర్ల శాంపుల్లను పంపామని తెలిపారు. వారి నుంచి వచ్చిన నివేదికల ఆధారంగా ఏఆర్ ఫుడ్స్ కంపెనీ నుంచి వస్తున్న నెయ్యిలో ప్రమాణాలు లేవని, జంతువుల కొవ్వును వాడుతున్నారని నివేదిక ఇచ్చిందని ఆయన వెల్లడించారు. టీటీడీకి సొంత ల్యాబ్ లేకపోవడంతో సరఫరాదారుల నుంచి వచ్చిన నెయ్యిని పరీక్షించలేకపోయారని ఈవో అన్నారు. దీంతో సరఫరాదారులకు కల్తీ నెయ్యి సరఫరా వరంగా మారిందన్నారు. ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవడంతో ప్రస్తుతం నాణ్య మైన లడ్డూ భక్తులకు అందుతుందని తెలిపారు. నెయ్యి నాణ్యతను తెలుసుకోవడానికి అడల్ట్రీ ల్యాబ్ టెస్ట్ ఇక్విప్‌మెంట్‌ను విరాళంగా ఇచ్చేందుకు ఎన్డీబీబీ ముందుకు వచ్చిందని, విదేశాల నుంచియంత్రాలు రావాల్సి ఉందని తెలిపారు.

## కాజీపేట మీదుగా మహబూబ్‌నగర్ గోరక్‌పూర్ మధ్య ప్రత్యేక రైళ్లు..!

**విశ్వంభర, హైదరాబాద్:** దక్షిణ మధ్య రైల్వే ప్రయాణికులకు శుభవార్త చెప్పింది. గోరక్‌పూర్ -మహబూబ్‌నగర్ మధ్య ప్రస్తుతం నడుస్తున్న ప్రత్యేక రైళ్లను అక్టోబర్‌లో నడిపిస్తున్నట్లు పేర్కొంది. గోరక్‌పూర్-మహబూబ్‌నగర్ (0530 3) మధ్య అక్టోబర్ 12, 19, 26 మధ్య ప్రతి శనివారం ప్రత్యేక రైళ్లు రాకపోకలు సాగిస్తాయని చెప్పింది. ఇక మహబూబ్‌నగర్ -గోరక్‌పూర్ (05304) మధ్య అక్టోబర్ 13, 20, 27 తేదీల్లో ప్రత్యేక రైళ్లు నడుస్తాయని పేర్కొంది. ప్రస్తుతం కొనసాగుతున్నరద్దీని దృష్టిలో పెట్టుకొని రైళ్లను పొడగిస్తున్నట్లు పేర్కొంది. రైలు జడ్చర్ల, షాద్‌నగర్, ఉమ్దానగర్, కాచిగూడ, మల్కా జ్‌గిరి, రామగుండం, బెల్లంపల్లి, నాగ్‌పూర్, ఇటార్సీ, భోపాల్, ఝాన్సీ, ఒర్రై, కాన్పూర్ సెంట్రల్, ఐష్‌బాగ్, బస్తీ స్టేషన్ల మీదుగా గోరక్‌పూర్‌కు రైలు చేరుతుందని దక్షిణ మధ్య రైల్వే వివరించింది. ప్రయాణికులు ప్రత్యేక రైళ్లను వినియోగించుకోవాలని కోరింది.

## శ్రీవారి లడ్డూ వివాదం వార్తలు ఎంతగానో కలచివేశాయి: వెంకయ్యనాయుడు



**విశ్వంభర, హైదరాబాద్:** తిరుమల శ్రీవారి ప్రసాదాల తయారీ విషయంలో వస్తున్న వార్తలు తనను ఎంతగానో కలచివేశాయని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు తెలిపారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఫోన్లో మాట్లాడినట్టు వెంకయ్యనాయుడు 'ఎక్స్'లో పోస్టు చేశారు. "తిరుమల శ్రీవారు కోట్లాది భక్తుల ఇలవేల్పు. ఆస్వామి ప్రసాదం ప్రతి భక్తుడు ఎంతో పవిత్రంగా స్వీకరిస్తారు. వారి ఆత్మీయులకు కూడా శ్రీవారి ఆశీస్సులు ఈ ప్రసాదం ద్వారా లభించాలని పంచటం మన పెద్దల నుంచి ఆచారంగా వస్తోంది. ఇంతటి ఆధ్యాత్మిక విశిష్టత ఉన్న శ్రీవారి ప్రసాదం విషయంలో నాణ్యతతో పాటు పవిత్రత మరింత కీలకం. అలాంటి పవిత్రతకు భంగం కలిగించే చిన్న పాటి దోషమైనా క్షమార్హం కాదు. నిజా నిజాలు నిగ్గుతేల్చి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునారవృతం కాకుండా చూడాలని ముఖ్యమంత్రికి సూచించా. పారదర్శకంగా వ్యవహరించాలని కోరా. అందుకు ఆయన సమ్మతించారు" అని వెంకయ్య నాయడు ట్వీట్ చేశారు.

## గత ఐదేళ్లు మహాపాపం జరిగిపోయింది.. తిరుమల లడ్డూ వివాదంపై రమణ దీక్షితులు ఆవేదన



**విశ్వంభర, తిరుమల:** తిరుమల లడ్డూ తయారీలో కల్తీ జరిగినట్లు వస్తున్న ఆరోపణలపై శ్రీవారి ఆలయ మాజీ ప్రధాన అర్చకులు రమణ దీక్షితులు ఆవేదన వ్యక్తం చేశారు. దేవుడి ప్రసాదాల్లో కల్తీ జరగడం విచారమని అన్నారు.తిరుమల శ్రీవారి లడ్డూల నాణ్యత సరిగ్గా లేదని గతంలోనే అప్పటి చైర్మన్, ఈవో దృష్టికి తీసుకెళ్లానని రమణ దీక్షితులు తెలిపారు. ప్రసాదాల పరిమాణాలు కూడా సరిగ్గా లేవని ఫిర్యాదు చేశానని అన్నారు. కానీ తన తోటి అర్చకుల సహకారం అందించకపోవడంతో.. తనది ఒంటరి పోరాటం అయ్యిందని అన్నారు. దీంతో తన పోరాటానికి ఫలితం లేకుండా పోయిందని అన్నారు. దీనివల్ల ఐదేళ్లు మహాపాపం జరిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తిరుమలను ప్రక్షాళన చేస్తానని ఏపీ సీఎం చంద్రబాబు చెప్పారని గుర్తు చేశారు. దానికి తగ్గట్టుగానే చర్యలు తీసుకున్నారని తెలిపారు. అయితే లడ్డూలో తయారీలో కల్తీ జరగడం అనేది అనుకోకుండా బయటపడిందని అన్నారు. దీనికి కూడా పరిహారంగా కర్ణాటక డైరీ నుంచి నందిని నెయ్యిని తిరిగి తీసుకొచ్చి స్వామివారికి ప్రసాదాలు తయారు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షనీయమని అన్నారు.

## జెన్‌కో అకౌంట్స్ ఆఫీసర్స్‌కు పదోన్నతులు

**విశ్వంభర, హైదరాబాద్:** టీజీ జెన్‌కో అకౌంట్స్ ఆఫీసర్స్‌కు శుక్రవారం పదోన్నతులు కల్పించారు. 29 మంది జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్లకు అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్లుగా, 17మంది అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్లకు అకౌంట్స్ ఆఫీసర్లుగా, 14 మంది అకౌంట్స్ ఆఫీసర్లకు సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్లుగా పదోన్నతి కల్పిస్తూ జెన్‌కో సీఎండీ రోనాల్డ్‌రోస్ ఉత్తర్వులిచ్చారు. పదోన్నతి కల్పించడంతోపాటు పలు జనరేటింగ్ స్టేషన్లు, కార్యాలయాల్లో పోస్టింగ్స్‌ను సైతం కల్పించారు.

## నేటి నుంచి సీపీగెట్ రెండో విడత కౌన్సెలింగ్

**విశ్వంభర, హైదరాబాద్:** పీజీ కోర్సుల్లో సీట్ల భర్తీకి సీపీగెట్ రెండో విడత వెబ్‌కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదలైంది. రెండో విడత రిజిస్ట్రేషన్లు శనివారం నుంచి ప్రారంభంకానుండగా, అభ్యర్థులు 27 వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్, సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయించుకోవచ్చు.అక్టోబర్ 1 నుంచి 4 వరకు వెబ్ ఆప్షన్లు, 5న ఎడిట్ చేసుకోవచ్చు. 9న రెండో విడత సీట్లను కేటాయిస్తారు. సీట్లు పొందిన వారు 17 వరకు కాలేజీల్లో రిపోర్ట్‌చేయాల్సి ఉంటుంది.

## వానాకాలం ధాన్యం కొనుగోళ్ళకు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలి



**విశ్వంభర భూపాలపల్లి:** వానాకాలం ధాన్యం కొనుగోళ్ళకు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడిఓసి కార్యాలయంలో వానాకాలం ధాన్యం కొనుగోలు కార్యాచరణ ప్రణాళిక రూపకల్పనపై వ్యవసాయ, పౌర సరఫరాలు, సహకార, గ్రామీణాభివృద్ధి శాఖ, తూనికలు, కొలతల శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 2024-25 వానాకాలం ధాన్యం కొనుగోలుకు సన్నదం కావాలని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కొనుగోలు కేంద్రాల్లో త్రాగునీరు , టార్పాలిన్స్, గన్ని బ్యాగులు, తేమ సాంద్రత కొలిచే యంత్రాలు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో సన్నరకం ధాన్యం ఎక్కువ సాగుచేసారని తెలిపారు. ఈ సంవత్సరంలో 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందని అందులో 1.40 వేల మెట్రిక్ టన్నులు సన్నరకం ధాన్యం, 60 వేల మెట్రిక్ టన్నుల దొడ్డురకం ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఈ సంవత్సరం వ్యవసాయ శాఖ అధికారులు ఆయా మండలాల వారీగా ధాన్యం పండించిన రైతులు వివరాల నివేదిక అందించాలని ఆదేశించారు. వ్యవసాయ అధికారుల నివేదిక ఆదారంగా కొనుగోలు కేంద్రాల సంఖ్యను పెంచాలని సూచించారు. ఎలక్ట్రానిక్ కాంటాలు ఉపయోగించాలని ధాన్యం తూకం విషయంలో అవకతవకలు జరగకుండా చూడాలని తూనికలు, కొలతల శాఖ అధికారి తనిఖీలు నిర్వహించి సీల్స్ పరిశీలించాలని ఆదేశించారు. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా నేరుగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయాలు చేసే విధంగా తగు సూచనలతో కూడిన కరపత్రాలను, ఫ్లెక్సీలను , గ్రామాలలో ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అక్రమాలకు, తక్కువ ధరకు కొనుగోలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.కొనుగోలు కేంద్రాలలో సన్నరకం ధాన్యం, దొడ్డురకం ధాన్యం రాసులను వేరు వేరుగా నిల్వ చేయాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇన్ చార్జులకు కొనుగోలు ప్రక్రియపై శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.ఈ సమావేశంలో వ్యవసాయ అధికారి విజయ భాస్కర్, పౌర సరఫరాల అధికారి శ్రీకాంత్, సహకార అధికారి శైలజ, తూనికలు కొలతల అధికారి శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

### *సిఎంఆర్ డెలివరిని త్వరిత గతిన పూర్తి చేయాలి*

మిల్లర్లు సిఎంఆర్ డెలివరీని త్వరిత గతిన పూర్తి చేయాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు.శుక్రవారం ఐడిఓసీ కార్యాలయపు కాన్ఫరెన్స్ హాలులో రైస్ మిల్లర్ల, పౌర సరఫరాల అధికారులతో సిఎంఆర్ డెలివరి గురించి సమావేశం నిర్వహించారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మిల్లర్లు సిఎంఆర్ డెలివరిని త్వరిత గతిన పూర్తి చేయాలని, ప్రభుత్వం ఈ నెల 30 వ తేదీ వరకు సమయం ఇచ్చిందని పెండింగ్ సిఎంఆర్ డెలివరిని పూర్తి చేయాలని అన్నారు.ప్రతి రోజు క్రమం తప్పకుండా మిల్లింగ్ జరగాలని నిర్ణీత సమయానికి సిఎంఆర్ డెలివరి పూర్తి చేయాలని ఆదేశించారు. సిఎంఆర్ డెలివరి చేయని మిల్లులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని100 శాతం సిఎంఆర్ డెలివరి చేయని మిల్లులకు ఖరీఫ్ ధాన్యాన్ని కేటాయించడం జరగదని పేర్కొన్నారు. జిల్లాలోని రైస్ మిల్లర్లు తప్పనిసరిగా మార్కెటింగ్ లైసెన్సులు పొందాలని లేని యెడల మిల్లులు ట్యాగింగ్ చేయడంలో ఇబ్బందులు వస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో పౌర సరఫరాలసంస్థ మేనేజర్ రాములు, పౌర సరఫరాల అధికారి శ్రీకాంత్, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

## విద్యార్థులకు కంప్యూటర్, నోట్ పుస్తకాలు పంపిణీ



**విశ్వంభర, కల్వకుర్తి:** వాసవి క్లబ్ రీజియన్ చైర్మన్ అఫీషియల్ విజిట్ వాసవి క్లబ్ కల్వకుర్తి ఆధ్వర్యంలో కల్వకుర్తి మండలంలోని ముకురాల పాఠశాలకు కంప్యూటర్ మరియు నోట్‌బుక్‌లు కంబాక్సులు పెన్సిల్స్, స్కేలు, బిస్కెట్ ప్యాకెట్స్ విద్యార్థులకు పంపిణీ చేశారు. కంప్యూటర్ దాత ఇరువెంటి రమేష్‌కు ధన్యవాదాలు తెలిపారు. వాసవి క్లబ్ రీజియన్ ఛైర్మెన్ జూలూరి సత్యనారాయణ, డిస్టిక్ ఆఫీసర్ ఇరువెంటి రమేష్ జోన్ చైర్మన్ కూన సంతోష్, కల్వకుర్తి వాసవి క్లబ్ ప్రెసిడెంట్ చిదిరే శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి కల్వ ఆంజనేయులు, కోశాధికారి దుగ్గి అశోక్ కుమార్ ప్రధానోపాధ్యాయులు రామేశ్వర్ ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## మాజీ ఉపసర్పంచ్ మృతి

### నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం పల్లెపాడు గ్రామంలో మాజీ ఉపసర్పంచ్ సుగురు సోమయ్య గుండెపోటుతో మరణించారు.ఆలేరు తాజా మాజీ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి మృతుని భౌతికాయాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించిన అలాగే వారి కుటుంబ సభ్యుల్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు కోరే బిక్షపతి, యాస ఇంద్రారెడ్డి, పంజాల వెంకన్న, మాజీ వైస్ ఎంపీపీ గ్రామశాఖ అధ్యక్షులు కాలే మల్లేష్,మండల ప్రధాన కార్యదర్శి గజ్జెల్లి శంకరయ్య, మాజీ ఎంపీటీసీ సుంకరి పర్శరాములు, మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు మిర్యాల బీరయ్య,కొత్తపల్లి పెట్టయ్య, నరసయ్య, ఏనుగు వెంకట్ రెడ్డి, కుసుమని సత్యనారాయణ్, మాజీ వార్డ్ నెంబర్లు వడ్డబోయిన సుధాకర్, గజ్జలి పరశురాము, పార్టీ నాయకులు పాల్గొన్నారు.
**మృతుడి కుంటుంబానికి ఆర్థిక సహాయం:** బీఆరెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేహెచ్ఆర్ ఫౌండేషన్ అధినేత కొప్పుల హరిదీప్‌రెడ్డి సహకారంతో గ్రామ శాఖ ఆధ్వర్యంలో 10,000/-ల రూపాయలను సోమయ్య కుటుంబాన్ని ఆర్థిక సహాయాన్ని అందజేయడం జరిగినది.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోటుబుక్స్ పంపిణీ



**విశ్వంభర, నారాయణపూర్:** సంస్థాన్ నారాయణపూర్ మండలంలోని గుజ్జ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఒకటవ తరగతి నుంచి పదవ తరగతి చదివే విద్యార్థుల కోసం కస్తూరి ఫౌండేషన్ చైర్మన్ కస్తూరి శ్రీ చరణ్ సహకారంతో విద్యార్థులకు నోట్ బుక్స్, బ్యాగులు, డిక్షనరీ, గ్రామర్ బుక్స్ పంపిణీ చేసిన కస్తూరి ఫౌండేషన్ సభ్యులు, అలాగే వాళ్లు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య ప్రతి ఒక్క నిరుపేద విద్యార్థికి అందాలనే లక్ష్యంతో కస్తూరి ఫౌండేషన్ తెలంగాణ వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో అనేక కార్యక్రమాలు చేపడుతూ వస్తుంది అని అన్నారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని రాబోయే వార్షిక పరీక్షల్లో మంచి గ్రేడ్లు సంపాదించి,వారి తల్లిదండ్రులకు , వారి ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకరావాలని కోరారు అదే మా కస్తూరి ఫౌండేషన్ లక్ష్యమని తెలిపారు .ఇలాగే ఇంకా మరెన్నో కార్యక్రమాలు కస్తూరిఫౌండేషన్ ద్వారా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కస్తూరి ఫౌండేషన్ సభ్యులు పెంటయ్య ,మహేష్ ,నవీన్ రెడ్డి , నరేందర్ రెడ్డి , వీరమల్ల కార్తీక్ గౌడ్, ఎలిజాల శ్రీను, ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు , గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

## హ్యాండ్లూమ్, హ్యాండీ క్రాఫ్ట్ మేళాకు అపూర్వ స్పందన



**విశ్వంభర, బషీర్ బాగ్ :** హ్యాండ్లూమ్, హ్యాండీ క్రాఫ్ట్ మేళాలో చేనేత కార్మికులు తయారు చేసిన నూతన కలెక్షన్స్ తో ఆల్ ఇండియా హ్యాండ్లూమ్, హ్యాండి క్రాఫ్ట్ మేళా కు అపూర్వ స్పందన వస్తుందని నిర్వాహకులు అక్బర్ ఆలీ తెలిపారు. ఈ ఎగ్జిబిషన్ అండ్ సెల్ ను సుందర్ గార్డెన్ ఫంక్షన్ హాల్ ఆంధ్రాబ్యాంక్ దగ్గర, రోడ్ నెంబర్ 2 షిరిడి సాయి నగర్, మణికొండలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ లో నాణ్యమైన చేనేత దుస్తులతో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. ఎగ్జిబిషన్‌లో అన్ని రకాల చేనేత దుస్తులు, మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి శారీలు, చందేరి, భాగల్పూర్ శారీస్, డిజైనర్ శారీస్, కోట శారీస్, కాంతా వర్క్ శారీస్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్ శారీస్, లినెన్ శారీస్, కలంకారీ శారీస్, బెంగాల్ కాటన్ శారీస్, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ బ్లౌజెస్, లక్నో చికాన్, బనారస్ శారీస్, ఖాదీ మెటీరియల్, వన్ గ్రామ్ గోల్డ్ జ్యువలరీ, బెడ్ షీట్స్, కొండపల్లి టాయ్స్ ఉన్నాయని అన్నారు.

# సింగపూర్‌లో భారతీయుడికి భారీ జరిమానా..

**సింగపూర్:** సింగపూర్‌లో ఓ భారతీయ నిర్మాణరంగ కార్మికుడికి అక్కడి కోర్టు భారీ జరిమానా విధించింది. మద్యం మత్తులో తాను ఆ తప్పు చేశానని నిందితుడు అంగీకరించడంతో అతడికి రూ.25 వేల ఫైన్ వేసింది. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. సింగపూర్‌లో గత ఏడాది అక్టోబర్ 30న రాత్రి రాము అనే భారత పౌరుడు పూటుగా మద్యం సేవించాడు. ఆ రాత్రంతా మెరీనా బే శాండ్స్ కెసినోలో గడిపాడు. తెల్లవారుజామున 5 గంటలకు కెసినో నుంచి బయటకు వచ్చిన అతను కాలకృత్యాలకు వెళ్లేందుకు ప్రయత్నించాడు. అయితే మద్యం మత్తులో మరుగుదొడ్డి ఎక్కడ ఉందో గుర్తించలేకపోయాడు. చివరకు ఉదయం 7 గంటల సమయంలో అదే ఏరియాలోని 'ది షాపీస్' అనే స్టోర్ ఎంట్రన్స్ వద్ద మల విసర్జన చేశాడు. దాంతో ఈ ఘటనపై విచారణ జరిపిన సింగపూర్ కోర్టు నిందితుడికి భారీ జరిమానా విధించింది. రాము బహిరంగ ప్రదేశంలో మల విసర్జన చేశాడని కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదించాడు. తన పని ముగించుకున్నాక అక్కడి నుంచి క్రాంజీలోని తన నివాసానికి వెళ్లాడని తెలిపారు. ఆ తర్వాత సింగపూర్ నుంచి భారత్‌కు వచ్చిన అతడు మళ్లీ జూన్ 4న వెళ్లాడు. మరోసారి అతడు కెసీనోలోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా సిబ్బంది గుర్తుపట్టారు. అతడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనపై విచారణ సందర్భంగా.. నిందితుడికి గరిష్ఠ జరిమానా విధించాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోర్టును కోరారు. అతడు దాదాపు 10 నిమిషాల పాటు బయటే ఉన్నాడని, ఇది సాధారణ విషయం కాదని అన్నాడు. నిందితుడు మాత్రం తాను మద్యం మత్తులో తప్పు చేశానని, స్వల్ప జరిమానా విధించాలని కోరాడు. దీనిపై న్యాయమూర్తి ఘాటుగా స్పందించారు. 'ఇలాంటి తప్పు పునరావృతమైతే జరిమానా మరింత ఎక్కువ ఉంటుందన్న విషయాన్ని నువ్వు మర్చిపోవద్దు' అని నిందితుడికి గట్టి వార్నింగ్ ఇచ్చారు.

# ప్రభుత్వం గత పదేళ్లుగా నిద్రపోతోంది

- హత్యల్లో, కిడ్నాపింగ్‌లలో నెంబర్ వన్
- ప్రజలారా మీరు మేల్కొండి..! కాంగ్రెస్ లావో.. హర్యానా బచావో'
- హర్యానా ప్రభుత్వంపై ఖర్గే వ్యంగ్యాస్త్రాలు



**చండీఘడ్:** హర్యానాలో అక్టోబర్ 5న అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరగనుంది. పోలింగ్ తేదీ దగ్గర పడటంతో అక్కడ ఎన్నికల వేడి రాజుకుంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్, బీజేపీలు పోటాపోటీగా ప్రచారం నిర్వహిస్తున్నాయి. ఆ రాష్ట్ర ప్రజలపై హామీల వర్షం కురిపిస్తున్నాయి. తాజాగా కాంగ్రెస్ పార్టీ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే హర్యానా ప్రభుత్వంపై వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు. అందుకు సంబంధించిన వీడియోను ఆయన తన అధికారిక ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు. 'నిరుద్యోగం, ద్రవ్యోల్బణం రాకెట్ వేగంతో పెరుగుతున్నాయి. హత్యల్లో, కిడ్నాపింగ్‌లలో హర్యానా సర్కారు నెంబర్ వన్‌గా ఉంది. రైతులకు కనీస మద్దతు ధర లభించలేదు. దానికి బదులుగా వారి కోసం నల్లచట్టాలు వచ్చాయి. హర్యానా ప్రభుత్వం గత పదేళ్లుగా నిద్రపోతోంది. ప్రజలారా మీరు మేల్కొండి..! కాంగ్రెస్ లావో.. హర్యానా బచావో' అని ఖర్గే వీడియోలో పేర్కొన్నారు.తాజాగా కాంగ్రెస్ విడుదల చేసిన మేనిఫెస్టోలో ఉచిత వైద్యం 25 లక్షల వరకు పెంచుతూ హామీ ఇచ్చింది. బీజేపీ 10 లక్షల వరకే ఉచిత వైద్యాన్ని అందించనున్నట్లు మేనిఫెస్టోలో తెలిపింది. మహిళలకు నెలకు రూ.2 వేల రూపాయలు అందజేస్తామని కాంగ్రెస్ ప్రకటిస్తే.. బీజేపీ వంద రూపాయలు పెంచి మహిళలకు రూ. 2,100 ఇవ్వనున్నట్లు హామీ ఇచ్చింది. అదేవిధంగా బీజేపీ యువతకు రెండు లక్షల ఉద్యోగాలను కల్పిస్తామని హామీ ఇచ్చింది.

# దేశానికి సైబర్ క్రైమ్ పెను సవాల్‌గా మారింది

**కేంద్ర మంత్రి నిత్యానందరాయ్**



**విశ్వంభర, హైదరాబాద్:** సైబర్ క్రైమ్ దేశానికి పెను సవాల్‌గా మారిందని కేంద్ర మంత్రి నిత్యానందరాయ్ అన్నారు. హైదరాబాద్‌లోని నేషనల్ పోలీస్ అకాడమీలో 76వ బ్యాచ్ ఐపీఎస్ పాసింగ్ ఔట్ పెరేడ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐపీఎస్‌ల గౌరవవందనాన్ని కేంద్రమంత్రి స్వీకరించారు. అనంతరం ఆయన శిక్షణ పూర్తి చేసుకున్న ట్రెయినీ ఐపీఎస్ లకు అభినందనలు తెలియజేశారు. కఠిన శిక్షణ పూర్తి చేసుకుని దేశ సేవ చేయడానికి వెళ్తున్న ఐపీఎస్‌లు అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. భారతీయ పోలీసింగ్ భవిష్యత్ కొత్త ఐపీఎస్ అధికారులపై ఆధారపడి ఉందన్నారు. ఉగ్రవాదులు, సంఘ విద్రోహ శక్తుల పట్ల అధికారులు కఠినంగా ఉండాలని సూచించారు. డిజిటల్ యుగంలో టెక్నాలజీతో అప్డేట్ అవుతూ ఉండాలని చెప్పారు. పెరుగుతున్న సైబర్ క్రైమ్‌ను కట్టడి చేయడానికి కృషి చేయాలన్నారు. సైబర్ ఫోరెన్సిక్ ల్యాబ్స్ ద్వారా కేసులను తొందరగా పరిష్కరించాలని, నేరస్తులను పట్టుకొని వారికి తొందరగా శిక్షలు పడేలా చూడాలని సూచించారు.కొత్త క్రిమినల్ చట్టాలపట్ల పోలీస్ అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని కేంద్రమంత్రి చెప్పారు. కొవిడ్ టైమ్‌లో పోలీసుల సేవ గొప్పదని కొనియాడారు. భారత పోలీస్ సేవను అత్యున్నత స్థానంలో నిలబెడతారనే నమ్మకముందని అన్నారు. కాగా, 76వ బ్యాచ్ ఐపీఎస్ పాసింగ్ ఔట్ పెరేడ్ ఘనంగా జరిగింది. పోలిస్ అకాడమీ నుంచి 54 మంది మహిళలు సహా 188 మంది ట్రెయినీ ఐపీఎస్‌లు పాసవుతున్నారు. వారిలోంచి ఏపీకి నలుగురు, తెలంగాణకు నలుగురు ట్రెయినీ ఐపీఎస్‌లను కేటాయించారు.

# మహారాష్ట్రలో ఘోర ప్రమాదం.. ఆరుగురు మృతి

**ముంబై :** మహారాష్ట్రలోని జల్నా జిల్లాలో శుక్రవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఆరుగురు వ్యక్తులు మరణించగా, మరో 17 మంది తీవ్రంగా గాయపడ్డారు. వాడిగోద్రి – జల్నా మార్గంలోని షాహపూర్ ఏరియా వద్ద మహారాష్ట్ర రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్‌కు చెందిన బస్సు ప్రమాదానికి గురైనట్లు పోలీసులు తెలిపారు.ఘటనాస్థలిలో పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. అయితే ప్రమాదం జరిగిన వెంటనే అక్కడున్న స్థానికులు.. బస్సు అద్దాలను పగులగొట్టి, చాలా మందిని బయటకు లాగి ప్రాణాలతో రక్షించారు. క్షతగాత్రులను సమీప ఆస్పత్రులకు తరలించారు. మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు. అయితే బస్సు జెవారి నుంచి జల్నా వెళ్తుండగా ట్రక్కును ఢీకొట్టినట్లు పోలీసులు పేర్కొన్నారు. ట్రక్కులో ఆరెంజ్ పండ్లను తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# తిరుమల లడ్డూ కల్తీపై నివేదిక ఇవ్వండి

**ఏపీ ప్రభుత్వాన్ని కోరిన కేంద్ర ఆరోగ్య శాఖ**

**విశ్వంభర, అమరావతి:** వైసీపీ హయాంలో తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందన్న వార్తలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో లడ్డూ కల్తీ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర నివేదిక ఇవ్వాల్సిందిగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని కోరింది.లడ్డూ కల్తీ వ్యవహారంపై ఏపీ సీఎం చంద్రబాబుతో మాట్లాడినట్లు కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా తెలిపారు. వారి వద్ద ఉన్న సమాచారాన్ని పంపించాల్సిందిగా కోరినట్లు వివరించారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం పూర్తిగా సహకరిస్తుందని హామీ ఇచ్చినట్లు చెప్పారు. ఈ అంశంలో ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు.



**లడ్డూపై వివాదం..**

కాగా, తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం ఇప్పుడు దుమారం రేపుతున్నది. వైసీపీ హయాంలో లడ్డూ తయారీ కోసం జంతు కొవ్వు వినియోగించారని ఆ రాష్ట్ర సీఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు వివాదం రేపాయి. లడ్డూ కోసం ఉపయోగించిన నెయ్యిలో జంతువుల కొవ్వు ఉన్నట్టు నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్ ఆఫ్ గుజరాత్ (ఎన్‌డీడీబీజీ) సీఏఎల్ఎఫ్ ల్యాబ్ కూడా నిర్ధారించింది. ఈ ఏడాది జూలైలో లడ్డూను ల్యాబ్‌కు పంపగా, అదే నెల 17న నివేదిక వచ్చింది. ల్యాబ్ రిపోర్ట్ ప్రకారం.. లడ్డూలో ఆవు నెయ్యి, సోయాబీన్, పొద్దు తిరుగుడు, ఆలివ్, గోధుమ బీన్, మకజొన్న, పత్తి గింజలతోపాటు చేపనూనె, జంతు కొవ్వు, పామాయిల్, పంది కొవ్వు కూడా వాడారు. ఆ రిపోర్టును గురువారం టీడీపీ అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి మీడియాకు విడుదల చేశారు.

**జగన్‌పై ఫిర్యాదు..**

ఇక ఈ అంశంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై ప్రముఖ న్యాయవాది వినీత్ జిందాల్ కేంద్ర హోం శాఖకు ఫిర్యాదు చేశారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హిందువుల ఆత్మను హత్య చేశారని వినీత్ జిందాల్ మండిపడ్డారు. హిందువుల నమ్మకాలను, విశ్వాసాలను, ఆలయం పవిత్రతను దారుణంగా దెబ్బతీశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్దేశపూర్వకంగా, కావాలనే ఇలాంటి చర్యలకు జగన్ మోహన్ రెడ్డి పాల్పడ్డారని ఆరోపించారు. ఈ క్రమంలోనే జగన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని కోరారు.

# మహిళా నాయకురాలిపై దాడి

**మెడలో చెప్పులు వేసి ఉరేగింపు**



**పాట్నా:** మహిళా నాయకురాలిపై ఆ పార్టీకి చెందిన నేత తన మద్దతుదారులతో కలిసి దాడి చేశాడు. మెడలో చెప్పుల దండ వేసి ఉరేగించాడు. తీవ్రంగా గాయపడిన ఆ మహిళ ఆసుపత్రిలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నది. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఆ నేతను అరెస్ట్ చేశారు. బీహార్‌లో అధికారంలో ఉన్న సీఎం నితీశ్ కుమార్ నేతృత్వంలోని జేడీయూలో ఈ సంఘటన జరిగింది. సీతామర్హి జిల్లాలోని బైర్గానియా బ్లాక్‌లో బుధవారం జేడీయూ కార్యక్రమం జరిగింది. అయితే ఆ పార్టీ మహిళా సెల్ జిల్లా అధ్యక్షురాలు కామిని పటేల్‌ను దీనికి ఆహ్వానించలేదు. ఈ నేపథ్యంలో ఆమెతో పాటు మరికొందరు ఫేస్‌బుక్‌లో కామెంట్లు చేశారు.కాగా, గురువారం ఉదయం ఈ అంశంపై చర్చించేందుకు వార్డు కౌన్సిలర్ సంజయ్ సింగ్ ఇంటికి కామిని పటేల్ వెళ్లింది. ఈ సందర్భంగా వారిద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఈ నేపథ్యంలో వార్డు కౌన్సిలర్ మద్దతుదారులు కామినిని చుట్టుముట్టి కొట్టారు. ఆమెను దొంగగా ఆరోపించారు. మెడలో చెప్పుల దండ వేసి వార్డు కౌన్సిలర్ నివసించే వీధిలో ఊరేగించారు. మరోవైపు అపస్మారక స్థితిలో ఉన్న కామిని పటేల్‌ను తొలుత స్థానిక ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అందించిన డాక్టర్లు మెరుగైన చికిత్స కోసం ముజఫర్‌పూర్‌లోని ఆరోగ్య సంరక్షణ కేంద్రానికి రిఫర్ చేశారు. కాగా, కామిని పటేల్ ఫిర్యాదుపై పోలీసులు స్పందించారు. జేడీయూ నేత, వార్డు కౌన్సిలర్ సంజయ్ సింగ్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే జేడీయూ మహిళా నాయకురాలిని కొట్టి, మెడలో చెప్పుల దండ వేసి ఆమెను ఊరేగించిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

# వంద రోజుల పాలనలో కాషాయ పాలకులు చేసిందేమీ లేదు

**టాంక్:** మోదీ ప్రభుత్వం వరుసగా మూడోసారి కేంద్రంలో కొలువుతీరిన తొలి వంద రోజుల పాలనలో చేసిందేమీ లేదని కాంగ్రెస్ నేత సచిన్ పైలట్ అన్నారు. అన్ని మంత్రిత్వ శాఖలకు తాము 100 రోజుల కార్యాచరణ అజెండా నిర్ధారించుకున్నామని బీజేపీ ఆర్భాటంగా చెబుతూ వచ్చినా వాస్తవానికి చేసింది శూన్యమని మండిపడ్డారు. సచిన్ పైలట్ శుక్రవారం రాజస్థాన్‌లోని టాంక్‌లో మీడియా ప్రతినిధులతో మాట్లాడారు.రాజ్యాంగ పదవిలో ఉన్న లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీని బెదిరిస్తున్న నేతలను కూడా కాషాయ పాలకులు వారించకపోవడం వారి స్వభావాన్ని, ఆలోచనా ధోరణిని ప్రతిబింబిస్తోందని వ్యాఖ్యానించారు.తొలి వంద రోజుల్లో వారు లేటరల్ ఎంట్రీ, వక్ఫ్ సవరణ బిల్లు చేపట్టినా రెండింటిపై యూటర్న్ తీసుకున్నారని అన్నారు. జమ్ము కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల తొలి దశ పోలింగ్ నేపథ్యంలో ప్రజల దృష్టి మరల్చేందుకు జమిలి ఎన్నికలకు క్యాబినెట్ గ్రీన్‌సిగ్నల్ అనే వార్తలను తెరపైకి తెచ్చారని, ఈ నిర్ణయంపైనా కేంద్ర ప్రభుత్వం యూటర్న్ తీసుకుంటుందని అన్నారుఎన్డీయే ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చినా ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, ఉత్తరాది రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా వాస్తవ



అంశాల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే జమిలి ఎన్నికలను తెరపైకి తీసుకొచ్చారని అంతకుముందు పైలట్ ఆరోపించారు.ఎన్నో అంశాలను కేంద్ర ప్రభుత్వం చేపట్టాల్సి ఉన్నా పార్లమెంట్‌లో తగినంత సంఖ్యాబలం లేకపోవడంతో యూటర్న్ తీసుకోవాల్సి వచ్చిందని అన్నారు. ప్రస్తుత పార్లమెంటరీ వ్యవస్థలో జమిలి ఎన్నికలు సాధ్యమయ్యే పని కాదని, క్యాబినెట్‌లో ఆమోదించినంత మాత్రాన అమలు అంత సులభం కాదని వ్యాఖ్యానించారు. వీరు గత నిర్ణయాలపై యూటర్న్ తీసుకున్న తరహాలోనే జమిలి ఎన్నికలపైనా యూటర్న్ తీసుకుంటారని అన్నారు.జమ్ము కశ్మీర్‌లో తొలి దశ పోలింగ్‌లో బీజేపీ పూర్తిగా వెనుకబడిందని, హరియాణలో సైతం కాషాయ పార్టీది ఇదే పరిస్థితని పేర్కొన్నారు.

# హరియాణలో ప్రభుత్వ ఏర్పాటులో ఆప్ కీలక పాత్ర

**అరవింద్ కేజ్రీవాల్**



**చండీఘడ్:** హరియాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ మెరుగైన ఫలితాలు సాధిస్తుందని ఢిల్లీ సీఎం, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ విశ్వాసం వ్యక్తం చేశారు. బీజేపీ ప్రజలకు చేసిందేమీ లేదని అన్నారు. కాషాయ పాలకులు అవినీతి, నిరుద్యోగం, ద్రవ్యోల్బణాన్ని ప్రజలకు అందించడం మినహా ప్రజల మేలు కోసం చేసిందేమీ లేదని దుయ్యబట్టారు. ఈసారి హరియాణ ప్రజలు మార్పు కోరుతున్నారని చెప్పారు. కేజ్రీవాల్ శుక్రవారం యమునానగర్‌లో జరిగిన ప్రచార ర్యాలీలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు.హరియాణలో ఏ ప్రభుత్వం కొలువుతీరినా ఆప్ మద్దతుతోనే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. ఆప్ పలు స్థానాలను చేజిక్కించుకుంటుందని, తమ పార్టీ తోడ్పాటు లేకుండా ప్రభుత్వ ఏర్పాటు సాధ్యం కాని పరిస్థితి నెలకొంటుందని కేజ్రీవాల్ ధీమా వ్యక్తం చేశారు. జగధ్రిలో పార్టీ అభ్యర్థి ఆదర్శ్‌పాల్ గుజ్జర్‌కు మద్దతుగా ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాగా, హరియాణ అసెంబ్లీ ఎన్నికలకు బీజేపీ వెల్లడించిన ఎన్నికల మ్యానిఫెస్టో కాంగ్రెస్ మ్యానిఫెస్టోకు కాపీ పేస్ట్‌లా ఉందని హరియాణ మాజీ సీఎం, విపక్ష నేత భూపిందర్ సింగ్ హుడా అంతకుముందు ఎద్దేవా చేశారు. క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి కాంగ్రెస్ పార్టీకి అనూహ్య మద్దతు లభిస్తోందని అన్నారు. పాలక బీజేపీ అన్ని రంగాల్లో విఫలమైందని ఆరోపించారు. రాష్ట్ర ప్రజలు మార్పు కోరుతున్నారని, కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. హరియాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి భంగపాటు తప్పదని కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని హరియాణ మాజీ సీఎం భూపిందర్ సింగ్ హుడా ధీమా వ్యక్తం చేశారు. హరియాణ ప్రజలు కాషాయ సర్కార్‌ను సాగనంపి కాంగ్రెస్ సర్కార్‌కు పట్టం కట్టనున్నారని విశ్వాసం వ్యక్తం చేశారు.

# ఆయుధాలు వీడండి.. లొంగిపోండి..

**నక్సల్స్‌కు అమిత్ షా వార్నింగ్**



**న్యూఢిల్లీ:** కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా నక్సల్స్‌కు వార్నింగ్ ఇచ్చారు. ఆయుధాలను వదిలిపెట్టాలని ఆయన కోరారు. హింసను వీడి ఆయుధాలు అప్పగించాలని, నక్సల్స్ సరెండర్ కావాలని ఆయన తెలిపారు. ఒకవేళ నక్సల్స్ లొంగిపోని పక్షంలో.. ఎరివేత ఆపరేషన్ ముమ్మరంగా చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. చత్తీస్‌ఘడ్‌లో నక్సల్ హింసతో లింకున్న 55 మంది బాధితులను ఉద్దేశించి ఆయన తన నివాసంలో మాట్లాడారు. 2026 మార్చి 31వ తేదీన మావోయిస్టులు తమ చివరి శ్వాస పీల్చుకుంటారని మంత్రి అమిత్ షా హెచ్చరించారు. ఈ దేశం నుంచి నక్సల్ హింస, ఐడియాలజీని రూపుమాపాలని ప్రధాని మోదీ నిర్ణయించినట్లు మంత్రి షా తెలిపారు.హింసను వీడాలని నక్సల్స్‌ను వేడుకుంటున్నానని, ఆయుధాలను విడిచిపెట్టాలని, ఈశాన్య రాష్ట్రాల మిలిటెంట్లు ఆయుధాలను అప్పగించిన తరహాలో నక్సల్స్ లొంగిపోవాలని, ఒకవేళ మీరు వినకుంటే, అప్పుడు నక్సల్ నిర్మూలన చర్యలు చేపడుతామని షా పేర్కొన్నారు. మావోయిస్టులపై జరుపుతున్న ఆపరేషన్లలో.. భద్రతా దళాలు ప్రగతిని సాధించాయని తెలిపారు. ప్రస్తుతం చత్తీస్‌ఘడ్‌లోని కేవలం 4 జిల్లాలకే మావోలు పరిమితం అయినట్లు ఆయన వెల్లడించారు. నేపాల్‌లోని పశుపతినాథ్ నుంచి ఏపీలోని తిరుపతి వరకు కారిడార్‌ను ఏర్పాటు చేయాలని మావోయిస్టులు ప్లాన్ చేశారని, కానీ మోదీ సర్కార్ ఆ ప్లాన్‌ను భగ్నం చేసినట్లు ఆయన చెప్పారు. చత్తీస్‌ఘడ్‌లోని నక్సల్ ప్రభావిత ప్రాంత ప్రజలు సంక్షేమం కోసం ప్రత్యేక ప్రణాళికలు రచించనున్నట్లు హోంశాఖ మంత్రి తెలిపారు. నక్సల్ ప్రభావిత ప్రజల్ని ఆదుకునేందుకు సిద్ధంగా ఉన్నామని... ఉద్యోగాలు, హెల్త్‌కేర్, ఇతర సంక్షేమ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

## తిరుమల ప్రసాదం వివాదంలో బీజేపీ పాత్ర ఉంటే ప్రజలు క్షమించరు : ప్రమోద్ తివారీ

**దిల్లీ:** తిరుపతి ప్రసాదం లడ్డూల తయారీలో వాడే నెయ్యిలో జంతువుల కొవ్వును ఉపయోగిస్తున్నారనే వివాదంపై కాంగ్రెస్ ఎంపీ ప్రమోద్ తివారీ కీలక వ్యాఖ్యలు చేశారు. తిరుపతిలో పంపిణీ చేసే లడ్డూల తయారీలో జంతువుల కొవ్వును వాడుతున్నారని ఎన్డీయే ప్రభుత్వంలో భాగస్వామి అయిన టీడీపీ ఆరోపిస్తోందని, ఇది దేశ ప్రజల విశ్వాసాలను బీజేపీ వమ్ము చేయడంగా పరిగణించాలని అన్నారు.టీడీపీ ప్రభుత్వంలో బీజేపీ, బీజేపీ సర్కార్‌లో టీడీపీ భాగస్వామ్య పక్షాలుగా ఉన్నందున ఈ అంశంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం తగదని వ్యాఖ్యానించారు. ఈ పాపంలో బీజేపీ పాపం ఉంటే దేశ ప్రజలు ఎన్నటికీ కాషాయ పార్టీని క్షమించరని స్పష్టం చేశారు. కాగా, తిరుమల లడ్డూ తయారిలో కల్తీ జరిగిన మాట వాస్తవమేనని టీటీడీ ఈవో శ్యామలారావు స్పష్టం చేశారు.ల్యాబ్ నుంచి వచ్చిన నివేదికల ఆధారంగా కల్తీ జరిగినట్టు గుర్తించి సరఫరాదారు నుంచి నెయ్యి కొనుగోలును ఆపివేశామని పేర్కొన్నారు. శుక్రవారం టీటీడీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో లడ్డూ కల్తీపై వివరాలను వెల్లడించారు.తిరుమల ఆలయాన్ని భక్తులు ఎంతో పవిత్రంగా భావిస్తారని, అటువంటి చోట కల్తీ జరగడం దారుణమన్నారు. ఏపీలో అధికార మార్పిడి జరిగిన తరువాత ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో ఈవోగా బాధ్యతలు చేపట్టానని పేర్కొన్నారు. లడ్డూ నాణ్యత, ప్రమాణాలు తగ్గాయని భక్తుల నుంచి ఫిర్యాదులు వస్తున్న విషయాన్ని ముఖ్యమంత్రి తన దృష్టికి తీసుకొచ్చారని వెల్లడించారు.

## లడ్డూ కల్తీపై సీబీఐ విచారణ జరిపించాలి

**అమిత్ షాకు వైఎస్ షర్మిల లేఖ**

**విశ్వంభర, అమరావతి:** తిరుమలలో లడ్డూ వ్యవహారం దేశ వ్యాప్తంగా దుమారం రేపుతోంది. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని గత ప్రభుత్వ హయాంలో తిరుమలలో తయారయ్యే ఈ లడ్డూలో జంతువుల కొవ్వు కలిపినట్లు ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ అంశంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై పలువురు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లడ్డూ కల్తీ వ్యవహారంపై జగన్ సోదరి, ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రంగా స్పందించారు.అత్యంత పవిత్రమైన తిరుపతి లడ్డూలో జంతువుల కొవ్వు వాడటం చిన్న విషయం కాదని అన్నారు. శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడారు. ఈ వివాదం కోట్లాది మంది భక్తుల మనోభావాలు దెబ్బతీసిందని అన్నారు. ఇంత పెద్ద విషయాన్ని సీఎం చంద్రబాబుఎలా ఈజీగా తీసుకున్నారో తనకు అర్థం కావడం లేదన్నారు. ఈ అంశాన్ని కాంగ్రెస్ పార్టీ సీరియస్‌గా తీసుకుందన్నారు. ఇది చిన్న సమస్య కాదని, దీనిపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా కు షర్మిల లేఖ రాశారు.

## దేశవాళీ క్రికెట్‌లోకి పాండ్యా..

**ఢిల్లీ:** టీ20 వరల్డ్ కప్ హీరో హార్దిక్ పాండ్యా టెస్టుల్లో పునరాగమనంపై కన్నేశాడు. బంగ్లాదేశ్‌తో టెస్టు సిరీస్ స్క్వాడ్‌కు ఎంపికవ్వని పాండ్యా ఇప్పుడు రెడ్ బాల్ క్రికెట్‌పై దృష్టి పెట్టాడు. 2018లో ఆఖరి టెస్టు మ్యాచ్ ఆడిన అతడు మళ్లీ తెలుపు జెర్సీ వేసుకోవాలనే కసితో ఉన్నాడు. అందులో భాగంగానే ఈ ఆల్‌రౌండర్ బరోడా(Baroda) జట్టు తరఫున దేశవాళీ క్రికెట్ ఆడేందుకు సిద్ధమవుతున్నాడు. తాజాగా అతడు నెట్స్‌లో బ్యాటింగ్, బౌలింగ్ సాధన చేస్తూ కనిపించాడు. 2018లో బరోడాకు ఆడిన పాండ్యా దాదాపు ఐదేండ్ల విరామం తర్వాత మళ్లీ ఆ జట్టుతో కలుస్తాడని సమాచారం.టెస్టు జట్టులోకి రావాలంటే ఫిట్‌నెస్ నిరూపించుకోవాలి. అందుకని దేశవాళీలో కొన్ని మ్యాచ్‌లు ఆడాల్సిందేనని ఈ ఏడాది బీసీసీఐ అల్టిమేటం జారీ చేసిన విషయం తెలిసిందే.



అందుకనే పాండ్యా టెస్టు జట్టులో చోటు కోసం దేశవాళీ క్రికెట్‌ను నమ్ముకున్నాడు. ఫస్ట్ క్లాస్ సీజన్ 2024-25లో హార్దిక్ మళ్లీ బరోడాకు ఆడే అవకాశముంది. బంగ్లాదేశ్‌తో రెండు టెస్టుల సిరీస్ ముగిశాక టీమిండియా స్వదేశంలోనే న్యూజిలాండ్‌తో మూడు టెస్టులు ఆడనుంది.అనంతరం నవంబర్‌లో బోర్డర్ – గవాస్కర్ ట్రోఫీకోసం రోహిత్ శర్మ సారథ్యంలోని భారత జట్టు ఆస్ట్రేలియా వెళ్లనుంది. అక్కడ ఐదు టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌లో ఆసీస్‌తో టీమిండియా తలపడనుంది. ఈ రెండు సిరీస్‌లకు అందుబాటులో ఉండడం కోసం పాండ్యా బరోడా తరఫున దేశవాళీ మ్యాచ్‌లు ఆడాలని నిర్ణయించుకున్నాడు. అయితే.. రంజీ సీజన్ ఆరంభానికి ఇంకో నెల మాత్రమే ఉంది. అక్టోబర్ 11న మొదలయ్యే తొలి పోరులోనే డిఫెండింగ్ చాంపియన్ ముంబైతో బరోడా తలపడనుంది. ఆ తర్వాత ఐదు రోజులకే న్యూజిలాండ్‌తో టెస్టు సిరీస్ ఉంది. సో.. పాండ్యా అద్భుతంగా రాణిస్తే తప్పు జాతీయ జట్టులోకి రావడం కష్టం.



## బంగ్లాదేశ్ భరతం పట్టిన బుమ్రా

### చెపాక్ టెస్టులో పట్టుబిగించిన భారత్

**చెపాక్:** సొంతగడ్డపై తమకు తిరుగులేదని టీమిండియా మరోసారి చాటింది. పర్యాటక బంగ్లాదేశ్‌ను హడలెత్తిస్తూ చెపాక్ టెస్టులో పట్టు బిగించింది. మూడొందల ఆధిక్యంతో బంగ్లాను ఒత్తిడిలోకి నెట్టింది. తొలి రోజు రవిచంద్రన్ అశ్విన్(113), రవీంద్ర జడేజా(86)ల అద్భుత పోరాటంతో కోలుకున్న భారత్.. రెండో రోజు బంగ్లాదేశ్ భరతం పట్టింది. యార్కర్ కింగ్ జస్ప్రీత్ బుమ్రా(4/50) ధాటికి చిగురుటాకలా వణికిన బంగ్లా 149 పరుగులకే కుప్పకూలింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో భారత్ మూడు వికెట్ల నష్టానికి 81 రన్స్ కొట్టింది. ఓవర్ నైట్ స్కోర్‌తో రెండో రోజు ఆట కొనసాగించిన భారత్ తొలి సెషన్‌లోనే ఆలౌటయ్యింది. తస్కిన్ అహ్మద్(3/55) మూడు వికెట్లతో రాణించి బంగ్లాకు బ్రేకిచ్చాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్‌ను ధాటిగా ఆరంభించిన భారత్‌ను తస్కిన్ మరోసారి దెబ్బకొట్టాడు. కెప్టెన్ రోహిత్ శర్మ (5)ను స్వల్ప స్కోర్‌కే ఔట్ చేశాడు.క్రీజులో కుదురుకున్నట్టే కనిపించిన యశస్వీ జైస్వాల్(10)ను నహిద్ రానా ఆఫ్ సైడ్ బంతితో బోల్తా కొట్టించాడు. ఆ కాసేపటికే విరాట్ కోహ్లీ(17)ను మెహిదీ హసన్ మిరాజ్ ఎల్బీగా వెనక్కి పంపాడు. మూడు వికెట్లు పడిన దశలో శుభ్‌మన్ గిల్ (33 నాటౌట్), రిషభ్ పంత్(12 నాటౌట్)లు ఆచితూచి ఆడారు. రెండో రోజు ఆట ముగిసే సరికి నాలుగో వికెట్‌కు 14 పరుగులు జోడించారు.

**బుమ్రా, ఆకాశ్ జోరు..**

చెపాక్ స్టేడియంలో భారత బౌలర్ల ధాటికి బంగ్లాదేశ్ విలవిలలాడింది. టీమిండియా పేసర్ల విజృంభణకు నిలువలేక ఒకటిన్నర సెషన్‌లోనే చాప చుట్టేసింది. జస్ప్రీత్ బుమ్రా(4/50), మహ్మద్ సిరాజ్(2/30) బుల్లెట్ బంతులను ఎదుర్కోలేక 149 పరుగులకు ఆలౌటయ్యింది. దాంతో, టీమిండియాకు 227 పరుగుల ఆధిక్యం లభించింది. తొలి ఇన్నింగ్స్‌లో రోహిత్ సేన 376 పరుగులు కొట్టిన విషయం తెలిసిందే.

## చరిత్ర సృష్టించిన యశస్వీ



### 147 ఏండ్లలో ఒకేఒక్కడు

అంతర్జాతీయ క్రికెట్‌లో సంచలనంగా మారిన భారత యువ ఓపెనర్ యశస్వీ జైస్వాల్ మరో ఘనత సాధించాడు. చిన్నవయసులోనూ 'థౌజండ్‌వాలా'గా రికార్డు నెలకొల్పిన ఈ చిచ్చరపిడుగు టెస్టుల్లో సునీల్ గవాస్కర్ సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లీ వంటి భారత దిగ్గజ క్రికెటర్లకు సైతం సాధ్యంకాని రికార్డు సృష్టించాడు. విధ్వంసక ఇన్నింగ్స్‌లతో అలరించే ఈ యంగ్‌స్టర్ తొలి 10 మ్యాచుల్లో అత్యధిక పరుగుల వీరుడిగా అవతరించాడు. తద్వారా 147 ఏండ్ల సుదీర్ఘ ఫార్మాట్ చరిత్రలో ఈ ఘనతకు చేరువైన భారత ఆటగాడిగా నిలిచాడు. చెపాక్ స్టేడియంలో బంగ్లాదేశ్‌పై తొలి ఇన్నింగ్స్‌లో 56, రెండో ఇన్నింగ్స్‌లో 10 రన్స్ చేసిన యశస్వీ ప్రస్తుతం ఖాతాలో 1,094 పరుగులు ఉన్నాయి. లెజెండరీ ఆటగాడు సునీల్ గవాస్కర్ 978 పరుగులతో రెండో స్థానంలో, వినోద్ కాంబ్లీ 937 పరుగులతో మూడో స్థానంలో కొనసాగుతున్నారు.

**రెండో భారత క్రికెటర్‌గా..**

ఈ ఏడాది ఆరంభంలో ఇంగ్లండ్ సిరీస్‌లో దంచికొట్టిన యశస్వీ టెస్టుల్లో 1,000 పరుగులు పూర్తి చేసుకున్నాడు. ధర్మశాల టెస్టులో షోయబ్ బషీర్ బౌలింగ్‌లో బౌండరీ బాది యశస్వీ ఈ మైలురాయికి చేరువయ్యాడు. దాంతో, తక్కువ ఇన్నింగ్స్‌ల్లోనే వెయ్యి పరుగులు బాదిన రెండో భారత క్రికెటర్‌గా చరిత్ర సృష్టించాడు.ఈ చిచ్చరపిడుగు 16 ఇన్నింగ్స్‌ల్లో ఈ ఫీట్ సాధించగా.. మాజీ ఆటగాడు వినోద్ కాంబ్లీ 14 ఇన్నింగ్స్‌ల్లోనే వెయ్యి రన్స్ కొట్టాడు. 18 ఇన్నింగ్స్‌ల్లో వెయ్యి పరుగులు కొట్టిన ఛతేశ్వర్ పూజారా మూడో స్థానానికి పడిపోయాడు. అంతేకాదు బ్యాటింగ్ యావరేజ్‌లోనూ యశస్వీ రికార్డులు బ్రేక్ చేశాడు.

**సగటులోనూ సూపర్..**

వినోద్ కాంబ్లీ 83.33 సగటుతో టాప్‌లో నిలవగా.. యశస్వీ 71.43 సగటుతో మూడో స్థానందక్కించుకున్నాడు. ఆసీస్ దిగ్గజం డాన్ బ్రాడ్‌మన్ 7 మ్యాచుల్లోనే ఈ మైలురాయికు చేరుకోగా.. యశస్వీ 9 వ మ్యాచ్‌లో ఈ ఫీట్ సాధించాడు. ఎవర్టన్ వీకెస్, హెర్బెర్ట్ సట్‌క్లిఫె, జార్జ్ హెడ్లేలు 9 మ్యాచుల్లో వెయ్యి రన్స్ కొట్టారు. అత్యంత చిన్నవయసులోనే టెస్టుల్లో వెయ్యి రన్స్ కొట్టిన యశస్వీ.. మాజీ ఆటగాడు దిలీప్ వెంగ్‌సర్కార్ రికార్డు బ్రేక్ చేశాడు. సచిన్ 19 ఏండ్ల 217 రోజుల్లో వెయ్యి పరుగులు చేసి టాప్‌లో ఉన్నాడు. యశస్వీ 22 ఏండ్ల 70 రోజుల్లో వెయ్యి రన్స్ చేసిన నాలుగో ఆటగాడిగా నిలిచాడు. భారత దిగ్గజం కపిల్ దేవ్ 21 ఏండ్ల 27 రోజుల్లో ఈ ఫీట్ సాధించాడు.



## అంతర్జాతీయ క్రికెట్‌లో 400 వికెట్ల క్లబ్‌లో బుమ్రా

విశ్వంభర (క్రీడా విభాగం): భారత జట్టు ప్రధాన పేసర్ జస్ప్రీత్ బుమ్రా మరో మైలురాయికి చేరుకున్నాడు. బంగ్లాదేశ్‌పై నాలుగు వికెట్లతో చెలరేగిన ఈ స్పీడ్‌స్టర్ అంతర్జాతీయంగా 400 వికెట్ల క్లబ్‌లో చేరాడు. తద్వారా ఈ ఫీట్ సాధించిన ఆరో భారత పేసర్‌గా, మొత్తంగా పదో బౌలర్‌గా బుమ్రా చరిత్ర సృష్టించాడు. మూడు ఫార్మాట్లలో అత్యుత్తమ బౌలర్‌గా ఎదిగిన ఈ యార్కర్ కింగ్ 227 ఇన్నింగ్స్‌లో ఈ ఘనత సొంతం చేసుకున్నాడు. అతడు 21.01 సగటతో 401 వికెట్లు పడగొట్టాడు.బుమ్రా కంటే ముందు పేసర్లు కపిల్ దేవ్, జవగల్ శ్రీనాథ్, జహీర్ ఖాన్, ఇషాంత్ శర్మ, మహమ్మద్ షమీలు నాలుగ్గొందల క్లబ్‌లో చేరారు. ప్రస్తుతం భారత్ తరఫున అత్యధిక వికెట్ల వీరుడు ఎవరంటే.. అనిల్ కుంబ్లే. లెజెండరీ స్పిన్నర్ అయిన కుంబ్లే మూడు ఫార్మాట్లలో 953 వికెట్లతో టాప్‌లో ఉన్నాడు. చెపాక్ టెస్టులో శతకంతో మెరిసిన అశ్విన్ 744 వికెట్లతో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు.

## స్టాక్ మార్కెట్ల కొత్త చరిత్ర

### తొలిసారిగా 84వేల మార్క్‌ను దాటిన సెన్సెక్స్..

### 1350 పాయింట్లపైగా జంప్..!



**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్లు కొత్త రికార్డులు సృష్టించాయి. సెన్సెక్స్ తొలిసారిగా 84వేల మార్క్‌ని దాటింది. నిఫ్టీ సైతం 25,800 పాయింట్ల ట్రేడయ్యింది. చివరకు రికార్డు స్థాయిలోనే ముగిశాయి. ఈ క్రమంలో సెన్సెక్స్ 1359 పాయింట్లు, నిఫ్టీ 375 పాయింట్లకుపైగా లాభపడి తొలిసారిగా గరిష్ఠ స్థాయిలో ముగిశాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ నాలుగు సంవత్సరాల తర్వాత వడ్డీ రేట్లను తగ్గించింది. దీంతో మార్కెట్లకు కొత్త ఊపినిచ్చినట్లయ్యింది. ఈ క్రమంలో గురువారం అమెరికా మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. ఈ ప్రభావం భారతీయ మార్కెట్లపై సానుకూల ప్రభావం చూపింది. ఈ నేపథ్యంలో దేశీయ మార్కెట్లు తొలిసారిగా కొత్త గరిష్ఠాలను నమోదు చేశాయి. కిత్రం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 83,603.04 వద్ద భారీ లాభాల్లో మొదలైంది. ఆ తర్వాత పెరుగుతూ మధ్యాహ్నం వరకు తొలిసారిగా 84వేల మార్క్‌ను దాటింది. అదే ఊపును కొనసాగిస్తూ తొలిసారిగా రికార్డు స్థాయిలో 84,694.46 పాయింట్లను తాకింది. చివరకు 1,359.52 పాయింట్ల లాభంతో 84,544.31 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 25,525.95 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 25,426.60 పాయింట్ల కనిష్ఠానికి చేరి.. 25,849.25 గరిష్ఠానికి చేరింది. ఈ స్థాయికి నిఫ్టీ చేరుకోవడం ఇదే తొలిసారి. చివరకు 375.15 పాయింట్ల లాభంతో 25,790.95 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో దాదాపు 2,346 షేర్లు పురోగమించగా.. 1,434 షేర్లు పతనమయ్యాయి. ఇక ఆటో, బ్యాంక్, క్యాపిటల్ గూడ్స్, హెల్త్‌కేర్, ఎఫ్ఎంసీజీ, పవర్, టెలికాం, మెటల్, రియల్టీ ఒకశాతం నుంచి మూడుశాతం లాభాలను నమోదు చేశాయి. నిఫ్టీలో ఎంఅండ్ఎం, ఐసీఐసీఐ బ్యాంక్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, భారతీ ఎయిర్‌టెల్, ఎల్అండ్‌టీ, అత్యధికంగా లాభపడ్డాయి. గ్రాసిమ్ ఇండస్ట్రీస్, ఎస్‌బీఐ, ఇండస్‌ఇండ్, టీసీఎస్, బజాజ్ ఫైనాన్స్ నష్టపోయాయి. బీఎస్ఈలో మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు ఒకశాతం చొప్పున వృద్ధిని నమోదు చేశాయి.

## భారీ డిస్కౌంట్ ధరకే శాంసంగ్ గెలాక్సీ ఎస్24

**విశ్వంభర (బిజినెస్):** దక్షిణ కొరియా ఎలక్ట్రానిక్స్ దిగ్గజం శాంసంగ్ తన గెలాక్సీ ఎస్24 ఫోన్‌పై భారీ డిస్కౌంట్ అందుబాటులో ఉంది. ఫెస్టివల్ సీజన్ సందర్భంగా ప్రమోషనల్ ప్రైస్ కింద ధర తగ్గిస్తున్నట్లు శుక్రవారం తెలిపింది. కంపెనీ వెబ్ సైట్, ఆఫ్ లైన్ రిటైల్ స్టోర్లలో రూ.60 వేల లోపు ధరకే శాంసంగ్ గెలాక్సీ ఎస్ సిరీస్ ఫోన్లు సొంతం చేసుకోవచ్చు. ఫెస్టివల్ సీజన్ సందర్భంగా అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ సేల్ లో ఈ డిస్కౌంట్ అందిస్తోంది.శాంసంగ్ గెలాక్సీ ఎస్24 ఫోన్ రూ.59,999లకే లభిస్తుంది. బ్యాంక్ ఇన్ స్టంట్ క్యాష్ బ్యాక్ ఆఫర్ రూ.12,000తోపాటు అప్ గ్రేడ్ బోనస్ రూ.3000తో ధర తగ్గుతుంది. వాస్తవంగా గత జనవరిలో ఆవిష్కరించిన శాంసంగ్ గెలాక్సీ ఎస్ 24 ఫోన్ 8జీబీ ర్యామ్ విత్ 128 జీబీ స్టోరేజీ వేరియంట్ ధర రూ.74,999లకు లభిస్తుంది. ఆఫర్‌లో భాగంగా శాంసంగ్ గెలాక్సీ ఎస్ 24 ఫోన్ కొనుగోలు చేసే వారికి ఎక్స్చేంజ్ డిస్కౌంట్ కింద రూ.40 వేల వరకూ రాయితీ అందిస్తోంది శాంసంగ్. శాంసంగ్ గెలాక్సీ ఎస్24 ఫోన్ ప్రస్తుతం అమెజాన్



లిస్టింగ్ లో రూ.57,490 పలుకుతోంది. ఎక్స్చేంజ్ ఆఫర్ కింద రూ.24,250లకే సొంతం చేసుకోవచ్చు. ఈ నెల 27 నుంచి అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ సేల్ ప్రారంభం అవుతున్నది. శాంసంగ్ గెలాక్సీ ఎస్24 ఫోన్ 6.2 అంగుళాల ఫుల్ హెచ్డీ+ డైనమిక్ అమోలెడ్ 2ఎక్స్ స్క్రీన్ విత్ 120 హెర్ట్జ్ రీఫ్రెష్ రేటుతో లభిస్తుంది. ఎక్స్ నోస్ 2400 ప్రాసెసర్ తో పని చేస్తుంది. 12 జీబీ ర్యామ్ విత్ 512 జీబీ స్టోరేజీ వేరియంట్ వరకూ లభిస్తుంది. ఆండ్రాయిడ్ 14 విత్ యూఐ 6.1.1 వర్షన్ పై పని చేస్తుందీ ఫోన్. శాంసంగ్ గెలాక్సీ ఎస్24 ఫోన్ 50-మెగా పిక్సెల్ ప్రైమరీ సెన్సర్ కెమెరా, 12 -మెగా పిక్సెల్ అల్ట్రావైడ్ సెన్సర్ కెమెరా, 10-మెగా పిక్సెల్ టెలిఫోటో కెమెరా విత్ 3ఎక్స్ ఆప్టికల్ జూమ్, సెల్ఫీలూ వీడియో కాల్స్ కోసం 12-మెగా పిక్సెల్ సెన్సర్ కెమెరా ఉంటాయి. శాంసంగ్ గెలాక్సీ ఎస్24 ఫోన్ 5జీ, 4జీ ఎల్టీఈ, వై-ఫై 6ఈ, బ్లూటూత్ 5.3, జీపీఎస్, ఎన్ఎఫ్సీ, యూఎస్బీ టైప్ సీ పోర్ట్ కనెక్టివిటీ కలిగి ఉంటుంది. 25వాట్ల చార్జింగ్, ఫాస్ట్ వైర్ లెస్ చార్జింగ్ 2.0, వైర్ లెస్ పవర్ షేర్ మద్దతుతో 4000 ఎంఏహెచ్ కెపాసిటీ గల బ్యాటరీతో పని చేస్తుంది.



## మార్కెట్లోకి రాయల్ ఎన్‌ఫీల్డ్ బెటాలియన్ బ్లాక్ బుల్లెట్ ..!

**విశ్వంభర (బిజినెస్):** ప్రముఖ ద్విచక్ర వాహనాల తయారీ సంస్థ రాయల్ ఎన్‌ఫీల్డ్ తన బుల్లెట్ 350 మోటారు సైకిళ్లను విస్తరిస్తోంది. తాజాగా రాయల్ ఎన్‌ఫీల్డ్ తన బుల్లెట్ 350 'బెటాలియన్ బ్లాక్' మోటారు సైకిల్‌ను శుక్రవారం భారత్ మార్కెట్లో ఆవిష్కరించింది. దీని ధర రూ.1,74,730 పలుకుతుంది. ఐకానిక్ మోడల్ మోటారు సైకిల్ పలు మార్పులతో వస్తోంది. వింటేజ్ డిజైన్ క్యూస్, బెటాలియన్ బ్లాక్ ఎడిషన్ మోటారు సైకిళ్లు పాత మోడల్ బైక్స్ నుంచి బెంచ్ సీట్, హ్యాండ్ పెయింటెడ్ గోల్డ్ పిన్ స్ట్రైప్స్, ట్యాంక్ అండ్ సైడ్ ప్యానెల్స్ మీద 3డీ బ్యాడ్జెస్ వంటి పలు రెట్రో ఫీచర్లను తీసుకొస్తోంది రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ 350 బెటాలియన్ బ్లాక్ మోటారు సైకిల్. స్పోక్ వీల్స్‌తోపాటు క్రోమ్ రిమ్స్, బ్లాక్ మిర్రర్స్, ఓల్డ్ లైసెన్స్ ప్లేట్, టెయిల్ లాంప్ రిమినిస్కెంట్ వంటి ఫీచర్లు జత చేశారు. జే-ప్లాట్ ఫామ్ పై రూపుదిద్దుకున్న 349సీసీ సింగిల్ సిలిండర్, ఎయిర్ కూల్డ్ మోటారు కలిగి ఉంటుంది. ఈ ఇంజిన్ గరిష్టంగా 20.2 హెచ్పీ విద్యుత్, 27 ఎన్ఎం టార్క్ వెలువరిస్తుంది. 5-స్పీడ్ గేర్ బాక్స్ ఉంటది. సేఫ్టీని పెంపొందించే సింగిల్ చానెల్ ఏబీఎస్‌తో కూడిన 300 ఎంఎం ఫ్రంట్ డిస్క్, 153 ఎంఎం రేర్ డ్రమ్ బ్రేక్స్ ఉంటాయి. ఇక మిలిటరీ వేరియంట్ బెటాలియన్ బ్లాక్ ఎడిషన్, బ్లాక్ గోల్డ్ స్టాండర్డ్ వేరియంట్లలో లభిస్తుందీ రాయల్ ఎన్ ఫీల్డ్ 'బెటాలియన్ బ్లాక్' మోటారు సైకిల్. ఫెస్టివ్ సీజన్ నేపథ్యంలో రాయల్ ఎన్‌ఫీల్డ్ తన బుల్లెట్ బ్లాక్ బెటాలియన్ ఆవిష్కరించడం ప్రాధాన్యం సంతరించుకున్నది.



## బంగారం ధగధగలు

### మరో జీవిత కాల గరిష్టానికి పుత్తడి ధర..!

**విశ్వంభర (బిజినెస్):** యూఎస్ ఫెడ్ రిజర్వు కీలక వడ్డీరేట్లు తగ్గించడంతో బంగారం ధర ధగధగ మెరుస్తోంది. దీనికి తోడు దేశీయంగా ఫెస్టివల్ సీజన్, పెండ్లిండ్ల సీజన్ నేపథ్యంలో పుత్తడి ధర సరికొత్త పుంతలు తొక్కుతున్నది. శుక్రవారం దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారట్ల బంగారం తులం ధర రూ.700 పెరిగి రూ.76,350లకు చేరుకున్నది. గురువారం పది గ్రాముల బంగారం (24 క్యారట్స్) ధర రూ.75,650 వద్ద ముగిసిన సంగతి తెలిసిందే. మరోవైపు, గోల్డ్ కాంట్రాక్ట్స్ అక్టోబర్ డెలివరీ ధర రూ.341 వృద్ధితో రూ.73,779 పలికింది. కిలో వెండి కాంట్రాక్ట్స్ డిసెంబర్ డెలివరీ ధర రూ.145 పుంజుకుని రూ.90,113లకు చేరుకున్నది. గత నెలలో రికార్డు స్థాయిలో బంగారం దిగుమతి జరిగిన సంగతి తెలిసిందే.దిగుమతి సుంకాలు భారీగా తగ్గించడంతో ఆగస్టు నెలలో 10.06 బిలియన్ డాలర్ల విలువైన బంగారం దిగుమతులు నమోదయ్యాయి. గతేడాది ఆగస్టు నెలలో బంగారం దిగుమతులు 4.93 బిలియన్ డాలర్లు మాత్రమే. ప్రస్తుత ఆర్థిక సంవత్సర బడ్జెట్లో కేంద్రం బంగారం, వెండిలపై దిగుమతి సుంకాన్ని 15 నుంచి ఆరు శాతానికి తగ్గించిన సంగతి తెలిసిందే. చైనా తర్వాత బంగారం అత్యధికంగా దిగుమతి చేసుకునే దేశం భారత్. అంతర్జాతీయంగా కామెక్స్ గోల్డ్ ఫ్యూచర్స్ ధర 2,632.90 డాలర్లు పలికింది. యూఎస్ ఫెడ్ రిజర్వు కీలక వడ్డీరేట్లు తగ్గించిన తర్వాత బంగారం ధర ఒక శాతానికి పైగా పెరిగింది. ఔన్స్ వెండి ధర 31.54 డాలర్లు పలికింది.

# 50 సెకన్లకు రూ.5 కోట్లు

## ఇండియాలోనే హైయెస్ట్ రెమ్యునరేషన్ తీసుకున్న హీరోయిన్ ఎవరంటే..?

ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీలో చాలా మంది నటులు, నటీమణులు అత్యధిక పారితోషికం తీసుకుంటున్న విషయం తెలిసిందే. వారు తమ స్టార్ హోదాకు తగినట్టుగా సినిమాల్లో, యాడ్స్ ల్లో నటిస్తున్నారు. అయితే.. ఓ హీరోయిన్ కొన్ని సెకన్ల యాడ్ కోసం భారీ మొత్తంలో రెమ్యూనరేషన్ తీసుకుందట. సెకన్ల యాడ్ అంటున్నారు.. కోటి.. లేదా రెండు కోట్లో తీసుకుంది కావొచ్చు అనుకుంటారు. కానీ ఈ బ్యూటీ కేవలం 50 సెకన్ల యాడ్ కోసం ఏకంగా రూ. 5 కోట్లు తీసుకుందట. ఇంతకీ అమ్మడు ఎవరో ఊహించండి.. సెకన్ల యాడ్ లో నటించి రూ.5 కోట్లు తీసుకుందంటే.. ఈ బ్యూటీ కియారా అద్వానీ నో.. అలియా భట్.. కత్రినా కైఫ్ .. లేదా ఐశ్వర్యారాయ్ కావచ్చని అనుకుంటున్నారా? అయితే.. మీరు పప్పులో కాలేసినట్టు.. ఆ అమ్మడు బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కానే కాదు. ఇంకో హింట్ ఏంటంటే.. అది కూడా మన టాలీవుడ్ స్టార్ అండ్ సౌత్ ఇండియన్ సార్ట్ హీరోయిన్. సెకన్ల యాడ్ కు కోట్లు వసూల్ చేసే సౌత్ ఇండియన్ బ్యూటీ ఎవరు ? ఈ ముద్దుగుమ్మ మరెవరో కాదండీ.. సౌత్ ఇండియన్ హీరోయిన్ నయనతార. సౌత్ సినిమాల్లోనే కాకుండా బాలీవుడ్ ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు. ఆమెను చాలా మంది సౌత్ 'లేడీ సూపర్ స్టార్' అని పిలుస్తారు. దక్షిణాది హీరోయిన్లలో ఆమెనే హాయ్యేస్ట్ రెమ్యునరేషన్ తీసుకుంటారు. మొట్టమొదటగా నయనతార 2003లొ మళయాళ మూవీ మనసినక్కరే తో ఇండస్ట్రీలో అడుగుపెట్టింది. ఆ తర్వాత చంద్రముఖి సినిమాలో రజనీకాంత్ సరసన నటించి మంచి పాపులర్టీ దక్కించుకుంది. ఈ అమ్మడు సినిమాల్లో నటించడానికి కూడా భారీ మొత్తంలోనే వసూలు చేస్తోంది. మీడియా కథనాల ప్రకారం, నటి ఒక చిత్రానికి దాదాపు 10 కోట్ల రూపాయలు వసూలు చేస్తుంది. గతేడాది బాలీవుడ్‌లో కూడా తొలిసారిగా నయన్ మెరిసింది. కింగ్ ఖాన్ షారుక్ ఖాన్ 'జవాన్' తో బాలీవుడ్ లోకి కూడా ఎంటీ ఇచ్చింది నయనతార. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ప్రకంపనలు సృష్టించింది. భారీ వసూళ్లతో అందరినీ ఆశ్చర్యపరిచింది.ఈ చిత్రంలో నటించినందుకు భారీ మొత్తంలో రెమ్యూరేషన్ అందుకున్నట్టు తెలుస్తోంది. తన రెండు దశాబ్దాల సినీ కెరీర్ లో 75కి పైగా చిత్రాల్లో ఆమె నటించి మెప్పించింది. ఎన్నో అవార్డు అందుకుంది. ఇదెలా ఉంటే.. ప్రముఖ డీటీహెచ్ సంస్థ టాటా స్కై యాడ్ లో నటించడానికి నయనతార భారీ మొత్తం రెమ్యూనరేషన్ వసూలు చేసిందంట. ఈ టాటా స్కై యాడ్ ను రెండు రోజులు షూట్ చేశారంట. తమిళం, తెలుగు, మలయాళం , కన్నడ భాషలలో ఈ యాడ్ ప్లే అవుతోంది. కేవలం 50 సెకన్ల ప్రకటన కోసం దాదాపు 5 కోట్లు వసూలు చేసినట్టు తెలుస్తోంది. ఇక 50 సెకన్ల యాడ్ కోసం 5 కోట్లు వసూలు చేసి భారతదేశంలో అత్యధిక పారితోషికం తీసుకునే నటిగా రికార్డు క్రియేట్ చేసింది నయనతార. ఇక నయనతార నెట్ వర్త్ గురించి తెలుసుకుంటే షాక్ కావాల్సిందే. చాలా మంది హీరోయిన్స్ ఆమె నెట్ వర్త్ ను టచ్ కూడా చేయలేరు. పలు నివేదికల ప్రకారం.. నటి నయనతార.. చాలా లగ్జరీ లైఫ్ ను లీడ్ చేస్తోంది. దాదాపు రూ.100 కోట్లకు ఆమె ఓనర్. నయనతారకు ముంబైలో 4 బెడ్‌రూమ్ లగ్జరీ ఫ్లాట్ ఉంది. ఇది కాకుండా.. ఆమెకు సౌత్‌లో విలాసవంతమైన బంగ్లా ఉంది. ఇక ఆమె కార్ల గురించి మాట్లాడితే.. BMW 5 సిరీస్, BMW 7 సిరీస్, టయోటా ఇన్నోవా వంటి ఖరీదైన కార్లు ఉన్నాయి అలాగే..నయన తారకు అత్యంత ఖరీదైన ప్రైవేట్ జెట్ కూడా ఉంది.



# మెగాస్టార్ చిరంజీవికి అక్కినేని జాతీయ అవార్డు

### ప్రకటించిన అక్కినేని నాగార్జున



మెగాస్టార్ చిరంజీవికి అక్కినేని జాతీయ అవార్డుకు ఎంపికయ్యారు. అక్టోబర్ 28న అవార్డు ప్రదాన కార్యక్రమం జరుగనున్నది. ఈ కార్యక్రమానికి ప్రముఖ బాలీవుడ్ నటుడు అమితాబ్ బచ్చన్ ముఖ్య అతిథిగా హాజరై చిరంజీవికి అవార్డును అందజేయనున్నారు. ఈ విషయాన్ని నటుడు అక్కినేని నాగార్జున ప్రకటించారు. శుక్రవారం అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి సందర్భంగా హైదరాబాద్‌లో వేడుకలు నిర్వహించారు. ఆర్కే సినీ ప్లెక్స్‌లో ఏఎన్నార్ శత జయంతి వేడుకలు జరిగాయి. కార్యక్రమానికి నాగార్జునతో పాటు కుటుంబ సభ్యులు, ప్రముఖ దర్శకుడు రాఘవేంద్ర రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ తన తండ్రి నాగేశ్వరరావు నవ్వుతూ జీవించడం నేర్పించారన్నారు. ఈ వారాంతంలో ఫిల్మ్ ఫెస్టివల్ జరుగుతోందని.. అన్నపూర్ణ స్టూడియోలో అభిమానులు రక్తదానం చేశారన్నారు. అభిమానుల ఆదరణ మా కుటుంబం ఎప్పుడూ మరిచిపోదన్నారు. రెండేళ్లకోసారి ఏఎన్నాఆర్ అవార్డులు ఇస్తున్నామని.. ఈ సారి చిరంజీవికి ఇవ్వాలని నిర్ణయించుకున్నామన్నారు. అక్టోబర్ 28న అవార్డు ప్రదాన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

**అక్కినేనితో ప్రత్యేక అనుబంధం.. గుర్తు చేసుకున్న చిరు..**

అక్కినేని శత జయంతి సందర్భంగా మెగాస్టార్ చిరంజీవి ఆయనను స్మరించుకున్నారు. ఆల్ టైమ్ గ్రేట్ నటుల్లో ఒకరైన నాగేశ్వరరావుని ఆయన శత జయంతి రోజున స్మరించుకుందామన్నారు. నాగేశ్వరరావు నటనా మేధావి అన్న ఆయన.. అద్భుతమైన నటనా ప్రదర్శనలు తెలుగు ప్రేక్షకుల హృదయాలలో నిలిచిపోయాయరన్నారు. సినీ పరిశ్రమకు ఆయన చేసిన సేవలు వెలకట్టలేనివన్నారు. మెకానిక్ అల్లుడు సినిమాలో ఆయనతో కలిసి నటించే అవకాశం, అదృష్టం తనకు దక్కిందన్నారు. ఆయనతో గడిపిన క్షణాలు, ఆయన అద్భుత జ్ఞాపకాలను ఎప్పటికీ గౌరవిస్తానని మెగాస్టార్.. నాగేశ్వరరావుతో కలిసి ఉన్న ఫొటోను అభిమానులతో పంచుకున్నారు.

# 'బొమ్మరిల్లు' మూవీ.. ఆ సీన్ కోసం 35 టేక్‌లు తీసుకున్న జెనీలియా

కోలీవుడ్ నటుడు సిద్దార్థ్, జెనీలియా జంటగా నటించిన బ్లాక్ బస్టర్ క్లాసిక్ చిత్రం 'బొమ్మరిల్లు' . సిద్దార్థ్, జెనీలియా దర్శకుడు భాస్కర్‌తో పాటు టాలీవుడ్ అగ్ర నిర్మాత దిల్ రాజు కెరీర్‌లో మర్చిపోలేని చిత్రాలలో ఇది ఒకటి. 2006లో విడుదలైన ఈ చిత్రం బ్లాక్ బస్టర్ అందుకుంది. భాస్కర్ తెరకెక్కించిన ఈ చిత్రం యువతకు బాగా కనెక్ట్ అవ్వడంతో పాటు థియేటర్లో 100 రోజులు ఆడిన చిత్రంగా నిలిచింది. ఈ సినిమాతోనే దర్శకుడు భాస్కర్ 'బొమ్మరిల్లు భాస్కర్'గా మారాడు. అయితే ఈ సినిమా రేపు రీ రిలీజ్ అవుతున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా మూవీకి సంబంధించిన విషయాలను దర్శకుడు భాస్కర్ ఒక ఇంటర్వ్యూలో పంచుకున్నాడు. ఈ సినిమా షూటింగ్‌లో భాగంగా భాస్కర్ మీదా కోపంతో జెనీలియా వెళ్లిపోయినట్లు భాస్కర్ చెప్పుకోచ్చాడు. ఈ సినిమా మొదటిరోజు షూటింగ్‌లో ఐస్‌క్రీమ్ సీన్ షూట్ చేశాం. జెనీలియా, సిద్దార్థ్ అప్పుడే వచ్చి జాయిన్ అయ్యారు. ఈ సీన్‌లో తింటావా అనే ఒక డైలాగ్ ఉంది. అయితే ఈ సీన్ కోసం రాత్రి 10 గంటలకు మొదలుపెడితే తెల్లవారేవరకు తీశాం. కనీసం 35 టేక్‌లు తీసుకున్నాను. దీంతో జెనీలియా కోపంతో నా దగ్గరికి వచ్చి ఎంటి రెండు ముక్కల డైలాగ్ చెప్పలేనా నేను అంటూ నేను ఈ సినిమా చేయను అంటూ వెళ్లిపోయింది. అయితే ఆ రోజు షూటింగ్‌కు అల్లు అర్జున్ వచ్చాడు. తానే జెనీలియా దగ్గరికి వెళ్లి అలా చేయకు. ఇది మంచి సినిమా, మంచి దర్శకుడు మొదటిరోజే జడ్జ్ చేయకు.. ఈ సినిమా చేయి అంటూ తనను ఒప్పించాడు అంటూ భాస్కర్ చెప్పుకోచ్చాడు. కాగా ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది.



# తక్కువ బడ్జెట్‌లో ఒక చిన్న సినిమా చేయాలని ఉంది: ఎన్టీఆర్

టాలీవుడ్ అగ్ర కథానాయకుడు ఎన్టీఆర్ ప్రస్తుతం దేవర ప్రమోషన్స్‌లో బిజీ బిజీగా గడుపుతున్న విషయం తెలిసిందే. ఆయన ప్రధాన పాత్రల్లో వస్తున్న ఈ సినిమాకు కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్నాడు. జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తుంది. ఈ చిత్రం దసరా కానుకగా సెప్టెంబర్ 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇక విడుదల తేదీకి ఇంకా వారం రోజులే ఉండడంతో వరుస ప్రమోషన్స్‌లో పాల్గోంటున్నాడు తారక్. ఈ క్రమంలోనే ఒక ఇంటర్వ్యూలో పాల్గోన్న తారక్ తనకు ఒక చిన్న సినిమా చేయాలని ఉంది అని మనసులోని మాటను బయటపెట్టాడు. నాకు తక్కువ బడ్జెట్‌లో ఒక చిన్న సినిమా చేయాలని ఉంది. 40 రోజుల్లోనే ఆ మూవీ షూటింగ్ అయిపోవాలి. కథ నచ్చి అవసరమైతే ఆ సినిమాను నేను నిర్మించడానికి రెడీగా ఉన్నాను. కానీ ఎప్పటికైనా కచ్చితంగా చేసి తీరతాను అంటూ తారక్ చెప్పుకోచ్చాడు.



# కమల్‌హాసన్ థగ్ లైఫ్ షూట్‌కు ప్యాకప్


### డిజిటల్ రైట్స్‌లో అరుదైన రికార్డ్




ఉలగనాయగన్ కమల్‌హాసన్ కాంపౌండ్ నుంచి వస్తోన్న తాజా చిత్రం 'థగ్ లైఫ్' . లెజెండరీ డైరెక్టర్ మణిరత్నం డైరెక్షన్‌లో KH234 ప్రాజెక్టుగా వస్తోన్న థగ్ లైఫ్‌లో ఐశ్వర్యలక్ష్మి, త్రిష, ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. కోలీవుడ్ స్టార్ యాక్టర్ శింబు కీలక పాత్రలో నటిస్తుండగా.. గౌతమ్ కార్తీక్, జోజు జార్జ్, దుల్కర్ సల్మాన్, జయం రవి ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు.నేటితో థగ్ లైఫ్ షూటింగ్ పూర్తయింది. అంతేకాదు ఈ మూవీ డిజిటల్ రైట్స్ రూ.149.7 కోట్లకు అమ్ముడుపోయాయి. ఈ మొత్తం కోలీవుడ్ సినీ చరిత్రలోనే అత్యధికం కావడం విశేషం. థగ్ లైఫ్ చిత్రాన్ని 2025 వేసవి కానుకగా ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. కమల్ హాసన్ క్రేజ్ ఎలా రేంజ్‌లో ఉందో తాజా వార్త మరోసారి చెప్పకనే చెబుతోంది. కొత్త ఆరంభ సమయం.. కొత్త థగ్ (క్రిమినల్)కు స్వాగతం పలికే సమయం.. అంటూ మేకర్స్ షేర్ చేసిన శింబు Sigma Thug Rule వీడియో ఇప్పటికే నెట్టింటిని షేక్ చేస్తోంది. మణిరత్నం టీం ఇప్పటికే థగ్ లైఫ్ టీంతో డిజైన్ చేసిన వీడియో సినిమాపై సూపర్ హైప్ క్రియేట్ చేస్తోంది. ఈ మూవీకి ఆస్కార్ విన్నర్ ఏఆర్ రెహమాన్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఈ చిత్రాన్ని కమల్ హాసన్-ఉదయనిధి స్టాలిన్ సమర్పణలో రాజ్‌కమల్ ఫిలిం ఇంటర్నేషనల్, రెడ్ జియాంట్ మూవీస్, మద్రాస్ టాకీస్ బ్యానర్లపై కమల్ హాసన్-ఆర్ మహేంద్రన్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు.

# అంతర్జాతీయ అవార్డుల బరిలో శోభిత ధూళిపాళ్ల

బాలీవుడ్ ప్రముఖ హీరో అనిల్ కపూర్ , ఆదిత్యరాయ్ కపూర్, శోభిత ధూళిపాళ్ల నటించిన వెబ్ సిరీస్ 'ది నైట్ మేనేజర్ . మంచి విజయాన్ని అందుకున్న ఈ సిరీస్ ఇప్పుడు అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. ఇంటర్నేషనల్ అవార్డుల బరిలో ప్రపంచవ్యాప్తంగా విడుదలైన సిరీస్లతో పోటీ పడనుంది. 52వ ఎమ్మీ అవార్డులు నామినేషన్ను తాజాగా ప్రకటించారు. అందులో భారత్ నుంచి 'ది నైట్ మేనేజర్' మాత్రమే పోటీలో నిలవడం విశేషం. డ్రామా సిరీస్ విభాగంలో ఆస్ట్రేలియా, అర్జెంటీనా, ఫ్రాన్స్కు చెందిన సిరీస్ లతో శోభితా సిరీస్ పోటీపడనుంది. నవంబర్ 25న న్యూయార్క్ లో ఎమ్మీ అవార్డుల వేడుక జరగనుంది.'ది నైట్ మేనేజర్' ఎమ్మీ అవార్డుల్లో నామినేషన్ దక్కించుకోవడంపై అనిల్ కపూర్, దర్శకుడు సందీప్ మోదీ స్పందించారు. 'నేను నమ్మలేకపోతున్నా. టీమ్లోని వారందరికీ మెసేజ్లు పెట్టా. మేమంతా ఒకరితో ఒకరం మాట్లాడుకుంటూనే ఉన్నాం' అని అనిల్కపూర్ సంతోషం వ్యక్తంచేశారు. ఆనందంతో కన్నీళ్లు వస్తున్నాయని దర్శకుడు తన ఇన్స్టాలో పేర్కొన్నారు. ఈ సిరీస్ కోసం వర్క్ చేసిన వారందరికీ ధన్యవాదాలు చెప్పారు. థ్యాంక్యూ గాడ్ అని రాసుకొచ్చారు. 2016లో వచ్చిన ఆంగ్ల సిరీస్ 'ది నైట్ మేనేజర్' ను అదే పేరుతో ఓటీటీ సంస్థ 'డిస్నీ + హాట్ స్టార్' హిందీ, తెలుగు, తమిళ్, కన్నడ, మలయాళం, బెంగాలీ, మరాఠీలో రీమేక్ చేసి ప్రసారం చేసింది. ఈ సిరీస్ ప్రేక్షకాదరణను సొంతం చేసుకోవడంతో దీని రెండో సీజన్ను తెరకెక్కించారు. అదీ మంచి విజయాన్ని అందుకుంది.



# పవన్ కల్యాణ్ ఈజ్ బ్యాక్..

### యాక్షన్ సీక్వెన్స్ 'హరిహర వీరమల్లు' షూట్

**హైదరాబాద్:** పవన్ కల్యాణ్ కథానాయకుడిగా రూపొందుతున్న పీరియాడిక్ యాక్షన్ అడ్వెంచర్ మూవీ 'హరి హర వీరమల్లు'. రెండు భాగాలుగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. తొలి భాగానికి సంబంధించి చిత్రీకరణ ముగింపు దశకు చేరుకుంది. ఏడాదిగా పవన్ రాజకీయాల్లో బిజీగా ఉండటంతో ఈ సినిమా మిగిలిన చిత్రీకరణ వాయిదా పడుతూ వస్తోంది. పవన్ పాత్రకు సంబంధించి 20 రోజుల షూట్ మాత్రమే మిగిలిఉంది. దీంతో తన సన్నివేశాలను పూర్తి చేసేందుకు పవన్ కల్యాణ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఉప ముఖ్యమంత్రిగా తీరిక లేకుండా ఉన్న ఆయన సినిమా షూటింగ్కు తాజాగా సమయాన్ని కేటాయించారు. ఈనెల 23న విజయవాడలో 'హరిహర వీరమల్లు' కొత్త షెడ్యూల్ ప్రారంభం కానుంది. ఇందులో పవన్ సహా కీలక నటీనటులు పాల్గొంటారు. హాలీవుడ్ స్టంట్ డైరెక్టర్ నిక్ పాల్ ఆధ్వర్యంలో భారీ యాక్షన్ సన్నివేశాలు షూట్ చేయనున్నారు. జ్యోతికృష్ణ దర్శకత్వంలో పాన్ ఇండియాగా తెరకెక్కనున్న ఈ మూవీ ఈ ఏడాది చివరికి ప్రేక్షకుల ముందుకు రానుంది. షూటింగ్ కోసం విజయవాడ పరిసర ప్రాంతాల్లో బ్లూమ్యాట్ సెట్ను సిద్ధం చేశారు. అందులోనే దర్శకుడు జ్యోతికృష్ణ ముఖ్య తారాగణంపై కొన్ని కీలక సన్నివేశాల చిత్రీకరణ చేస్తున్నారు. మరోమూడు రోజుల్లో పవన్ కూడా సెట్లో అడుగుపెట్టనున్నారు. దీనికి తగ్గట్లుగానే మరోవైపునిర్మాణానంతర పనుల్ని చకచకా పూర్తి చేస్తున్నారు. రెండు భాగాలుగా రానున్న ఈ మూవీ. తొలిభాగం 'హరి హర వీరమల్లు పార్ట్ 1: స్వార్డ్ వర్సెస్ స్పిరిట్ పేరుతో విడుదల కానుంది. అనుపమ్ఖేర్, బాబీ దేవోల్, నిధి అగర్వాల్, నోరాహి ఫతేహి, విక్రమ్ జీత్, జిషుసేన్ గుప్త తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com